సోమవారం
16•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 171
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE









## శ్రీరాజరాజేశ్వర జలశోభ

23 టీఎంసీలకు చేరిన నీటినిల్వ

ఎల్ఎండీలో నిర్ణీతస్థాయి తర్వాత పూర్తిస్థాయిలో నిల్వ

**దశాబ్దాల** తర్వాత శ్రీరాజరాజేశ్వర జలాశయం ఇప్పుడు నిండుగా నీటితో మిలమిల మెరిసిపోతున్నది. తెలంగాణ జీవధార అయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన జంక్షన్ రిజర్వాయర్‌గా ఉన్న ఈ జలాశయంలో సాంకేతికంగా ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయడానికి మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక ప్రొటోకాల్‌కు అనుగుణంగా రిజర్వాయర్‌లో నీటిస్థాయిని పెంచుకుంటూ.. జాగ్రత్తలు తీసుకోవడంతో శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు) పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 23 టీఎంసీలకు చేరిన నీటినిల్వను త్వరలోనే వందశాతం నిల్వకు తెచ్చేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది.

3



పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీ - మధుర రోడ్డులో ఆందోళనకారులు బస్సులకు నిప్పుపెట్టిన దృశ్యం. (ఇన్‌సెట్) గువాహటిలో పౌరసత్వ చట్టాన్ని నిరసిస్తూ శాంతియుతంగా జరిగిన సంగీత విభావరిలో నినాదాలు చేస్తున్న యువతి

# ఉపాధి కల్పనలో నం 1

చేతినిండా పని కల్పించిన తెలంగాణ ప్రభుత్వం.. రికార్డు స్థాయిలో పనిరోజులు

టార్గెట్ 10 కోట్ల పనిరోజులు.. అదనంగా 2 కోట్ల పనిరోజులకు అనుమతి.. ఇప్పటివరకు 9.85 కోట్ల పనిరోజులు పూర్తి

కూలీలకు రూ.1477.36 కోట్లు చెల్లింపు.. పని రికార్డులో రాజన్నసిరిసిల్లకు అవార్డు.. ఈసారి 100 శాతం పనులకు పోటీపడుతున్న 32 జిల్లాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కూలీల్లో భరోసా నింపింది. ఉపాధిహామీ పైనే ఆధారపడి జీవిస్తున్న పేద కూలీలకు చేతినిండా పనికల్పించి లక్ష్యసాధనలో మిగతారాష్ట్రాల కంటే ముందంజలో నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ముందుగానే లక్ష్యాన్ని చేరుకున్నది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే రాష్ట్రానికి కేటాయించిన పనిరోజులు పూర్తి కానుండటంతో అదనంగా మరిన్ని పనిరోజులు కల్పించాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరడంతో రెండుకోట్ల పనిరోజులను కేటాయించింది. ప్రస్తుతం 9.85 కోట్ల పనిదినాలను పూర్తిచేసుకొని దేశంలోనే 87.38% ప్రగతితో మన రాష్ట్రం ముందువరుసలో ఉన్నది. దాదాపు 14 రాష్ట్రాల్లో ఉపాధి హామీ ప్రగతి 50శాతం మించలేదు. నీటి సంరక్షణ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, హరిత హారం, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం.. ఇలా పలురకాల పనులు కల్పించి.. తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా పలు పథకాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం కే చంద్రశేఖర్‌రావు.. కూలీలకు పనికల్పించేవిధంగా నిర్ణయాలు తీసుకొన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలుచేయడంతో పది కోట్ల పని దినాల లక్ష్యాన్ని ముందుగానే చేరుకోగలిగారు. రాష్ట్రంలోని 33 జిల్లాలవారీగా ఉపాధిహామీ

మిగతా 2వ పేజీలో

**2018-19లో** రాష్ట్రంలో సగటున 90 నుంచి 96% పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తిచేయడంతోపాటు కేంద్రప్రభుత్వ నిబంధనల మేరకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన పనుల్లో ఉపాధికూలీలకు భాగస్వామ్యం కల్పించిన రాజన్నసిరిసిల్ల జిల్లాకు దేశంలోనే ప్రథమస్థానం దక్కింది. వాగులు, ఇతర ప్రాంతాల్లో నీటి సంరక్షణ చేపట్టి, చెక్‌డ్యాంలు, చిన్న చెరువుల పునరుద్ధరణ పనులు చేసినందుకు సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు కేంద్రం అవార్డులు ప్రకటించింది.



# రాజధాని రణరంగం!

ఢిల్లీకి పాకిన 'పౌరసత్వ' సెగలు.. జామియా వర్సిటీ విద్యార్థుల ఆందోళన

నాలుగు బస్సులు, రెండు పోలీస్ వాహనాలకు నిప్పు

వర్సిటీలోకి ప్రవేశించిన పోలీసులు.. పలువురు అదుపులోకి

పోలీస్ చర్యను ఖండించిన యూనివర్సిటీ వీసీ..

ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట రాత్రంతా విద్యార్థుల ఆందోళన.. మెట్రో స్టేషన్ల మూత

బెంగాల్‌లో కొనసాగిన హింసాత్మక ఘటనలు.. అసోంలో శాంతియుత నిరసన

**న్యూఢిల్లీ/కోల్‌కతా/గువాహటి, డిసెంబర్ 15:**

దేశ రాజధానిలో 'పౌరసత్వ' సెగలు నిప్పు రాజేశాయి. వివాదాస్పద సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీలో జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారింది. నాలుగు బస్సులు, రెండు పోలీస్ వాహనాలకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఒక అగ్నిమాపక యంత్రాన్ని ధ్వంసం చేశారు. ఆందోళనకారులపై పోలీసులు లాఠీచార్జి జరిపారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో విద్యార్థులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహా సుమారు 60 మంది గాయపడ్డారు. అనుమతి లేకుండానే పోలీసులు జామియా వర్సిటీలోకి ప్రవేశించి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ చర్యను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ నజ్మా అఖ్తర్ ఖండించారు. హింసతో తమకు సంబంధం లేదని, అది 'స్థానిక వ్యక్తులే' పనేనని విద్యార్థులు పేర్కొన్నారు. వర్సిటీ కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. పోలీసుల చర్యను నిరసిస్తూ ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట విద్యార్థులు ఆదివారం రాత్రి ఆందోళనకు

మిగతా 5వ పేజీలో

# పసుపు బోర్డు ఏదీ?

## అర్వింద్.. బోర్డు తెస్తావా? రాజీనామా చేస్తావా?

నిజామాబాద్ ఎంపీ తీరుపై బాల్కొండ పసుపు రైతుల ఆగ్రహం

వేల్పూర్ మండలం లక్కోరాలో సమావేశం

ఎంపీ అర్వింద్‌పై ప్రశ్నల వర్షం

2

"ఎంపీ అర్వింద్ నువ్వెప్పుడైనా పసుపు పండించావా? నీకు పసుపు బోర్డు గురించి అవగాహన ఉన్నదా? బోర్డు గురించి మాకు తెలియదంటావా? అడిగితే కల్లు తాగిన కోతులంటూ అవమానిస్తావా? దమ్ము, ధైర్యం ఉంటే రైతుల ముందుకు రా. బోర్డు తెస్తాననే కదా బాండ్ రాసినవు? ఇప్పుడెందుకు మాటమార్చి పిచ్చోడిలెక్క మాట్లాడుతున్నవు?

\- బాల్కొండ నియోజకవర్గ పసుపు రైతులు

## "నాకు అంతగా తెల్వదు..



ఇంతగనం దీనిపై (పసుపు బోర్డు ఏర్పాటుపై) స్టడీ ఏడచేసిన నేను.. నేను కేసీఆర్, ఆయన బిడ్డను ఓడగొట్టుడు తప్ప వేరే ఆలోచించలేదు. నా ఆలోచన ఎప్పుడూ అదే ఉండే. 178 మంది రైతులు నామినేషన్లు వేస్తరని నాకు తెలుసా? పసుపుది దేశమంతా ఇంత ఇష్యూ అయితదని అనుకోలేదు.

\- ఎంపీ ధర్మపురి అర్వింద్



ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ దగ్గర పంతంగి టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

# స్లో ట్యాగ్!

- అవగాహన లేదు.. అనుసంధానం కాలేదు
- అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్
- తొలిరోజు టోల్‌ప్లాజాల వద్ద వాహనదారుల ఇక్కట్లు
- గంటలకొద్దీ నిలిచిన వాహనాలు
- చుక్కలు చూపించిన టోల్‌ప్లాజా నిర్వాహకులు
- ట్రాఫిక్ డైవర్ట్ చేసినా తప్పని తిప్పలు

**టోల్‌ప్లాజాల** దగ్గర చెల్లింపుల కోసం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఫాస్టాగ్ కాస్తా.. తొలిరోజు స్లో ట్యాగ్‌గా మారింది. పూర్తిస్థాయిలో ప్రచారం జరుగకపోవడం.. వాహనదారులకు అవగాహన లేకపోవడం, ఫాస్టాగ్‌తో అనుసంధానం కాకపోవడం.. టోల్‌ప్లాజా నిర్వాహకులు అతి విశ్వాసంతో నగదు చెల్లింపు కౌంటర్ల సంఖ్యను పరిమితం చేయడంతో.. ఆదివారం సెలవుదినం టోల్‌ప్లాజాల దగ్గరే ఆవిరైపోయింది. ముఖ్యంగా గూడూ రు, పంతంగి టోల్‌ప్లాజాల దగ్గర కిలోమీటర్లకొద్దీ వాహనాలు ఆగిపోయాయి. ఒకదశలో టోల్‌ప్లాజా దాటడానికి వీలేలేని పరిస్థితి నెలకొన్నది. చివరకు సర్వీస్‌రోడ్డులోకి ట్రాఫిక్ డైవర్షన్ చేసి నా.. కిలోమీటర్ దాటడానికి గంటలకొద్దీ సమయం పట్టింది.

వివరాలు 3వ పేజీలో



## విజయ పాలు లీటరుకు రూ.2 పెంపు

నేటి నుంచి అమల్లోకి

6



## పాన్-ఆధార్ లింక్ గడువు డిసెంబర్ 31

ఐటీ శాఖ ప్రకటన

5

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 87.00 | రిటైల్ లైవ్ | 109.00 |
| డ్రెస్‌డ్ | 158.00 | స్కిన్‌లెస్ | 180.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 433.00 | రంగారెడ్డి | 433.00 |
| మెదక్ | 433.00 | కరీంనగర్ | 436.00 |
| వరంగల్ | 436.00 | డజన్ ధర | 66.00 |

**మా కుమార్తెలాంటివారు ఎంతోమంది..**

## వారికి సత్వరన్యాయంకోసం పోరాడుతాం



'నిర్భయ' తల్లిదండ్రుల స్పష్టీకరణ

నిర్భయ ఘటనకు నేటితో ఏడేండ్లు!

5

**ఉప్పల్ భగాయత్ ఈ-వేలం రెండోరోజు**

## చదరపు గజం రూ.79,900

అతి తక్కువ రూ.30,200

43 ప్లాట్లకు రూ. 140 కోట్ల ఆదాయం

2






హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో ఆదివారం రాత్రి భాగవత సప్తాహంలో ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు.. ప్రవచనాలు వింటున్న సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తదితరులు

# మనిషి జన్మ గొప్ప వరం

భాగవత సప్తాహంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు

హాజరైన సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు

**కాచిగూడ:** మనిషి జన్మ పొందడం గొప్ప వరమని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. దృష్టికోణం ఎలా ఉండాలన్నది భాగవతం తెలుపుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న భాగవత సప్తాహంలో భాగంగా రెండోరోజు ఆదివారం చాగంటి కోటేశ్వర్‌రావు తన ప్రవచనామృతధారతో భక్తులను మంత్రముగ్ధుల్ని చేశారు. ధర్మమనేది ఒక మానవజన్మకే అన్వయించబడిందని, మనిషి ధర్మాన్ని విడిచినచోట శాంతి ఉండదని చెప్పారు. ఇతరుల సంతోషం, బాధల్లో పాలుపంచుకోవాలని సూచించారు. బాధల్లో పాలుపంచుకోకపోతే మనిషి జన్మకు అర్థంలేదన్నారు. ధర్మబద్ధమైన అర్థం, ధర్మబద్ధమైన కామం మోక్షానికి కారణమవుతాయని తెలిపారు. ఒద్దికన్నా గొప్పది లోకంలో ఏదీలేదని, భగవంతుడిపై దృష్టి పెట్టినవారే ధన్యులవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన ఉప్పల్ భగాయత్ లే అవుట్

# గజం ధర రూ.79,900

- ఉప్పల్ భగాయత్‌లో 525 గజాల ప్లాట్‌ను దక్కించుకున్న బిడ్డర్
- అతి తక్కువ ధర గజానికి రూ.30,200
- ఆదివారం 43 ప్లాట్ల ఈ-వేలంతో హెచ్‌ఎండీఏకు రూ.140 కోట్లు
- శనివారం 58 ప్లాట్లకు రూ.155.05 కోట్ల ఆదాయం
- ఈస్ట్ లుక్ వైపు మొగ్గుచూపుతున్న రియల్టర్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ రియల్ సత్తాను చాటింది. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన ఫేజ్-1 లే అవుట్‌లోని 525 గజాల ప్లాట్ (నంబర్-127)ను గజానికి ఏకంగా రూ.79,900 వెచ్చించి ఓ బిడ్డర్ దక్కించుకున్నారు. దీంతో హైదరాబాద్ రియల్ రంగంలో జోరు తగ్గలేదని నిరూపితమైంది. మూడురోజుల ఈ వేలంలో తొలిరోజు శనివారం 52 ప్లాట్లకు హెచ్‌ఎండీఏ రూ.155 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకోగా, అత్యధికంగా ఓ ప్లాట్‌కు గజానికి రూ.77 వేలు పలికింది. ఆదివారం ఈ వేలం నిర్వహణలో రికార్డు ధరను అధిగమించి 127వ నంబర్ ప్లాట్ గజానికి రూ.79,900 ధర పలుకడం సంస్థకు బూస్ట్‌నిచ్చింది. ఈ ప్లాట్ మినీ శిల్పారామానికి ఎదురుగా, నాగోల్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటం, నార్త్ ఈస్ట్‌తోపాటు ప్లాట్‌కు ఇరువైపులా 100, 80 ఫీట్ల రోడ్డు ఉండటంతో ఈ ప్లాట్‌ను దక్కించుకొనేందుకు పోటీపడ్డారు. అతి తక్కువగా గజానికి రూ. 30,200కు ప్లాట్ అమ్ముడుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈస్ట్ లుక్ పాలసీతోపాటు మెట్రో రైల్వేస్టేషన్‌కు అతిసమీపంలోనే ఈ లే అవుట్ ఉండటం కూడా హెచ్‌ఎండీఏకు రెండురోజుల ఈ వేలంలో రూ.295 కోట్ల ఆదాయాన్ని సమకూర్చింది. చిన్న సైజు ప్లాట్లు కావడంతో అధిక రేటు పలికాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఈ వేలంపాట్లో అందరిలో అంచనాలు పెరిగాయి. పెద్ద సైజు వెయ్యి నుంచి రెండు వేల గజాలకుపైగా ప్లాట్లు ఉండటం, ఇవి కమర్షియల్, మల్టీపర్పస్ కావడంతో ఏ మేరకు ధర పలుకుతాయోనన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది.

**అంచనాలకు మించి బిడ్డర్ల పోటీ**

ఉప్పల్ భగాయత్ లే అవుట్ ప్లాట్లు రికార్డు స్థాయి ధరకు అమ్ముడుపోతున్నాయి. అధికారుల అంచనాలకు మించి బిడ్డర్లు పోటాపోటీగా ప్లాట్లను దక్కించుకుంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 7, 8 తేదీల్లో నిర్వహించిన ఉప్పల్ భగాయత్ ఫేజ్-1 ఈ వేలంలో అత్యధిక గజానికి రూ.73,900 పలికితే.. ఈసారి ఆ ధరను మించిపోయింది. హెచ్‌ఎండీఏ వేలంలో శనివారం గజానికి రూ.77 వేలు, ఆదివారం రూ.79,900 ధర పలికి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన ప్లాట్లు కావడంతోపాటే ప్రజలు బాగా ఆదరిస్తున్నారని, ఈ లేఅవుట్‌లో ప్లాట్లు తీసుకొంటే ఎలాంటి వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండొచ్చనే భావనతో అధిక ధరలు వెచ్చిస్తున్నారని హెచ్‌ఎండీఏ అధికారులు చెప్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం మూసీ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వడం, ఈ నది వెంట హెచ్‌ఎండీఏ చేపట్టిన బ్యూటిఫికేషన్, మినీ శిల్పారామం, ప్రతిపాదిత భారీ కన్వెన్షన్ సెంటర్ లాంటి ప్రణాళికలు కూడా ఈ ప్లాట్లు అధిక ధర పలికేందుకు దోహదపడ్డాయని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

# అర్వింద్.. పసుపు బోర్డు ఏదీ?

## బోర్డు తెస్తావా? రాజీనామా చేస్తావా?

- నిజామాబాద్ ఎంపీ తీరుపై బాల్కొండ పసుపు రైతుల ఆగ్రహం
- వేల్పూర్ మండలం లక్కోరాలో సమావేశం.. ఎంపీ అర్వింద్‌పై ప్రశ్నల వర్షం

**నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:**

'ఎంపీ అర్వింద్ నువ్వెప్పుడైనా పసుపు పండించావా? నాగలి పట్టావా? అసలు నీకు పసుపు బోర్డు గురించి అవగాహన ఉన్నదా? బోర్డు గురించి మాకు తెలియదంటావా? అడిగితే కల్లు తాగిన కోతులంటూ అవమానిస్తావా? అసలు అర్వింద్ అంటే ఎంతమందికి తెలుసు? ఎవరికీ తెల్వదు. బోర్డు కోసమే బీజేపీకి ఓటేశారు. దమ్ము, ధైర్యం ఉంటే రైతుల ముందుకు రా. మేము వంద ప్రశ్నలు అడుగుతాం. సమాధానం చెప్తావా? పసుపు బోర్డు గురించి మాకు తెల్వదు సరే. మరీ నీ తెలివి ఎక్కడికి పోయింది? బోర్డు తెస్తానని కదా బాండ్ రాసినవు? ఇప్పుడెందుకు మాట మార్చి పిచ్చోడిలెక్క మాట్లాడుతున్నవు?' అంటూ నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పసుపు రైతులు ఎంపీ అర్వింద్‌ను నిలదీశారు. ప్రశ్నల వర్షం కురిపించారు. ఆదివారం దాదాపు 300 మంది రైతులు వేల్పూర్ మండలం లక్కోరాలో సమావేశమయ్యారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ముప్కాల్ రైతు సామ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీగా గెలిచిన తర్వాత ఐదురోజుల్లో పసుపు బోర్డు తెస్తానని మాట ఇచ్చిన అర్వింద్.. గెలిచిన తర్వాత పత్తా లేకుండా పోయారని విమర్శించారు. అప్పుడు అర్వింద్‌తో కలిసి మోసంచేసిన రైతు సంఘం నాయకులు.. ఇప్పుడు మళ్లీ పాదయాత్ర పేరుతో మోసంచేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అర్వింద్ బాండ్ పేపర్ రాసేందుకు ప్రధాన కారకుడైన రైతు సంఘం నేత అన్వేశ్‌రెడ్డి ఇప్పుడు మాట్లాడటం లేదని, ఇప్పటికైనా అందరం కలిసి పసుపు బోర్డు కోసం ఐక్యంగా పోరాడుదామన్నారు. వేల్పూర్ మండలం పడగల్‌వాసి కొట్టాల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. అర్వింద్ రాజీనామా చేసి రైతులతో కలిసి పోరాడాలని సూచించారు. ఎన్నికల ముందు పసుపు బోర్డు పాటపాడి.. ఇప్పుడు మాట మారుస్తున్నారని, సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతులకు చేయాల్సినదంతా చేస్తున్నారని, 24 గంటల కరంట్, కాళేశ్వరం నీళ్లు, రైతుబంధు, రైతుబీమాతో భరోసా ఇస్తున్నారని చెప్పారు. కేంద్రం ఇవ్వాల్సిన పసుపు బోర్డు విషయంలో మీరెందుకు స్పందించడం లేదని నిలదీశారు. అర్వింద్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. సొంత డబ్బులతో ఢిల్లీకి వచ్చి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ.. పాదయాత్ర పేరుతో మారోమారు మోసం చేయాలనుకుటుంటున్నవారికి అసలు పసుపు పంట గురించి తెలుసా? వారు రైతులేనా? అని ప్రశ్నించారు. ఆనాడు శరద్ పవార్‌ను కలిసినప్పుడు పసుపు బోర్డే పసుపు రైతుల కష్టాలను తీరుస్తుందని చెప్పారని గుర్తుచేశారు. పసుపు పండించేవారికే ఆ రైతుల బాధ తెలుస్తుందని, అర్వింద్‌కు పసుపు పంట గురించి ఏమైనా అవగాహన ఉన్నదా? ఆ రైతుల కష్టాలు తెలుసా? అని నిలదీశారు.

**ప్రేముంటే ఉద్యమంలో కలిసిరా..**

రైతులపై కపట ప్రేమతో అర్వింద్ గద్దెనెక్కారని, రైతుల మీద ప్రేముంటే తక్షణమే రాజీనామాచేసి ఉద్యమంలో కలిసిరావాలని మెండోరా రైతు నాగంపేట్ శేఖర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ప్రాంతీయ పార్టీలతో పసుపు బోర్డు రాదని చెప్పడం వల్లే కల్వకుంట్ల కవితను కాదని బీజేపీకి ఓటేశామని, అది అర్వింద్ మీదో, బీజేపీ మీదో ప్రేమతో కాదని చెప్పారు. పసుపు రైతులు శాశ్వత పరిష్కారం కోరుతున్నారని, అది పసుపు బోర్డు మాత్రమేనని, కొత్త కొత్త స్కీంలు కాదన్నారు. బాండ్ రాసేటప్పుడు తెలియలేదా అంబాసిడర్, టయోటా తేడాలు అని మండిపడ్డారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌వాసి రేగుంట దేవేందర్ మాట్లాడుతూ.. పసుపు బోర్డు కోసం ఎంపీగా కవిత రాజీలేని పోరాటంచేశారని గుర్తుచేశారు. అయినా బీజేపీ ప్రభుత్వం ఆనాడు స్పందించలేదని, ఎన్నికల్లో మాత్రం తాము గెలిస్తే వెంటనే పసుపు బోర్డు ఇస్తామని బాండ్ పేపర్ రాసి వాటి జిరాక్సులను ఊరూరా పంచి రైతుల్లో ఆశ కల్పించి ఓట్లు దండుకొన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంక్సాపూర్‌వాసి మిట్టపల్లి మహిపాల్ మాట్లాడుతూ.. తామే డబ్బులు పోగేసుకొని ఢిల్లీ వరకు పాదయాత్రచేసి జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. వేల్పూర్ మండలం అక్లూర్‌వారి నాగధర్ మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్‌ను తాము బెంజ్ కారు అడుగలేదని, పసుపు బోర్డు మాత్రమే అడిగామని చెప్పారు. 'ఆ కార్లలొల్లి మాకెందుకు? మాకావాల్సింది పసుపు బోర్డు. రైతులను మోసంచేసిన అర్వింద్ ఖబడ్దార్. నీకు పుట్టగతులుండవ్. ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రయత్నించు. లేదంటే రాజీనామాచేసి మా వెంట నడువు. నీకు చేతకాదని అర్థమైపోయింది. అందుకే రోజుకో మాట, పూటకో పాట పాడుతున్నావు.' అని మండిపడ్డారు. అనంతరం రైతులంతా ముక్తకంఠంతో పసుపు బోర్డు సాధనే తమ లక్ష్యమని, అర్వింద్ వెంటనే ఎంపీ పదవికి రాజీనామా చేయాలంటూ నినాదాలుచేశారు.



ఆదివారం నిజామాబాద్ జిల్లా వేల్పూరు మండలం లక్కోరాలో సమావేశమైన పసుపు రైతులు

## పసుపు బోర్డు గురించి అంతగా తెల్వదు

### కవితను ఓడగొట్టడమే లక్ష్యంగా పనిచేశా: ఎంపీ అర్వింద్



ఆదివారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

**పసుపు** బోర్డు ఏర్పాటు అవసరం లేదని.. అది ఓ అంబాసిడర్ కారు లాంటిదని, టయోటా లాంటి స్కీంను తీసుకురాబోతున్నానని ప్రకటించిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై జిల్లా రైతులు మండిపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బాండ్ రాసిచ్చినప్పుడు తెలియదా అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై ఆదివారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. మళ్లీ ఢిల్లీలో చెప్పినట్టే పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదంటూ అభివర్ణించారు. చివరగా ఓ విలేకరి 'ఎంపీగా పోటీచేసినప్పుడు ఈ విషయం మీకు తెల్వదా? అప్పుడు ఎందుకు మీరు హామీ ఇచ్చారు?' అని ప్రశ్నిస్తే.. 'ఇంతగనం దీనిపై స్టడీ ఏడచేసిన నేను.. నేను కేసీఆర్, ఆయన బిడ్డను ఓడగొట్టుడు తప్ప వేరే ఆలోచించ లేదు. నా ఆలోచన ఎప్పుడూ అదే ఉండే. 178 మంది రైతులు నామినేషన్లు వేస్తరని నాకు తెలుసా? పసుపుది దేశమంతా ఇంత ఇష్యూ అయితదని అనుకోలేదు' అని బదులిచ్చారు. అంటే పసుపు బోర్డుపై ఏమాత్రం అవగాహన లేకుండానే ఆనాడు ఎన్నికల కోసం రైతులను మోసపుచ్చేలా బాండ్ రాసిచ్చానన్నే విషయాన్ని ఒప్పుకున్నట్టేనని రైతులు మండిపడుతున్నారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.42 గంటలకు

సూర్యాస్తమయం: 5.36 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం పంచమి మంగళవారం తె.జా. 3.40 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఆశ్లేష అర్ధరాత్రి 2.48 వరకు, తదుపరి మఖ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 8.03 నుంచి 9.25 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.47 నుంచి మధ్యాహ్నం 12.31 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.41 నుంచి 3.24 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.10 నుంచి 5.41 వరకు.

**లోకం పోకడ**




# ఉపాధి కల్పనలో నం.1

మొదటిపేజీ తరువాయి...

ప్రగతిని పరిశీలిస్తే.. జోగుళాంబ గద్వాల మినహా.. మిగిలిన 32 జిల్లాలన్నీ టాప్‌లోనే ఉన్నాయి. ఉపాధిహామీ నిబంధనల ప్రకారం గ్రామాల అభివృద్ధి వంటి పలు అంశాల మాటెలా ఉన్నప్పటికీ.. కూలీలకు పని కల్పించడంలో మనమే అగ్రస్థానంలో ఉన్నాం. ఆదివారంనాటి నివేదికల ప్రకారం నిర్మల్ జిల్లా 92.13, ఆదిలాబాద్ జిల్లా 90.11 శాతంతో ముందు వరుసలో ఉన్నాయి. 29 జిల్లాలు సగటున 85 నుంచి 89.91 శాతం పనుల్లో పురోగతిని సాధించాయి. 89 శాతంలో కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, రంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాలు నిలిచాయి. 88 శాతంతో భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జనగామ, వరంగల్ అర్బన్, సూర్యాపేట, నల్లగొండ, మెదక్ జిల్లాలు ఉన్నాయి. మిగిలిన జిల్లాలు 85 శాతం నుంచి 87 శాతం వరకు ప్రగతి సాధించాయి.

**రూ.1477.36 కోట్లు చెల్లింపు**

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 23.61 లక్షల కుటుంబాల్లోని 38.97 లక్షల మంది కూలీలకు ఉపాధిపనులు కల్పించారు. వాస్తవంగా ఈ ఏడాది రాష్ట్రానికి 10 కోట్ల పని రోజులు టార్గెట్ కాగా.. ఆర్థిక సంవత్సరం మిగిలి ఉండగానే పూర్తికావస్తుండటంతో అదనంగా మరో 2 కోట్ల పనిరోజులకు అనుమతిచ్చారు. దీంతో అదనంగా పనికల్పించిన రాష్ట్రంగా కేంద్రం రికార్డుల్లో తెలంగాణ నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా పారదర్శకత, నిధులు వెచ్చించడం, రికార్డుల నిర్వహణపై రాష్ట్రానికి రెండు అవార్డులు వరించాయి. ఉపాధి నిధులను వినియోగించుకోవడంలో రాజన్న సిరిసిల్ల, సిద్దిపేటకు రెండు అవార్డులు వచ్చాయి. వికారాబాద్ జిల్లాకు కూడా గతేడాది కోటాలో అవార్డు దక్కింది. గతంలో కంటే హరితహారం, పల్లె ప్రగతి ప్రణాళిక లక్ష్యంగా గ్రామాల అభివృద్ధి కోసం పనులు చేస్తున్నారు. ఈ ఏడాది పలు విభాగాల్లో ఉపాధి కూలీలకు చేతినిండా పని చూపించారు. ఎక్కడా పనిలేదనే కారణం చెప్పలేదు. కూలీలకు అడిగినంత పని కల్పించారు. ఒక్కో కూలీకి సగటున రోజుకు రూ.150.85 చొప్పున వేతనం అందింది. ఒక్కో కుటుంబానికి సగటున 41.73 రోజుల పని దక్కింది. ఉపాధి హామీ కింద ఇప్పటివరకు మొత్తం కూలీలకు రోజువారీ వేతనాలుగా రూ.1477.36 కోట్లను వారి ఖాతాల్లో జమచేశారు. రాష్ట్రంలోని 1,19,348 మంది కూలీలకు 100 రోజుల పనిరోజులను కల్పించారు. పలు పథకాలను ఉపాధి హామీలో చేపట్టి విజయవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హరితహారం, భూ అభివృద్ధి, స్వచ్ఛ తెలంగాణ వంటి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేపట్టారు.

**హరితహారానికి రూ.255 కోట్లు**

ఉపాధిపనుల్లో భాగంగా హరితహారం కార్యక్రమానికి ఈసారి రూ.255 కోట్లను వెచ్చిస్తున్నారు. నర్సరీల నుంచి మొక్కల సంరక్షణ వరకు ఉపాధి హామీ కూలీలతో పనిచేయిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు చెందిన బీడు భూముల అభివృద్ధి పథకం కింద ఈ ఏడాది రూ.292 కోట్లతో 72,812 పనులు చేపట్టారు. భూసారపెంపు కింద 47,114 పనులు చేపట్టి, రూ.600.3 కోట్ల నిధులను వెచ్చించారు. మీడియం ఇరిగేషన్ చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ ఛానళ్లు, కందకాలతో నీటి, భూ సంరక్షణ కోసం రూ.782 కోట్లతో 46,203 పనులు చేస్తున్నారు. వ్యవసాయక్షేత్రాలకు 4696 రోడ్ల పనులను చేసి రూ.47.7 కోట్లను కూలీల ఖాతాల్లో జమచేశారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 9.3 కోట్లను ఖర్చు చేశారు. సీసీ రోడ్ల ద్వారా 3768 పనులను చేపట్టారు. రాష్ట్రంలో 107 కొత్త అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంతోపాటు గతంలో అసంపూర్తిగా ఉన్న 590 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను చేపట్టారు. దీని కోసం రూ.1.54 కోట్లను వెచ్చిస్తున్నారు. రూ.39.9 కోట్లతో వ్యవసాయ క్షేత్రాల్లో ఫాం పాండ్స్ నిర్మాణం చేపట్టారు. 9891 ఫాం పాండ్స్‌ను నిర్మిస్తున్నారు. రూ.30.8 కోట్లతో 1562 ఫిష్ పాండ్స్ నిర్మాణంచేస్తున్నారు. సొంత పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో ఈసారి ఉపాధి హామీ కింద పంచాయతీ భవనాలను నిర్మించారు. మొత్తం 233 గ్రామపంచాయతీభవనాల నిర్మాణానికి రూ.6.58 కోట్లను వెచ్చిస్తున్నారు. దీనికితోడుగా గతేడాది మొదలుపెట్టిన 1377 పంచాయతీ భవనాల నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాన్ని కూడా ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నారు. 845 పనులను రూ.1.8 కోట్లతో చేపట్టారు. వీటితోపాటు పల్లె ప్రగతి ప్రణాళికలో భాగంగా రూ.430 కోట్లతో శ్మశానవాటికలు, ఇతర పనులుచేస్తున్నారు.

### కూలీలకు పని కల్పించడమే ప్రథమ లక్ష్యం



**గ్రామాల్లో** ప్రజలకు అవసరమైన పనులు చేయడంతోపాటు గ్రామాల అభివృద్ధికోసం ఉపాధి నిధులతో పనిచేయిస్తున్నాం. సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో రూపుదిద్దుకున్న కొత్త పంచాయతీరాజ్ చట్టంతో గ్రామాలు అభివృద్ధి చెందడమే కాకుండా.. ఉపాధి కూలీలకు చేతినిండా పని దొరుకుతున్నది. ఏ గ్రామంలో కూడా కూలీలకు పనిరాలేదని ఫిర్యాదు రాకుండా చేయడంలో విజయవంతమవుతున్నాం. కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఉపాధి హామీ విజయవంతానికి పనిచేస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతంచేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

– ఎర్రబెల్లి దయాకర్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి

| | | |
|---|---|---|
| ఆదివారం వరకు పూర్తైన పనిదినాలు | : | 9,85,61,403 |
| ఈ ఏడాది టార్గెట్ | : | 10 కోట్ల పనిరోజులు |
| అదనంగా అనుమతి తీసుకున్నది | : | 2 కోట్ల పనిరోజులు |
| కూలీలకు చెల్లించిన మొత్తం | : | రూ.1,477.36 కోట్లు |
| మొత్తం గుర్తించిన పనులు | : | 7,41,137 |
| బడ్జెట్ అంచనా | : | రూ.14,524.64 కోట్లు |
| పూర్తైన పనులు | : | 4,89,045 |
| ఖర్చు చేసిన సొమ్ము | : | రూ.5,043.91 కోట్లు |

**90% పైగా ఉపాధిహామీ ప్రగతి సాధించిన జిల్లాలు (ఆదివారం నాటికి):** నిర్మల్, ఆదిలాబాద్

**80 నుంచి 89% ప్రగతి సాధించిన జిల్లాలు (ఆదివారం నాటికి):** 29

**86 శాతంలోపు ఉన్న జిల్లా :** జోగుళాంబ గద్వాల (76.81%)

ఉపాధి జాబ్‌కార్డులున్న కుటుంబాలు: **49,81,975**

జాబ్ కార్డులున్న కూలీలు: **1,08,63,762**

ఈ ఏడాది కూలీపొందిన కుటుంబాలు: **23,61,982**

పనులుచేసిన కూలీలు: **38,97,784**

వందరోజులు పనులుచేసిన కుటుంబాలు: **1,19,438**

ఒక్కో కూలీకి సగటున రోజువారీగా వచ్చిన వేతనం: రూ.**150.85**

ఉపాధి పనులుచేసిన పురుషులు: **16,20,878**

మహిళలు : **22,75,044**

ఎస్సీలు : **8,35,255**

ఎస్టీలు : **7,36,198**

బీసీలు : **20,77,607**

మైనార్టీలు : **46,766**

ఉపాధి హామీలో పనిచేసిన దివ్యాంగులు: **50,660**

# సిద్ధమవుతున్న టీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసులు

- సంస్థాగతంగా మరింత బలోపేతం దిశగా చర్యలు
- జనవరి చివరికల్లా పూర్తయ్యేలా కార్యాచరణ
- మలిదశలో నియోజకవర్గ కేంద్రాల్లో నిర్మాణానికి సన్నాహాలు



కుత్బుల్లాపూర్‌లో తుది దశకుచేరిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్) పార్టీ జిల్లా కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. నిర్మాణ పనులు శరవేగంగా సాగుతూ తుది దశకు చేరాయి. టీఆర్‌ఎస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించాలని పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించిన సంగతి తెలిసిందే. జిల్లాల్లో ఒకేసారి నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం పార్టీ నిధుల నుంచి ఒక్కో జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారు. దాదాపు అన్ని జిల్లాల్లో ఎకరం భూమిని కొనుగోలు చేశారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కార్యాలయం ఉండగా.. హైదరాబాద్, వరంగల్ రూరల్ జిల్లాల్లో స్థలం కొనుగోలు చేయలేదు. అన్ని జిల్లాల పార్టీ కార్యాలయాలు ఒకే విధంగా ఉండేలా డిజైన్ తయారుచేసి ఇచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు నిర్మాణపనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయం ఇప్పటికే పూర్తయింది. దాదాపు అన్ని జిల్లాల్లో స్లాబ్ పనులు పూర్తికావొచ్చాయి. మరికొన్నిచోట్ల రంగులు కూడా వేశారు. పార్టీ సమావేశాల నిర్వహణకు వీలుగా సమావేశ మందిరాలను ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. జనవరినాటికి పనులు పూర్తయ్యేలా కార్యాచరణతో ముందుకుసాగుతున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌రెడ్డి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. తొలుత దసరా పండుగనాడు ప్రారంభించాలని అనుకొన్నా.. అక్టోబర్ చివరలో వర్షాలు కురవడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. తిరిగి నవంబర్ మొదటివారంలో పనులు మొదలయ్యా యి. జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణపనులు పూర్తవగానే శిక్షణ కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారు. గ్రామ, మండలస్థాయి కమిటీలు పూర్తయినందున వారికి శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణం పూర్తయిన అనంతరం మలిదశలో నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించాలని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

# శ్రీరాజరాజేశ్వర జలశోభ

- 23 టీఎంసీలకు చేరిన నీటినిల్వ
- ఎల్ఎండీలో నిర్ణీతస్థాయి తర్వాత పూర్తిస్థాయిలో నిల్వ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఏది అసాధ్యమనుకున్నామో.. అది సాధ్యమైంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజన్‌తో చేపట్టిన పనులు రికార్డు సమయంలో పూర్తయి.. ఫలితాలను అందిస్తున్నాయి. దశాబ్దాల తర్వాత శ్రీరాజరాజేశ్వర జలాశయం (మిడ్‌మానేరు) ఇప్పుడు నిండుగా నీటితో మిలమిల మెరిసిపోతున్నది. కాళేశ్వరం ఎత్తిపోతలలో కీలకమైన జంక్షన్ రిజర్వాయర్‌గా ఉన్న ఈ జలాశయంలో సాంకేతికంగా ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేయడానికి మార్గం సుగమమైంది. ప్రభుత్వం సాంకేతిక ప్రొటోకాల్‌కు అనుగుణంగా రిజర్వాయర్‌లో నీటిస్థాయిని పెంచుకుంటూ జాగ్రత్తలు తీసుకోవడంతో శ్రీరాజరాజేశ్వర జలాశయం పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 23 టీఎంసీలకు చేరిన నీటినిల్వను త్వరలోనే వందశాతం నిల్వకు తెచ్చేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది.

## రికార్డుస్థాయిలో పనులు

కాళేశ్వరం విజయవంతంలో కీలకపాత్ర పోషించనున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం అందుబాటులోకి రావడం తెలంగాణ రైతాంగానికి గొప్ప విజయం. సమైక్యపాలనలో ఈ రిజర్వాయర్ పనులు మొదలైనా పనుల్ని పూర్తిచేయడంలో తెలంగాణ ప్రభుత్వం రికార్డుస్థాయిలో పరుగెత్తాల్సివచ్చింది. 2008 నుంచి 2014 వరకు 47 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని మాత్రమే జరిగింది. మొత్తం 4.80 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులకుగాను పదేండ్ల వ్యవధిలో 52 వేల క్యూబిక్ మీటర్ల పని మాత్రమే పూర్తిచేశారు. గేట్ల బిగింపునకు సంబంధించి 3,500 మెట్రిక్ టన్నుల పనులను పదేండ్ల కాలంలో మొదలే పెట్టలేదు. పనుల పరిస్థితి ఇలాఉంటే.. పునరావాసం, పునర్నిర్మాణం (ఆర్అండ్ఆర్) ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండేది. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేండ్ల రెండు నెలల వ్యవధిలోనే రికార్డుస్థాయిలో పనులు పూర్తిచేసింది. 81 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పనితో పాటు మిగిలిన 4.28 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. దీంతోపాటు 3,500 మెట్రిక్ టన్నుల గేట్ల బిగింపు పనుల్ని కూడా పూర్తిచేసింది. ఆర్అండ్ఆర్‌ను ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టడం వల్లనే ఇప్పుడు సాఫీగా నీటిని నిల్వచేసుకొనే పరిస్థితి వచ్చింది.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రామప్పగుట్టల పైనుంచి కనిపిస్తున్న శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మధ్య మానేర్)
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

## సాంకేతిక ప్రొటోకాల్ కీలకం

ఈ ఏడాది ఎల్లంపల్లి నుంచి జలాలను శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలించడంలో ఇరిగేషన్ అధికారులు సాంకేతికంగా అన్ని జాగ్రత్తలు తీసుకొని అడుగులు వేయాల్సివచ్చింది. నిజానికి ఒక కొత్త రిజర్వాయర్‌ను నింపడంలో సాంకేతిక ప్రొటోకాల్ అన్నది కీలక భూమిక పోషిస్తుంది. దానిని అనుసరించకుండా ముం దుకుపోతే.. అసలుకే ఎసరు వచ్చే ప్రమాదముంటుందని ఒక ఇంజినీరు చెప్పారు. అలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి ఇంజినీర్లు ముందుగా 25.87 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వసామర్థ్యమున్న జలాశయంలో 15 టీఎంసీలను మాత్రమే నింపారు. అంచెలంచెలుగా పరిశీలిస్తూ.. సీపేజ్‌ను గమనిస్తూ నిల్వను పెంచుకుంటూపోయారు. ఈ క్రమంలో కొంత ఇబ్బంది వచ్చినా దాన్ని అధిగమించారు. తర్వాత రెండోదశలో పూర్తిస్థాయిలో జలాశయాన్ని నింపడం సులువైంది. ప్రస్తుతం జలాశయంలో 23 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. అంటే.. జలాశయంలో 89 శాతం నిల్వ చేరటం విశేషం. ఈ స్థాయిలోనే సాంకేతిక పరిమితికి లోబడి (30 శాతానికి లోబడి) సీపేజ్ ఉన్నట్లుగా అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో ఇప్పటికిప్పుడు పూర్తిస్థాయిలో 25 టీఎంసీలకుపైగా నీటిని నింపేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు.. లోయర్ మానేర్‌డ్యాంకు నీటిని విడుదల చేయడంపై దృష్టిసారించారు. ఆదివారం సాయంత్రానికి శ్రీరాజరాజేశ్వర జలాశయానికి 6,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అవుట్‌ఫ్లో 5,856 క్యూసెక్కులుగా కొనసాగుతున్నది.



శ్రీరాజరాజేశ్వర జలాశయం బ్యాక్‌వాటర్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారు వరకు రావడంతో ఆ ప్రాంతమంతా మిలమిల మెరిసిపోతున్నది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ రకాల పక్షులకు విడిది కేంద్రంగా మారడంతో బ్యాక్ వాటర్ ప్రాంతం కొత్త కళ ను సంతరించుకొన్నది. ఇక్కడికి విచ్చేసిన రకరకాల పక్షులు కనివిందు చేస్తున్నాయి.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

తెలంగాణ ప్రభుత్వం
**సాధారణ పరిపాలన (GPM & AR) శాఖ**
**నోటిఫికేషన్**

2019లో సవరించిన విధంగా RTI చట్టం 2005లోని సెక్షన్ 15 మరియు 16 ప్రకారం ప్రమాణాలను నెరవేర్చే అర్హతగల మరియు ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఉద్యోగం కొరకు ఈ కార్యాలయానికి దరఖాస్తు చేయవచ్చునని ఇందుమూలంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఇందుకుగాను చీఫ్ సెక్రటరీ కార్యాలయం, సెక్రటేరియట్, తెలంగాణ ప్రభుత్వం, 9వ అంతస్తు, BRK భవన్, హైదరాబాద్‌లో అవసరమైన అన్ని డాక్యుమెంట్లు మరియు ఎన్‌క్లోజర్లతో పాటు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపాలి. దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేదీ: 20-12-2019, సా.5గం.

**సం/- స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్ (పొలిటికల్)**
**DIPR RO. No.1959-DP/CL/Advt/1/2019-20. Dt: 15/12/2019**



హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిన వాహనాలు



జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ పై ఉన్న రాయికల్, అడ్డాకుల వద్ద ఉన్న టోల్‌ప్లాజాలో బారులుతీరిన కార్లు, ఇతర వాహనాలు

**M/s కామినేని స్టీల్ & పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది) నడుస్తున్న సంస్థ విక్రయం కోసం 14 అక్టోబర్, 2019న ప్రచురితమైన అమ్మకం ప్రకటనకు రెండవ సవరణ**

ఎకనామిక్ టైమ్స్ మరియు నమస్తే తెలంగాణలలో, **M/s కామినేని స్టీల్ & పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది)** నడుస్తున్న సంస్థ విక్రయం కోసం (మెయిన్ ప్రకటన) 14 అక్టోబర్, 2019న ప్రచురితమైన అమ్మకం ప్రకటనకు ఇది నిర్దేశం. **అవసరమైన అనుబంధాలతో సహా బిడ్ డాక్యుమెంట్ల దాఖలుకు ఆఖరి తేది 29 డిసెంబర్, 2019 వరకు పొడిగించబడినది. బయానా దాఖలుకు ఆఖరి తేది 09 జనవరి, 2020 వరకు మరియు ఇ-వేలం యొక్క సవరించిన తేది 16 జనవరి, 2020 వరకు తదుపరిగా పొడిగించబడినది. ప్రాసెస్ పార్టిసిపేషన్ ఫీజు రూ. 3 లక్షలు (మూడు లక్షల రూపాయలు మాత్రమే) రద్దు చేయబడినది.** ఇ-వేలం ప్రాసెస్ సమాచార డాక్యుమెంట్ ప్రకారం అన్ని ఇతర నియమ నిబంధనలన్నీ యధాతథం. ఇ-వేలం ప్రాసెస్ డాక్యుమెంట్‌కు రెండవ సవరణను **https://www.kaminenisteelpower.com/liquidation-process.html** నుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు.

| వివరణ | అమ్మకం విధానం | తనిఖీ తేది | వేలం తేది మరియు సమయం | రిజర్వు ధర (INR) | బయానా మొత్తం దాఖలు గడువు తేది | బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|---|---|---|
| కంపెనీ మొత్తంగా | నడుస్తున్న సంస్థగా | 7 జనవరి 2020 | 16 జనవరి 2020 ఉ॥ 11.30 గం.నుండి మ॥ 3.30 గం. | రూ. 610 కోట్లు | రూ. 5 కోట్లు, 9 జనవరి, 2020 | రూ. 5 లక్షలు |

దీనికి సంబంధించి ఏ కారణం తెలుపకుండా మరియు ఎటువంటి లయబిలిటి లేకుండా ప్రాసెస్‌ను రద్దుచేయు (లేదా) మార్పు చేసే హక్కు లిక్విడేటర్ కలిగి ఉన్నారు. ఇది ఆఫర్ డాక్యుమెంట్ కాదు.

**R. రామకృష్ణ గుప్త**
**IP రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-002/IP-N00012/2016-17/10029**
**కమ్యూనికేషన్ చిరునామా & ఇ-మెయిల్ ఐడి: లిక్విడేటర్ చిరునామా:**
**ప్రదేశం: హైదరాబాద్** **T-202, టెక్నో పోలిస్, 1-10-74/B, చికోటి గార్డెన్స్, బేగంపేట, హైదరాబాద్-500 016**
**తేది: 14 డిసెంబర్, 2019** **ఇ-మెయిల్: rp.ramakrishnagupta@gmail.com**

# స్లో ట్యాగ్!

## అవగాహన లేదు.. అనుసంధానం కాలేదు

- తొలిరోజు వాహనదారుల ఇక్కట్లు
- గంటలకొద్దీ నిలిచిన వాహనాలు
- చుక్కలు చూపించిన టోల్‌ప్లాజా నిర్వాహకులు
- ట్రాఫిక్ డైవర్ట్ చేసినా తప్పని తిప్పలు

**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి/జడ్చర్ల/దేవరకద్ర/అలంపూర్, నమస్తేతెలంగాణ, కేతేపల్లి, తూప్రాన్ రూరల్, ఇందల్వాయి:**

టోల్‌ప్లాజాల దగ్గర చెల్లింపుల కోసం సమయం వృథా చేయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫాస్టాగ్ తొలిరోజు వాహనచోదకులకు చుక్కలు చూపించింది. ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఫాస్టాగ్ జనాలను అష్టకష్టాలపాల్జేసింది. వీకెండ్‌లో సరదాగా బయటకు వెళ్దామనుకున్నవారికి సెలవురోజు టోల్‌ప్లాజాలకే సమర్పణమైపోయింది. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు.. విజయవాడ హైవేపైనున్న పంతంగి టోల్‌ప్లాజాలతోపాటు అలంపూర్ సమీపంలో పుల్లూరు, నల్లగొండ జిల్లా కొర్లపహాడ్, మెదక్‌జిల్లా అల్లాపూర్, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేపైన రాయికల్, అడ్డాకుల దగ్గరున్న టోల్‌ప్లాజాల దగ్గర ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దాదాపు 90శాతం మంది వాహనదారులు తమ వాహనాలను ఫాస్టాగ్‌తో అనుసంధానంచేసుకోకపోవడంతో సమస్యలు ఎదురయ్యాయి. టోల్‌ప్లాజా నిర్వాహకులు ఫాస్టాగ్ లేన్లను ఎక్కువగా.. నగదు చెల్లింపుల లేన్లను పరిమితం చేయడం వల్ల నగదు లేన్లలో వాహనాల క్యూలు కిలోమీటర్లకొద్దీ పెరిగిపోయాయి. తొలిరోజే అంతా ఫాస్టాగ్‌కు తమ వాహనాలను అనుసంధానం చేసుకొని వస్తారని మితిమీరిన విశ్వాసంతో.. ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించకపోవడం వల్ల గంటలకొద్దీ వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆదివారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుందామని బయలుదేరినవారు గూడూరు టోల్‌ప్లాజా దగ్గరే గంటలకొద్దీ ఆగిపోవాల్సివచ్చింది. చివరకు టోల్‌ఫ్రీ అయిన ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు కూడా కదిలే పరిస్థితి లేకుండా పోయింది. పంతంగి టోల్‌ప్లాజా దగ్గర విజయవాడకు వెళ్లాల్సిన యాత్రికులు మధ్యాహ్నంవరకూ ఆగిపోయారంటే ట్రాఫిక్ ఏ స్థాయిలో స్తంభించిపోయిందో అర్థంచేసుకోవచ్చు. బీబీనగర్ మండలంలోని గూడూరు వద్ద టోల్‌ప్లాజా నిర్వాహకులు వాహనాలను జాతీయ రహదారిపై కాకుండా పక్కనే రంగాపూర్‌నుంచి ప్రారంభమైన సర్వీస్‌రోడ్డు వైపు మళ్లించడం సందేహాస్పదమైంది. జిల్లా కలెక్టర్‌కు గానీ, ఎస్పీకి గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ట్రాఫిక్‌ను మళ్లించారు. మరోపక్క గూడూరు, పంతంగి టోల్‌ప్లాజాల దగ్గర నిర్వాహకులు వాహనాల దగ్గరకు సిబ్బందిని పంపించి టోల్ వసూలు చేయడం విడ్డూరం. పెద్దసంఖ్యలో వాహనాలు బారులు తీరడంతో పంతంగి టోల్‌ప్లాజాను ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఎం కృష్ణప్రసాద్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

### ఫాస్టాగ్ కోసం ప్రత్యేక కౌంటర్లు

అన్ని టోల్‌ప్లాజాల దగ్గర నిర్వాహకులు ఫాస్టాగ్ కౌంటర్లను ఏర్పాటుచేశారు. అప్పటికప్పుడు ఫాస్టాగ్ స్టిక్కర్‌ను జారీచేసి టోల్‌వసూలుచేసి పంపించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ దగ్గర ఉన్న మొత్తం 12 కౌంటర్లలో 8 కౌంటర్లు ఫాస్టాగ్‌కు, 4 నగదు కౌంటర్లకు ఏర్పాటుచేశారు. దీంతో ఇక్కడ కూడా వాహనదారులు కొద్దిసేపు వేచిచూడాల్సివచ్చింది. మెదక్‌జిల్లా అల్లాపూర్ టోల్‌ప్లాజా దగ్గర కూడా ఫాస్టాగ్ సేవలు ప్రారంభమయ్యాయి. జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేపైనున్న రాయికల్, అడ్డాకుల టోల్‌ప్లాజాల వద్ద ఫాస్టాగ్ వాహనాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. చాలామంది ఇంకా ఫాస్టాగ్ తీసుకోకపోవడంతో ఈ నెల చివరివారం వరకు ఫాస్టాగ్ తీసుకొనేందుకు కేంద్రం అవకాశమిచ్చింది. నిజామాబాద్‌జిల్లా ఇందల్వాయి టోల్‌ప్లాజా దగ్గర 8 కౌంటర్లు ఫాస్టాగ్‌కు కేటాయించారు. మరో రెండు కౌంటర్లను నగదు వసూలుకు ఏర్పాటుచేశారు. నగదు చెల్లింపు కౌంటర్ ఒక దారిలో ఒకటే కౌంటర్ ఉండటంతో వాహనదారులు చాలాసేపు వేచి ఉండాల్సివచ్చింది. కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌ప్లాజా దగ్గర కూడా ఫాస్టాగ్ సేవలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద 8 కౌంటర్లలో ఫాస్టాగ్‌ను అమలుచేశారు. వాహనదారులకు ఫాస్టాగ్‌లను అందించడానికి రెండు కౌంటర్లను ఏర్పాటుచేశారు.




# రచయితలు, కవులు ప్రజల పక్షమే

తెలంగాణ సాహితీ నాలుగో లిటరరీ ఫెస్ట్‌లో ప్రముఖ సంపాదకుడు కే శ్రీనివాస్



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'యురేనియం- నల్లమల కలాలు-గళాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ సంపాదకుడు కే శ్రీనివాస్. చిత్రంలో భూపతి వెంకటేశ్వర్లు, గుడిపాటి తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రచయితలు, కవులు, సాహితీవేత్తలు ఎల్లప్పుడూ ప్రజల పక్షమేనని ప్రముఖ పత్రికా సంపాదకుడు కే శ్రీనివాస్ అన్నారు. ప్రజాజీవనంలో ఉండాల్సింది స్పందించేగుణమేనని, సందర్భోచితంగా స్పందించేతత్వం కవికే ఉన్నదని చెప్పారు. పాలనలో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించే దిశగా స్పందిస్తారని తెలిపారు. తెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిటరరీ ఫెస్ట్‌లో భాగంగా రెండోరోజు ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'యురేనియం – నల్లమల కలాలు – గళాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'నువ్వు ప్రకటించే భావాలతో ఏకీభావం లేకపోవచ్చు. కానీ, ఆ భావాలు ప్రకటించే నీ హక్కు కోసం నా ప్రాణాలైనా ఇస్తాను' అని ఫ్రెంచ్ తత్వవేత్త, చరిత్రకారుడు ఓల్టేర్ 300 ఏండ్ల కిందట అన్నమాట గుర్తొచ్చి ఆందోళన కలుగుతున్నదని చెప్పారు. నేడు కనీసం ప్రశ్నించే హక్కు, భిన్నమైన భావాలు ప్రకటించే వాతావరణం లేకుండా పోతున్నదని, విభిన్నమైన అభిప్రాయాలు, రాజకీయ విశ్వాసాలు ఉండటమే నేరమైందని పేర్కొన్నారు. ఫాసిస్ట్ నియంతలు.. నైజీరియన్ రచయిత కెన్ సారో వివాను హతమార్చారని, ఢిల్లీ వీధిలో నాటకమాడిన సఫ్దర్ హష్మిని చంపేశారని, పాట పాడినందుకు గద్దర్‌ను హత్యచేసేందుకు కుట్ర పన్నారన్నారు. సాయిబాబా అంగవైకల్యంతో కుంగికృశించారని, ఆయనకు చెందాల్సిన వికలాంగుల హక్కులను కాలరాసి నాగ్‌పూర్‌లోని అండా సెల్ జైల్‌లోనే నిర్బంధించారని పేర్కొన్నారు. విద్రోహి మ్యాగజైన్ సంపాదకుడు సుధీర్‌ధావలె, వీక్షణం పత్రిక సంపాదకుడు ఎన్ వేణుగోపాల్, వరవరరావు వంటి బుద్ధిజీవులను వేధించడం, నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని చెప్పారు. తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించడగా, ప్రముఖ సాహితీ విమర్శకులు గుడిపాటి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. స్ప్రెడ్డింగ్ లైట్ వ్యవస్థాపకులు జ్యోతి.. పుస్తక పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ముజాహిద్‌అలీ, గౌస్‌పాషా, వివిధ జిల్లాల సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.

## ప్రతిబింబం

**ముడుచుకున్న మనసు పుప్పొడి**
మసక బారిన కళ్ల పువ్వు నుండి
జారి అద్దం మీద పడిందేమో
కనిపించని అడ్డు తెరగా మిగిలింది.
బ్రతుకు చెక్కిళ్ళను తడుముతూ
రెప్పలు తెరచి చూసే
సత్యాలను దాచి ఉంచే
ప్రయత్నంలో అద్దం మూగపోతుంది
మూసిన గుప్పెడంత పిడికిట్లో
లెక్కతేల్చని చిక్కుముళ్ల జీవన విధానాన్ని
బంధిస్తూ అద్దం రోధిస్తుంది.
అనుభవాల రాపిళ్లకు
నీరు కార్చే నిట్టూర్పులు
మెరుగులు దిద్దలేని పేలవమైన
అంగ ప్రదర్శన చూసి అద్దం నివ్వెరబోతుంది
తెరదించని నటనలో నవరసాలను
విశ్వరూపమై తన ముందున్న
రంగుల వలలోని
మాయా తెరలకు విలయమై అద్దం
పరిహసిస్తోంది
నిద్రిస్తున్న స్వప్నాలతో
వడలిన దేహం, తీరని దాహానికై
కన్నీటి ఊటల తలపులను తుడిపించడానికి
అద్దం దిగులుగా వెక్కుతుంది
ఎన్నిసార్లు చూసినా మార్పులేని
నడత తడబాటుని ప్రతిబింబపు నీడలో చూసి
అద్దం నవ్వుతుంది..

**– సముద్రాల శ్రీదేవి, 99498 37743**



అఫ్సర్ స్వతహాగా భావోద్రేకీ, ఉద్వేగీ ఐన కవి కాడు. అతను ఎంతో సంయమనం, సహనం, సమన్వయం, సమ్యక్ దృష్టి గల పరిణతి చెందిన కవి. కాగా క్రమ వికాసంతో సాధనతో తనను తాను నిర్మించుకుంటూ విస్తృతమైన కవి కూడా. అఫ్సర్ కవిత ఒక బిందువుగా ఆవిర్భవించి సున్నిత భావద్రవ్యాన్ని నింపుకుంటూ విస్తృతమౌతూ.. ఒక సింధువై ఆవరిస్తుంది. పాఠకుడప్పు డు తనకు తెలియకుండానే రసమహానుభూతితో తనను తాను కోల్పోయి అదృశ్యమైపోతాడు. అతని వాక్య నిర్మాణ క్రియ విభిన్నమైంది.

# కవిత్వానికి ఉదాత్తతే ప్రాణం

**ఆధునిక** తెలుగు వచన కవిత్వ రంగంపై ఒక విలక్షణమైన ముద్ర అఫ్సర్.

'variety is the spice of poetry' అని వేగుంట మోహన్ ప్రసాద్ అంటే, 'verse must be musical' అని ఆధునిక వచన కవితకు ఆద్యుడైన ఫ్రెంచ్ కవి చార్లెస్ బోదిలేర్ (1857) తన ఇతర ముగ్గురు కవి మిత్రులు వెర్లాయిన్, మల్లార్మే, రెంబోలతో కలిసి నిన దించిన ఫ్రెంచ్ సింబలిస్ట్ చతుష్టయంలో నుంచి 'వెర్లాయిన్ ' అన్నాడు. మ్యూజిక్ అని వ్యవహరించబడే రాగాత్మకతా, కవిత్వమూ మధ్య ఉన్న అద్వైతాన్ని మల్లార్మే వివరంగా వ్యాఖ్యానించాడు.

అక్షరాలు కవిత్వ పరిమళాన్ని నింపుకుని ఉదాత్తమౌతున్నప్పుడు వాటికవే రాగాత్మకమూ, లయాత్మకమూ కూడా ఔతాయి. ఐతే ఈ కవిత్వ సుందరతా, ప్రాణ వాయుత్వమూ కవిత్వాన్ని ఆస్వాదించ గల రసపిపాసులకు మాత్రమే అనుభవమౌతాయి. అఫ్సర్ కవిత్వం హృదయ సంబంధి ఐన తాత్త్విక ప్రగాఢతను నింపుకొని నిశ్శబ్ద రాగాత్మకతతో ఉన్మీలిస్తుంది. అందుకే ఆయన కవిత్వ పంక్తులనిండా పాఠకున్ని నిరంతరం వెంటాడే అనేకానేక పాదాలు మనను విడిచిపెట్టని జ్ఞాపకాలై పరుచుకుంటాయి.

అసలు కవిత్వం ఏమిటి.? అని ప్రశ్నించుకుంటే నాకు కింది మూడు పాదాలు జ్ఞాపకమొస్తయి.

**'పచ్చి బాలింత కన్నీటి కొడవలితో**
**వరికోత కోయడమే జీవితానికి పొడిగింపయితే**
**ఆ తల్లి పాదాలకింద నలిగిన మట్టే మహాద్భుత కవిత్వం..'** అని మనతరపు మహా యువకవి ఎవరో అన్న వాక్యం సరిగ్గా అఫ్సర్‌కు వర్తిస్తుంది.

సరళ సౌందర్యభరిత పదాలను అలంకరించుకుని చదువరిని వెంట తోడ్కొని రసగంగలా ప్రవహిస్తూ పోయే నిర్మాలాకాశ గంభీరత అఫ్సర్ నాలుగు కవిత్వ సంపుటాల నిండా దర్శనమిస్తాయి. ఇవాళ, (రక్తస్పర్శ), వలస, ఊరి చివర, ఇంటివైపు.. ఈ పుస్తకాల మకుటాలు వేర్వేరైనా నిజానికి ఇవన్నీ ఒకే ఒక అఫ్సర్ కవిత్వ సంహిత. వీటన్నింటిలోనూ అతను అక్షరీకరించినవన్నీ అతని అతి సున్నిత మానవీయ సంవేదనలే. మనిషి బహిర్ముఖతతో.. ఆత్మాంతర లోకాల్లోకి అభిక్రమిస్తున్నపుడు అనుభూతమయ్యే ప్రాణప్రకంపనలన్నీ ఈ కవితల్లో ధ్వనిస్తాయి. ఐతే వీటిని తనదైన ఒక ప్రత్యేక శిల్పీకరణ నైపుణ్యంతో ఆత్మీయతతో మనలోకి ప్రవేశించి అమ్మ అందించే మమకార మయ 'గోరుముద్ద'గా మనకు లభ్యపర్చడం ఆయన విశిష్టత. ఆ లక్షణమే అతన్ని ఉదాత్తున్ని చేస్తున్నది.

నిజానికి అఫ్సర్ స్వతహాగా భావోద్రేకీ, ఉద్వేగీ ఐన కవి కాడు. అతను ఎంతో సంయమనం, సహనం, సమన్వయం, సమ్యక్ దృష్టి గల పరిణతి చెందిన కవి. కాగా క్రమ వికాసంతో సాధనతో తనను తాను నిర్మించుకుంటూ విస్తృతమైన కవి కూడా. అఫ్సర్ కవిత ఒక బిందువుగా ఆవిర్భవించి సున్నిత భావద్రవ్యాన్ని నింపుకుంటూ విస్తృతమౌతూ.. ఒక సింధువై ఆవరిస్తుంది. పాఠకుడప్పుడు తనకు తెలియకుండానే రసమహానుభూతితో తనను తాను కోల్పోయి అదృశ్యమైపోతాడు. అతని వాక్య నిర్మాణ క్రియ విభిన్నమైంది. ఈ కింది పద్య పాదాల్ని చూడండి..

**'తెల్లారు జాము వానలో తడుస్తూ**
**యిల్లూ ఊరూ వదిలి**
**పరిగెత్తుతూ వెళ్తాను, ప్రపంచం వేపు.**
**నన్నలా పెరిగెత్తించే ఈ ప్రపంచంలో**



**గత పదిహేనేండ్ల కాలంలో తెలుగు వచన కవిత పెనుమార్పులకు లోనౌతూ.. వస్తుపరంగా, వ్యక్తీకరణ పరంగా, రూపపరంగా, భావపరంగా, నిర్మాణ విషయంలో కొత్తమితులను సంతరించుకుం టూ.. తనను తాను రూపాంతరీకరించుకుంటూ బహుముఖీనంగా ఎదుగుతోంది. ఇదివరలో వాడబడీ నలిగిపోయిన అరిగిపోయిన గులకరాళ్ళవంటి అనేకానేక వాదసంబంధ పదాలను పునర్నిర్వచిస్తోంది.**

**అసలేమైనా ఉందో లేదో!**
**వున్నా అది నాదో కాదో**
**వెతుక్కునే వ్యవధి కూడా**
**దొరకనివ్వని వుక్కిరిబిక్కిరిలో వెళ్ళిపోతాను.**
**నా కోసం కురవని ఆ వానలోకి**
**తీక్షణంగా చూసే శక్తి కూడా నాకు వుండదు.**
**ఆ మాటకొస్తే, యెన్ని చినుకులు కలిస్తే**
**వాన అవుతుందో కూడా తెలీదు ఈ పరాయి క్షణంలో.**
**యీ వానా యీ జీవితం**
**నన్ను యెంతలా తడుపుతున్నాయో కూడా చూసుకోను..'**

(నీది కాని వాన!)

ఇక్కడ అఫ్సర్ 'యెన్ని చినుకులు కలిస్తే వాన ఔతుందో ' అన్న తాత్త్విక పరిపూర్ణతను ప్రతిపాదిస్తూనే..'ఈ పరాయి క్షణంలో ' అన్న ముక్తాయింపుతో తాత్త్విక తురీయతను సాధిస్తున్నాడు. ఇది ఏ రూమీ కవులకో, సూఫీ తాత్త్విక సిద్ధులకో మాత్రమే సాధ్యమయ్యే గొప్ప లక్షణం.

అఫ్సర్ కవితల్లో మరొక చిత్రమైన నడక, ప్రవాహకత అంతర్లీనమై ఉంటుంది.. 'ఒక చేరువ–ఒక క్షమాపణ' అన్న కవిత ఇందుకు ఉదాహరణ. పాఠకుడు ఏ కవిత మధ్యలోనైనా మొదలై కొనసాగుతున్నా.. ముందూ వెనుకల్లో ఉండిపోయిన కవిత్వ ఆద్యంతాలేవీ కోల్పోయినట్టనిపించదు. వాక్యాలను ముడేసుకుని అక్కడే మొదలౌతున్నట్టు.. మళ్ళీ ప్రారంభం. ఇదిగో..

'నిన్ను చుట్టుముట్టిన ఈ తెలియని ముఖాల,
తెలియని చెట్ల, తెలియని ఆకాశాల, తెలియని గాలుల,
కనిపించని కన్నీళ్ళ
వినిపించని ఏడ్పుల సమూహంలో నిలబడి,
ప్రతి ముఖమూ నీదే అనుకుని బతిమాలుకుంటావు..'

శైలీ క్లిష్టత, భావ క్లిష్టత, తాత్త్విక సంక్లిష్టత వంటివేవీ లేకుండా.. అసలు క్లిష్టతే లేకుండా వాస్తవాతీత నిఖార్సైన కవిత్వాన్ని దొర్లిస్తున్న గాజు గోళీల్లా ప్రవహింపజేయగల నేర్పరి అఫ్సర్.

గత పదిహేనేండ్ల కాలంలో తెలుగు వచన కవిత పెనుమార్పులకు లోనౌతూ.. వస్తుపరంగా, వ్యక్తీకరణపరంగా, రూపపరంగా, భావపరంగా, నిర్మాణ విషయంలో కొత్తమితులను సంతరించుకుంటూ.. తనను తాను రూపాంతరీకరించుకుంటూ బహుముఖీనంగా ఎదుగుతున్నది. ఇదివరలో వాడబడీ నలిగిపోయిన అరిగిపోయిన గులకరాళ్ళవంటి అనేకానేక వాదసంబంధ పదాలను పునర్నిర్వచిస్తున్నది. దళితవాదం అంటే.. ఒక ఐఏఎస్ మాదిగా, చెప్పులు కుట్టున్న మాదిగా ఇద్దరూ దళితులేనా అని ప్రశ్నిస్తున్నది. స్త్రీవాదమంటే.. ఒక ఉన్నత వర్గ సాఫ్ట్ వేర్ స్త్రీ, నిమ్నవర్గానికి చెందిన రోడ్లు నూడ్చే మహిళా ఒకటేనా అని గుచ్చి గుచ్చి అడుగుతున్నది.. దళిత బహుజనులు అంటే.. జనాభా పరంగా బహుసంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతుల సబ్బండ జాతుల వృత్తికులాల మనుషుల గురించి ఎవ రు ఎవరితో కలిసి ఎటు పయనించాలె అన్న చైతన్యంతో పిడికిళ్లు బిగిస్తున్నది.. ఈ వర్తమానం ఇదివరకటి నేపథ్యం కంటే పూర్తిగా భిన్న మై దారులు దారులుగా బహుళమౌతున్నది. ఇవన్నీ విస్మరించదగిన స్థితులు కావు. పరిగణించదగినవే.

ఐతే అఫ్సర్ తన కవిత్వ సృజనలో ఇన్ని విభిన్నతలను కేవలం మానవీయ సంలీనతతోనే సమన్వయం చేసుకుంటూ.. కవిత్వంలో కవి ఎంచుకోవలసిన వస్తువు విషయంలో గానీ.. వైవిధ్యతలోగానీ, వ్యక్తీకరణ విలక్షణతలోగానీ, కవిత్వాన్ని హృదయానికి హత్తుకునే విధంగా అందివ్వడంలోగానీ చాలామంది ఇప్పుడు ప్రసిద్ధులౌతున్న తరానికి ప్రేరకులుగా భాసిస్తున్నారు. నేటివిటీ, జీవితపు లోతూ, అందులోని పూర్ణతా విషయాల్ని ఆధునికుల్లో దర్శించినపుడు.. ఈ కవితను చూద్దాం. ఇది ఒక నిమ్నవర్గ బీడీ కార్మికురాలి జీవిత శకలం గురించిన ఆర్తి..

**'వంటింట్లో గిన్నెలు పొగాకు వాసనొస్తున్నాయని**
**వాళ్ళ మగాళ్ళు చిందులేస్తారు**
**అన్నం తింటే పొగాకు నమిలినట్లుందని**
**కాన్వెంటు వాసన సోకిన పిల్లలు తింటారు**
**వేళ్లమధ్య నలిగిన పొగాకు చర్మంలోకి నరాల్లోకి**
**నెత్తురులోకి పాదరసం లాగా చొచ్చుకుపోయి**
**చివరికి వాళ్ళ బతుకే పొగాకైపోయింది**
**వాళ్ళ కళ్ళు**
**మసిబారిపోయిన వంటింటి పాతగోడల్లా**
**పనికిరాని వట్టిపోయిన పొగాకుకాడల్లా వాలిపోయి వుంటాయి...'**

ఇది ఇప్పుడు బలంగా, తన కవిత్వాన్ని స్ఫోరకంగా వినిపిస్తున్న నారాయణస్వామి వెంకటయోగి ఒక బీడీ కార్మికురాలి గురించి రాసిన విదారకమైన కవిత. ఇటువంటి ఒక తరానికి అఫ్సర్ ప్రేరణ కాగలిగారని నేననుకుంటాను.

సమస్యాత్మక కాలం వర్తమానమై, పోరాటమై, పరిష్కరించబడ్తున్న వర్తమానం గతమై, అంతిమంగా గతం ఒక చరిత్రవుతుంది ఎప్పుడైనా. ఈ ఎరుకలోనుంచి ఒక కవిత్వ ప్రవాహమై ప్రవహిస్తున్నవాడు అఫ్సర్. కవి దేనిగురించైనా రాయనీ.. ఐతే దాంట్లో 'కవిత్వం' ఉండాలె గాలిలో 'ఆక్సిజన్' వలె. Rich oxygenized air వంటి కవిత్వం అఫ్సర్‌ది. ఇప్పుడు ఆయన తన కవిత్వాన్నంతా ఒక గుచ్ఛంగా **'అప్పటినుండి ఇప్పటిదాకా అఫ్సర్ కవిత్వం'** పేర వెలువరిస్తున్న శుభ సందర్భంగా నా అభినందనలు.

**– రామాచంద్రమౌళి, 93901 09993**

**(డిసెంబర్ 20న అఫ్సర్ కవిత్వ 'సర్వస్వం' ఆవిష్కరణ జరుగుతున్న సందర్భ ంగా..)**



## రేగుపండ్ల చెట్టు

**పెను దుఃఖాన్ని మూటలుగా కట్టుకుని**
పదిహేనేళ్లప్పుడు కుటుంబంతో ఆ వీధిని విడిచిన రోజున
చిన్నప్పటి నుండీ నన్నల్లుకున్న
ఆ రేగుపండ్ల చెట్టుకొమ్మలు
అట్లా నాతో పాటు వుండిపోయాయి

ఇండ్లు మారినా వీధులు మారినా ఊళ్లు మారినా
మకాం మహానగరానికి మార్చినా
చెట్టు కింద పట్టుకున్న మేకపాల రుచిలాగా
తీపి వగరుల రేగుపండ్ల రుచిలాగా
చిన్నప్పటి రేగుపండ్ల చెట్టు నాలో సజీవంగా వున్నది

ఒక్క రేగుపండ్ల చెట్టు మాత్రమేనా?
నాలుగు గిరకల బావిలో నీళ్లన్నీ
బొక్కెన్లతో తోడి చేసిన ఆరు బయట స్నానాలు
అర్ధరాత్రి దాకా ఇంటికి రెండువైపులా
కుట్టు మెషీన్లతో జాగారాలు చేసే మేరోళ్ళు
బీడీలు చుట్టే పనిలో నిద్రల్ని కత్తిరించుకునే పద్మశాలీలు
రక్త సంబంధీకుల్లా వరుసలు పెట్టి పిలుచుకునే పిలుపులూ
వెన్నెల రాత్రుళ్ళలో కుందేళ్ళలా ఎగిరెగిరి ఆడిన ఆటలు
నింగిలోని పతంగుల కోసం నేలమీద పతంగులమైన రోజులు
బాట మీది ఎడ్లబండ్లలోంచి ఎండుగడ్డి దొంగిలించి
రాజేసుకున్న చలిమంటల వెచ్చదనాలు
లోపలి కొమ్మల్ని తడిమినపుడల్లా జ్ఞాపకాలు
పక్షుల్లా నా తలపైన ఎగిరి సందడి చేస్తాయి
భారాన్ని ఇంకా మోయలేక
చాలాకాలం పిదప ఆ వీధికి వెళ్లాను
ఫ్లై ఓవర్ ఉక్కురెక్కల కింద వీధి చితికి ఉన్నది
కన్నీళ్ళన్నీ ఇంకిన పెద్దబావి మట్టిలో కూరుకుపోయిందట
పిల్లలూ పక్షులూ పశువులూ ఖాళీ చేశాక
రేగుపండ్ల చెట్టు కూడా మాయమైపోయిందట
కొత్తగా లేచిన షాపింగ్ కాంప్లెక్ ఇండ్లను మింగేసిందట

దగ్గరకొచ్చి గుర్తుపట్టిన పెద్దమనిషినడిగాను
'ఈ రేగుపండ్ల చెట్టుభారాన్ని ఎట్లా దించుకోను?'
కాంతి ఉబికివొచ్చిన కళ్ళతో అతనన్నాడు..
'ఇది భారమైతే కదా దించుకోవడం
నిన్ను నీ చిన్నప్పటి తేలికతో నిలిపివుంచే
నీ రేగుపండ్ల చెట్టుని నీలో సజీవంగానే వుండనీ'

**– కోడూరి విజయకుమార్, 83309 54074**

# రైతుకవి రాజిరెడ్డి

**దుక్కి** దున్నడం, నీరు పారించడం, చదును చేయడం, విత్తనం చల్లడం, కలుపు తీయడం, ఎరువు వేయడం, పురుగు మందులు చల్లడం, కావలి కాయడం, పంట కోయడం, కుప్పకొట్టడం, కాంట కేయడం, జనుప సంచులు నింపడం.. ఇన్ని పనులు సమయానికి, మనసుపెట్టి చేయడమే యవుసం. తనతో పాటు లోకానికి ఆకలి తీర్చి ప్రాణం నిలిపే అన్నదాత రుణమెన్నడు ఎవరు భర్తీ చేయలేనిది. పైగా కీర్తించదగినది.

కవి కూడా యిన్ని తీర్ల శ్రమ మానసికంగా, మేధోమథనంగా, అంతరంగ అల్లకల్లోలంగా, గజిబిజిదారుల సుస్పష్ట సుదూర ప్రయాణంగా, ఓడినచోట గెలిచే, తనను తాను నిలబెట్టుకునే నూతనావిష్కారాల కొనసాగుట అంతా వీజీ కాదేమో. కాలానికి ఒక కాపు ఒక కవి చాలేమో.

'మేం భూ సంబంధీకులం' నిజమే. కాపు కవీ కూడా భూ సంబంధీకుడే. **'నేల విడిచి సాము చేయలేం/భూమిని తప్ప పాడలేం/మా పాటకీ–మా పతనానికీ–మా మాటకీ–మా మార్గానికీ భూమే భూమిక/భూమిని పునీతం చేసే ఉత్పత్తి కారక జీవితాలని తప్ప వేరే రాయలేం..'**. 'అన్నపు రాసులొక చోట, చెమట రాసులొక చోట' ఈ దుష్ట వ్యత్యాసాన్ని గమనించినందుకే, అది కొనసాగకూడదనే పై వాక్యాలు పుట్టినై.

నాగరికత కన్నా అనాగరికత మేలు. కునాగరికతయితే అది జడల దయ్యమే. దాని విప్వాలత్వం, విచ్చలవిడితనం సమాజాన్ని కురూపిని చేసి, ఆనందిస్తుంది. మసిబారిన విష పొగల సంస్కృతి మేఘాలను సృష్టిస్తుంది.

నవీకరణ పేరిట సాంకేతికతలో భాగంగా యంత్రస్వామ్యానికి శ్రీకారం చుట్టినం. యంత్రాలను వాడుతూ కూలీ జనానికి పనులు లేకుండా పొట్టకొట్టే కాలం తెచ్చుకున్నం. పోనీ యంత్రానికేమన్నా మనసుంటుందా!, **'అవును అదొక జె.సి.బి. గుత్త పెత్తందారీ చేతిలో కీలుబొమ్మ/పన్నెండేళ్ళ పాల బుగ్గను/ రక్తం మడుగు చేస్తుందా/అల్లుకుపోతున్న పల్లెల తిప్పతీగ ఉసూరు పూరకే పోదు..'** పని వేగిరం కావొచ్చు ప్రమాదకరం వెంటే ఉంటది. దయ జాలి ప్రేమ పేదరికం యంత్రానికి పట్టుతదా?

క్రికెట్ అతిపెద్ద తిమింగలం. బాల్యాన్ని బాల్యపు ఊరి ఆటల్ని అమాంతం బుక్క పెట్టేసింది. అప్పటి వూరు బాల్యాన్ని కదిపి చూడు/వేల వేల ఆటల దృశ్యాలు/ మనసుకు తుమ్మగోందులా అంటుకుంటాయి/ చిర్రగొనె, చెమ్మచెక్కా, కోతికొమ్మచ్చి, లక్కకోలలు, పుంజీతం కనిపించని వూరు శిథిల సంస్కృతికి నిదర్శనం/ బొంబాయి మిఠాయి వంటి టి.వి. తీపికి/బాల్యం దాసోహమయింది/ గాలి సోకిన ఊరు బాల్యమయింది..'

తెలంగాణ ఉద్యమం కవులకు పనిపెట్టింది, పదునుపెట్టింది. అవ్, మాది మాకు కావాలె అని అక్షర రణం మొదలు పెట్టించింది. **'ఎగిలివారక ముందే మర్రిచెట్టు మీద /గుంపు కాకులు వొర్రినట్టు/వొక్క తీర్గ రికాం లేకుంట వొర్రనే వడ్తిమి/కండ్లున్న గుడ్డోళ్ళ తీర్గ చేయవట్రి/గొర్లమందల మీద తోడేళ్ళు పడ్డట్టు/అమాంతం గుంజుకపోయి ఆంబుక్క పెట్టిరి/మన మనాది పోవాలంటే / మన ది మనకు రావాలె..'** తెలివికొచ్చి మొండేశమేసి కొట్లాడిన తెలివి గల తనం అది.

భూమ్మీద పడ్డాక జీవితమేమిటో తెలుస్తున్నకొద్దీ జీవికను ప్రశ్నలమయం చేసే ప్రజాస్వామ్యహక్కుల హరణం హననం స్పృహలోకి వస్తుంటుంది. మట్టిమనుషుల కల నిస్వార్థపూరితమైన రెండుపూటల భుక్తి, తల దాచుకునే నీడ, ఎతో కతో ఎల్లబోసుకునే స్వతంత్రం. ఇవ్వన్నిట్నీ హుష్‌కాకి చేసే దౌర్జన్యం, దాడి కొనసాగుతున్నది. **'హింస ప్రతిహింస ఊరేగుతున్న చోట/మానవ హక్కులకు విఘాతం కలుగుతున్నచోట/ఒక నిర్మల హృదయం ఉదయిస్తుంది..'** ఆ పొద్దుపొడుపు, ఆ హక్కుల దివిటీ ఆ బాలగోపాలానికీ చిరపరిచితమైన బాలగోపాల్. అరుదైన జన ప్రేమికుడు/ పెద జీవితాల చలువ పందిరి. పోలికకు దగిన కవితా పదం.

తెలంగాణ వీరభూమి. త్యాగభూమి. అమరత్వాల తడిసిన భూమి. ఈ నేల మాళిగలో వేషం లేదు, రోషం వుంది. మోసం లేదు, అమాయకం వుంది. కుట్ర లేదు, అలైబలై వుంది. వ్యూహం లేదు, కుల్లం కుల్ల వుంది. అందుకే కవులకిది కావ్య విడిది అయింది. **'పల్లె అమరత్వాన్ని పాడింది/ నేల కొరిగిన వీరుల త్యాగం మరో దసన్నను వాగ్దానం చేసింది'**. మందారాన్ని దసన్న పువ్వంటరు. ఓటమి రావొచ్చు, పోరాటం చేతుల మీంచి చేతులకు, భుజాల మీంచి భుజాలకు, మనసుల మీంచి మనసులకు, కాలం మీంచి కాలంకు అల్లుకుంటనే వుంటదనే వాగ్దానం మాట.

ఎటమటమైన ఎవుసం.. **'ఎవుసమొక యింద్రజాలం/ఎవుసమొక జూదం/ఎవుసమొక లాటరీ/ఎవుసం దూరపుకొండ ప్రతీకల వెనుక అన్నదాతల హాహా కారాలున్నయి. సంప్రదాయ వ్యవసాయం సద్దుమనిగింది/మధ్యతరగతి సంసారం గంగరాలు తేలినయి/అలుకుడు బోనం సర్వంగపయింది/నూనెలద్దిన పలుగురాళ్ల కుంకుమల ముందు/మొలకకుప్పల మౌనవిషాదం.'** నీళ్ళు కరెంటు పెట్టుబడి కంటే ఆహారపదార్థాల దిగుమతి చీప్. అదే భేష్ అన్నప్పటి యవుసం దండుగ దుస్థితి చిత్రణ.



**ఏ కవితా మహోద్రేకంతో కదలదు. సంక్లిష్ట సంక్షోభభరితమైనా రూపం మాత్రం అలా ఉండదు. సరళంగానే, సాదాసీదాగానే అచ్చంగా పప్పుల రాజిరెడ్డిలానే వుంటుంది. రెండోసారి చదివితే రాజిరెడ్డి కవిత్వాన్ని ఎక్కువ ఆనందిస్తారు. మొదటిసారికే పాఠకున్ని చెదరగొట్టి ఆకర్షించే తత్త్వం రాజిరెడ్డిది కాదు. కాళ్లకు చెప్పులు లేకుండా భుజాన పైగుడ్డతో చేతిలో కర్రతో పొలానికెల్లే రైతులా వుంటుంది.**

మట్టికో ఆకృతినిస్తే అది కొత్తకుండ. **'వాయుగుండంలో అగ్నిస్నానమాచరించి/ఆకృతికి జాజిరి రంగు పులుముకుంది/సలసల కాగే సలిలమే కావచ్చు/కుండ కడుపులో ఎవరెస్టు కొండ కావాల్సిందే /నోరెండుక పోయే రోగగ్రస్థముదిమి గొంతులో/ మూడుబుక్కల కొత్తపటువ నీళ్ళు/ప్రాణాన్ని నిలిపే అమృతాంభువులే కదా /పంచభౌతికమైన దేహం మట్టికుండనే/పగిలితేనే పచ్చలు పచ్చలు..'** వాస్తవికత తాత్త్వికత రంగరించిన కళాభివ్యక్తి. 'పగిలిన కుం డ, మరో రూపానికి సిద్ధం' గోపి గారు గుర్తుకురాక మానరు.

పుట్టమన్ను తెచ్చి బొడ్డెమ్మను చేసి మొదలువెట్టే బతుకమ్మ పండుగ తెలంగాణ పండుగల్లో కెల్ల తలమానికం. ప్రకృతిచ్చిన పూల రంగుల ఆరాధన ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా లేదు. అలలు అలలుగా సాగే విన్యాసాల కదంబ సంబురమౌతుంది.

ఒక కోపం వంద మందిని దూరం చేస్తుంది. ఒక నవ్వు వెయ్యి మందిని దగ్గరకు తెస్తుంది. అందుకే **'నవ్వు హాయిగా నవ్వు/ మళీ మళీ నవ్వు/పగలబడి నవ్వు పకపకనవ్వు/పదుగురు మెచ్చేలా నవ్వు/ప్రవాహంలా నవ్వు.'** మనుషుల్లో రెండు రకాలుంటరు. మంచి, చెడు. అంతే.

నవ్వుల్లో రకాలుంటాయా? బోలెడు బోలెడు అని సమాధానం. వెకిలి నవ్వులు వెటకారం నవ్వులు, ఈర్ష్యనవ్వులు, యిసపు నవ్వులు, అహం నవ్వులు, అధికారం నవ్వులు, నర్మగర్భపు నవ్వులు, నడమంత్రపు నవ్వులు, నంగనాచి నవ్వులు.. ఇవన్నీ మనుషులవి. ఇంకా పౌరాణిక నవ్వులున్నయి, ద్రౌపదినవ్వులు, లక్ష్మణ దేవర నవ్వులు, రాక్షస నవ్వులు, రాజస నవ్వులు. అయితే మనసుతో మాత్రమే కొలువగలిగే వెలుగురేఖ నవ్వే. ముఖారవిందానికి మానసికానందానికి ఒక చిరునవ్వును దక్కించుకుందాం.

ఇదంతా ఒక కవిత్వ పులకరింత, ఒక పలకరింత. బీడైన దేహంతో, ఎండిన కళ్లతో, ఎండకు చెయ్యడ్డం పెట్టి మొగులు దిక్కు చూస్తున్న రైతన్న కోసం నిర్మితమైన వరదగూడు గురించి.. ముక్కలు ముక్కలైన పాలదుత్త వంటి ఊరు కోసం పూర్వానుబంధాల ఆనవాళ్లను వెతికి రాశి పోయడం గురించి. పవనాలు వానలై వనాలను సృష్టిస్తే వనాలు వానలై, వాగులు వంకలు నిధులై పచ్చదనం పరవళ్లతో పరిఢవిల్లేందుకు తాంబాలమసొంటి మనసులోం చి స్వచ్ఛమైన కవితాజలం ఒంపిన తెలంగాణ గంగాళం గురించి.

నాలుగున్నర దశాబ్దాల నుంచి సాహిత్య ప్రయాణం నెమ్మదనమే, కమ్మదనమే. ఉరికురికి పోవుడు లేదు. ఊరికి దూరం కావడం లేదు. తెలుగులో గోల్డ్‌మెడల్ కొట్టినా కవిత్వంలో భాషా భయ విధ్వంసాలు జొరబడవు. మట్టి వాసనేసే, పంట వాసనేసే పల్లెతనమే నుడికారపు మమకారం. చొరబడటానికి (పేరు కోసం) చొరవ. కీర్తి, కిరీటాలపై మక్కువ లేశమాత్రం లేని కవి, తెలంగాణ కవి, అచ్చమైన కాపుదనపు కవి పప్పుల రాజిరెడ్డి.

వ్యవసాయిక గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన రాజిరెడ్డి థీమ్ అంతర్లీనంగా కదిలే వస్తువు మొత్తం ఇమేజరీ. మొత్తం అక్కడినుంచే. అది ఆయన నేటివిటీ. ఆయన తత్త్వం, స్వభావం, ఆయన జీవనతత్త్వం. ఆయన అన్నింటినీ ఎలా అందుకుంటాడు, ఆస్వాదిస్తాడు, వివేచిస్తాడు అన్నీ ఆయన స్వభావం మీదే ఆధారపడి వుంటాయి, వున్నాయి.

ఏ కవితా మహోద్రేకంతో కదలదు. సంక్లిష్ట సంక్షోభభరితమైనా రూపం మాత్రం అలా ఉండదు. సరళంగానే, సాదాసీదాగానే అచ్చంగా పప్పుల రాజిరెడ్డిలానే వుంటుంది. రెండోసారి చదివితే రాజిరెడ్డి కవిత్వాన్ని ఎక్కువ ఆనందిస్తారు. మొదటిసారికే పాఠకున్ని చెదరగొట్టి ఆకర్షించే తత్త్వం రాజిరెడ్డిది కాదు. కాళ్లకు చెప్పులు లేకుండా భుజాన పైగుడ్డతో చేతిలో కర్రతో పొలానికెల్లే రైతులా వుంటుంది. ఈ మాటలు పప్పుల రాజిరెడ్డి రెండవ కవితా సంపుటి (2008) 'ఆనవాలు'కు ప్రముఖ కవి కె.శివారెడ్డి గారి 'నాలుగు వాక్యాలు' అన్న ముందుమాటలో.. చెప్పాడు. ఇవ్వాళ తెలంగాణకు చెందిన కవి అయినవాడు ఎవరైనా రైతు గురించి రాయని వారు అరుదు. అలా ఎవరైనా ఉంటే అతను తెలంగాణ ఆత్మను పట్టుకోలేదన్న మాట. అంతమాత్రమే కాదు ఈ సామాజిక జీవితానికి పరాయీకరణకు ప్రతీక అన్నమాట.

పప్పుల రాజిరెడ్డి అసలుసిసలైన తెలంగాణ రైతు జీవితాన్ని, అంతే అచ్చమైన తెలంగాణ భాషలో వ్యక్తీకరించారు. తెలంగాణ రైతును తన కవిత్వంలో దృష్యీకరించిన రాజిరెడ్డి ఒక అచ్చమైన రైతు కవి.

**– దాసరాజు రామారావు, 96182 24503**

## పుస్తకాలు

### అస్తిత్వ



వందేండ్ల తెలంగాణ కథ, శతాబ్ది తెలంగాణ జీవిత గాథను ప్రతిఫలించే కథలకు ఈ కథా సంపుటి కేంద్రం. ఈ సంకలనంలో ఉన్న కథలన్నీ కలిసి తెలంగాణ వందేండ్ల చరిత్రను రేఖామాత్రంగా కూడా ఇవ్వలేకపోవచ్చు. కానీ ఆ దిశగా చేసిన ప్రయత్నాల్లో ఇది తొలి అడుగు. మేలి అడుగు. ఇందులో అన్ని తరాలకు, అన్ని సామాజికాంశాలకు, ఆలోచనలకు చోటుదక్కకపోవచ్చు కానీ వీలైనంత మేర తెలంగాణ గమనానికి అద్దం పట్టిన కథలని మాత్రం చెప్పవచ్చు. అదే క్రమంలో ఈ కథలను దేశంలోని ఇతర ప్రాంతాల వారికి కూడా అందించటానికి హిందీ, ఇంగ్లీష్ భాషలో కూడా వెలువరించటం ముదావహం.

**ప్రధాన సంపాదకులు: డాక్టర్ నందిని సిధారెడ్డి, వెల:రూ.250, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్-04, ఫోన్: 040-297678411**

### తెలంగాణ యక్షగాన వాఙ్మయము



తెలంగాణ అంతటా విస్తరించి ప్రజా జీవితాలను తరతరాలుగా ప్రభావితం చేసిన కళారూపాల్లో యక్షగానం ఒకటి. తెలంగాణలో గ్రామగ్రామాన ఉన్న యక్షగాన బృందాలు, వారు ప్రదర్శించిన, నేటికీ ప్రదర్శిస్తున్న కళారూపాలు ప్రధానంగా పౌరాణికమైనా, సమకాలీన సామాజిక రాజకీయాలను ఏదో రూపంలో వ్యక్తీకరిస్తూ ప్రజలను చైతన్యపర్చటంలో ఎనలేని పాత్ర వహించాయి. ఈ యక్షగాన ప్రక్రియ, విస్తరణ ప్రభావాల గురించిన బృహత్‌గ్రంథం ఇది..

**రచన: డాక్టర్ మొరంగపల్లి శ్రీకాంత్‌కుమార్, వెల: రూ. 600, ప్రతులకు: శైలజ, ఇంటి నెం:12-11-833/4/73, అంబర్‌నగర్, అడిక్‌మెట్, హైదరాబాద్-44. ఫోన్: 040-64531453**

### చైతన్యం (కథలు)



అమెరికా జీవితాలు, సంఘర్షణలను నిజాయితీగా చిత్రించిన కథలు ఇవి. ఈ సంపుటిలో ఉన్న 22 కథలూ అమెరికా నేపథ్యంగా రాసినవే. డాలర్ల వేటలో పడి జీవితానికి దూరమవుతున్నతీరు పట్ల ఆవేదనతో, ఆగ్రహంతో రాసిన కథలివి.

**రచన:సోమ సుధేష్ణ, వెల: రూ.150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌజ్, ఆర్య సమాజ్ మందిర్ ఎదురుగా, బడీచౌడీ, హైదరాబాద్**

## ప్రకటన

### ఆవిష్కరణ సభ

తెలంగాణ కథ–2018 'రివాజు' ఆవిష్కరణ సభ 2019 డిసెంబర్ 22న ఉదయం 10.30 గంటలకు హన్మకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో ఉంటుంది. గిరిజా మనోహర బాబు అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా ఆచార్య కాత్యాయని విద్మహే, ఆచార్య బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, అన్వర్ పాల్గొంటారు. సంపాదకులు సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ వెల్దండి శ్రీధర్‌ల స్పందన ఉంటుంది. వంగ సంపత్‌రెడ్డి పుస్తకాన్ని పరిచయం చేస్తారు. .

**- సృజన లోకం, 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం**

### సాహిత్య పురస్కారం

సింగమనేని నారాయణ సాహిత్య పురస్కారం కోసం 2018 జనవరి నుంచి 2019 డిసెంబర్ లోపు ప్రచురించిన కథల సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కథకులు తమ రచనలను 2020 జనవరి 15వ తేదీలోపు అందేలా పంపించాలి. చిరునామా: ఏరువాక సాహిత్య సాంస్కృతిక సంస్థ, 7–1–507, ఎన్‌జీఓ కాలనీ, వాటర్ ట్యాంక్ ఎదురుగా, బద్వేల్–516227, వైఎస్ఆర్ కడప జిల్లా. వివరాలకు: 7013736729, 94412 87865.

### రచనలకు ఆహ్వానం

శాక్రమెంటో తెలుగు సంఘం (TAGS) తలపెట్టిన యూఏఎన్ మూర్తి మెమోరియల్ రచనల పోటీకి 18ఏండ్లలోపు ప్రవాస యువ రచయితలు తమ రచనలను పంపించాల్సిందిగా మనవి. అనువాద, రచనా విభాగంలో యువ రచయితలకు ప్రత్యేకం. రచనలు 2019 డిసెంబర్ 20 లోపు అందాలి. మెయిల్:telugusac@yahoo.com

**- శాక్రమెంటో తెలుగు సంఘం**

### సాహిత్య పురస్కారం

2019 సంవత్సరానికి గాను రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారానికి శ్రీరామ్ గారి కవితా సంపుటి 'అద్వంద్వం' ఎంపికైంది.

**- మద్దికుంట లక్ష్మణ్, అవార్డ్ కమిటీ కన్వీనర్**


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com

# ఆసియా అందగత్తె సుమన్ రావ్



- 2019 మిస్ వరల్డ్ ఆసియా కిరీటం దక్కించుకున్న మిస్ ఇండియా

**న్యూఢిల్లీ:** మిస్ ఇండియా సుమన్ రావ్ ఈ ఏడాది ప్రపంచ ఆసియా అందగత్తె కిరీటాన్ని కైవశం చేసుకున్నారు. డిసెంబర్ 14న లండన్‌లో జరిగిన ప్రపంచ సుందరాంగుల పోటీలో భారత్ తరపున పాల్గొన్న ఆమె 2019 మిస్ వరల్డ్ సెకండ్ రన్నరప్‌గా రాణించారు. మిస్ జమైకా టోని ఆన్ సింగ్ 2019 మిస్ వరల్డ్ కిరీటాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. 21 ఏండ్ల సుమన్ రావ్ రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ సమీపంలోని అయిదానా గ్రామంలో జన్మించారు. ఆమెకు ఏడాది వయసులో వారి కుటుంబం ముంబైకు తరలిపోయింది. సుమన్ తండ్రి స్వర్ణకారుడు కాగా ఆమె తల్లి గృహిణి. సుమన్ కథక్ నృత్యంలోనూ శిక్షణ పొందారు. 2018లో మిస్ నవీ ముంబై పోటీలో పాల్గొని రెండో స్థానంలో నిలిచారు. 2019లో మిస్ రాజస్థాన్ టైటిల్ దక్కించుకున్నారు. రాజస్థాన్ తరపున మిస్ ఇండియా పోటీలో పాల్గొని అందులోనూ రాణించారు. బాలీవుడ్ నటి దీపికా పదుకునే అంటే అమితంగా ఇష్టపడే ఈ భామ, నటి కావాలని ఆశిస్తున్నారు. చదువుతోపాటు మోడలింగ్‌లోనూ ఆమె బిజీగా ఉన్నారు.

# డీఆర్ కాంగోలో మారణహోమం

### 22 మందిని ఊచకోత కోసిన ఇస్లామిక్ రెబల్స్

### మృతుల్లో 13 మంది మహిళలు

**బెని, డిసెంబర్ 15:** డీఆర్ కాంగోలో మరో మారణహోమం జరిగింది. ఉగాండా సరిహద్దు ప్రాంతమైన బెనిలో శనివారం రాత్రి ఇస్లామిక్ రెబల్స్ దాడులకు పాల్పడ్డారు. 22 మంది ప్రజలను ఊచకోత కోశారు. మృతుల్లో 13 మంది మహిళలున్నారని, వీరంతా రైతులని ఆ ప్రాంత పాలనాధికారి డోనాట్ కిబ్వానా తెలిపారు. అలైడ్ డెమొక్రాటిక్ ఫోరెస్స్(ఏడీఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు వెల్లడించారు. ఐరాస శాంతి పరిరక్షక దళం నేతృత్వంలో డీఆర్ కాంగో సైన్యం ఏడీఎఫ్‌పై చేపట్టిన దాడులు గత అక్టోబర్‌లో ముగిశాయి. దీనికి ప్రతీకారంగా ఇస్లామిక్ రెబల్స్ నవంబర్ 5 నుంచి జరుపుతున్న దాడుల్లో వంద మందికిపైగా ప్రజలు మరణించారు. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించడంలో విఫలమవుతున్న ఐరాస శాంతి పరిరక్షక దళంపై డీఆర్ కాంగో ప్రజలు మండిపడుతున్నారు.

# 31లోగా ఆధార్-పాన్ అనుసంధానం



**న్యూఢిల్లీ:** మీ పాన్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేదా? అయితే ఇప్పటికైనా త్వరపడండి. లేని పక్షంలో ఐటీ రిటర్న్స్ దాఖలులో చిక్కులు ఎదుర్కొవాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులోగా అనుసంధానం గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 31లోగా తప్పనిసరిగా ఆధార్‌తో పాన్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ ప్రజలకు సూచించింది. రేపటి భవిష్యత్ నిర్మాణం కోసం, ఆదాయ పన్ను సేవలు సజావుగా పొందేందుకు గడువులోగా ఈ అనుసంధానాన్ని పూర్తిచేసుకోవాలని ఆదివారం పేర్కొంది. తొలుత ప్రకటించిన అనుసంధాన గడువు ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగియగా, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించింది. కేంద్రం ప్రవేశపెట్టిన ఆధార్‌కు చట్టబద్ధత ఉందని సుప్రీంకోర్టు గత సెప్టెంబర్‌లో పేర్కొంది. ఐటీ రిటర్న్స్‌కు ఆధార్‌తో పాన్ అనుసంధానం తప్పనిసరని చెప్పింది.



## ఈశాన్యం కోసం సవరణలు

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సంకేతాలు

**ధన్‌బాద్/ రాంచీ:** పౌరసత్వ (సవరణ) చట్టంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మౌనం వీడారు. ఈశాన్య రాష్ర్టాల ప్రజల ఆందోళనల పరిష్కారానికి అవసరమైతే పౌరసత్వ చట్టం నిబంధనల్లో మార్పులు చేస్తామని సంకేతాలిచ్చారు. 'కన్రాడ్ సంగ్మా (మేఘాలయ సీఎం), ఆయన క్యాబినెట్ సహచరులు శుక్రవారం నన్ను కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను నా దృష్టికి తెచ్చారు. ఈ చట్టం వల్ల ఏ ఇబ్బందుల్లేవని వారికి అర్థమయ్యేలా చెప్పా. చట్టంలో మార్పులు తేవాలని వారు పట్టుబట్టితే క్రిస్మస్ తర్వాత నన్ను కలువాలని వారిని కోరాను. మేఘాలయ సమస్యలపై నిర్మాణాత్మక చర్చలతో పరిష్కారం కనుగొందామని వారికి హామీ ఇచ్చా' అని జార్ఖండ్‌లోని గిరిధ్‌లో శనివారం జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ఆయన తెలిపారు.

## క్యాబ్‌పై కాంగ్రెస్ అలజడి

### పౌరసత్వ చట్టం 1000 శాతం సరైన చర్యే: మోదీ

**డుంకా (జార్ఖండ్):** పౌరసత్వ చట్టంపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశంలో అలజడి సృష్టిస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ మండిపడ్డారు. విపక్షాలు దేశంలోని పలు ప్రాంతాల్లో అశాంతిని రెచ్చగొడుతూ ఆస్తుల దహనానికి పాల్పడుతున్నాయన్నారు.'(ఆస్తులకు) నిప్పు పెడుతున్న వారెవ్వరో వారు ధరించిన దుస్తులే వారిని గుర్తించేలా చేస్తాయి' అని అన్నారు. 'పౌరసత్వ చట్టంపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరసనను ఎగదోస్తున్నా యి. పౌరసత్వ (సవరణ) బిల్లు ఆమోదం 1000 శాతం సరైన చర్య అని దానిపై వారి (విపక్షం) చర్యలు రుజువు చేస్తున్నాయి' అని అన్నారు. కాగా, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా, మోదీ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బ్రిటన్‌లో స్థిరపడిన అసోమీలు లండన్‌లోని భారత హై కమిషన్ వద్ద నిరసన ప్రదర్శన జరిపారు.

## సావర్కర్‌కు వ్యతిరేకం

### పౌరచట్టంపై మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్

**నాగ్‌పూర్:** సింధూ నదీ నుంచి కన్యాకుమారి వరకు భూభాగాన్ని ఒకే దేశం కిందకు తేవాలని కోరిన వీడీ సావర్కర్ సిద్ధాంతాలను నూతన పౌరసత్వ చట్టం (సీఏఏ) అవమానిస్తున్నదని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మహా ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'మహిళలకు భద్రత కల్పనలో వైఫల్యం', నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకే పౌరసత్వ సవరణ చట్టం వంటి అంశాలను కేంద్రం తీసుకొస్తున్నదన్నారు. పౌరసత్వ సవరణ చట్టం హిందూ జాతీయ వాది సావర్కర్ సూత్రాలకు వ్యతిరేకం అని వ్యాఖ్యానించారు.

# ఈశాన్యానికి భయమెందుకు?

### భాష, సంస్కృతికి ముప్పు వాటిల్లుతుందన్న భయం

### వనరులు కోల్పోయి ఉపాధికి దూరమవుతామన్న ఆందోళన



ఆదివారం గువాహటిలోని చాంద్‌మరి మైదానంలో నిరసనకు భారీగా హాజరైన ప్రజలు

**గువాహటి:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లలో మత హింసతో భారత్‌లోకి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం కల్పించేందుకు కేంద్రం రూపొందించిన పౌరసత్వ సవరణ చట్టంపై అసోం, ఇతర ఈశాన్య రాష్ర్టాల్లో ఆందోళన రగులుతున్నది. ప్రత్యేకించి అసోంలో కర్ఫ్యూ ఆజ్ఞలను ధిక్కరించి మరీ ఆందోళనకారులు నిరసనకు దిగుతున్నారు. దీనికి కారణాలేమిటి? నూతన పౌరసత్వ చట్టం అమలులోకి రావడంతో బెంగాలీ మాట్లాడే హిందువులు పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి లక్షల సంఖ్యలో వలస వస్తారని వారు భావిస్తున్నారు. తమ వనరులతో పాటు ఉపాధి కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. తమ జాతి సాంస్కృతిక మూలాలు ధ్వంసం అవుతాయని భయపడుతున్నారు. తమ సంస్కృతి సంప్రదాయాలు సమూలంగా ధ్వంసమవుతాయని, బంగ్లా నుంచి వచ్చే బెంగాలీలే ఇక శాశ్వతంగా తమపై పెత్తనం చేస్తారని ఆందోళన చెందుతున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింలను మాత్రమే కాకుండా హిందువుల వలసలను కూడా వారు వ్యతిరేకిస్తున్నారు. 2011 జనగణన ప్రకారం అసోమీల జనాభా (1991) నుంచి 2011 నాటికి 48 శాతానికి పడిపోతే, బెంగాలీ మాట్లాడే వారి జనాభా 22 నుంచి 30 శాతానికి పెరిగింది. తమ ఉనికికి ముప్పు వాటిల్లుతున్న సంగతిని వారు 1979లోనే గుర్తించారు. అసోంలోని మంగల్‌డోయి లోక్‌సభ స్థానానికి 1979లో జరిగిన ఉప ఎన్నికలో అనూహ్యంగా ఓటర్ల సంఖ్య పెరుగడానికి అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారే కారణమని వారు గుర్తించారు. అప్పుడు భారీ హింసాత్మక ఉద్యమానికి పునాది పడింది. దాదాపు ఆరేండ్లు బంగ్లాదేశీ హిందువుల అక్రమ వలసలకు వ్యతిరేకంగా సాగిన ఆందోళన, ఉద్యమంతో అసోం అట్టుడికింది. 885 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. చివరకు కేంద్రం దిగి వచ్చి 1985లో ఒప్పందం కుదుర్చుకున్నది. 1971 మార్చి 25 తేదీ తరువాత అసోంలోకి అక్రమంగా వలస వచ్చిన విదేశీ శరణార్థులను గుర్తించి వారి స్వదేశానికి పంపాలని నిర్ణయించారు. కానీ ఇప్పుడు పౌరసత్వ చట్టం కటాఫ్ తేదీగా 2014 డిసెంబర్ 31గా నిర్దేశించడంతో విశ్వాసం కోల్పోయిన అసోమీలు ఆందోళన బాట పట్టారు.

### 1826లోనే బెంగాలీల వలసలు

1826లో అసోంను ఆక్రమించుకున్న బ్రిటిష్ ఇండియా పాలకులు తమ పాలన సజావుగా సాగేందుకు బెంగాలీ హిందువులను క్లర్కులుగా అక్కడికి తీసుకెళ్లారు. బెంగాలీ క్లర్కుల సూచనల మేరకు అస్సామీకి బదులు బెంగాలీ భాషనే అధికారిక భాషగా బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. కానీ 1873లో క్రైస్తవ మిషనరీలు అసోంలోకి ప్రవేశించాక అసోమీలకు, అస్సామీ భాషకు ప్రాధాన్యం లభించింది. కానీ నాటి నుంచి ఇతర ప్రాంతాల వారి పట్ల అసోమీలు అభద్రతాభావంతోనే ఉన్నారు.

### అస్సామీల భయానికి కారణాలు

- బెంగాలీ హిందువులు, ముస్లింలు చేతులు కలిపితే బెంగాలీ మాట్లాడే వారి జనాభా తమను మించిపోతుంది.
- తాజా చట్టాన్ని అడ్డుపెట్టుకొని మరో కోటి మంది వరకూ బంగ్లాదేశ్ నుంచి వలస వస్తారన్న వదంతులు.
- బంగ్లాదేశ్ నుంచి వచ్చిన బెంగాలీల చేతికి రాజకీయ అధికారం వెళుతుంది.
- త్రిపురలో తూర్పు బెంగాల్ నుంచి వలస వచ్చిన వారే స్థానిక గిరిజన జాతులను మించిపోయారు.
- పౌరసత్వ సవరణ చట్టం వల్ల కోటి మందికి పైగా హిందూ శరణార్థులకు లబ్ది చేకూరుతుందన్న ఆరోపణలు.




### ఇతర ఈశాన్య రాష్ట్రాల ఆందోళనలివి..

మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో కొంత భాగం మినహా అంతా ఆరవ షెడ్యూల్ పరిధిలోకి వస్తుంది. ఒకసారి పౌరసత్వం పొందితే తేలిగ్గా బంగ్లాదేశీ హిందువులు రాష్ట్రంలోకి వచ్చేస్తారని కనుక తమను ఇన్నర్ లైన్ పర్మిట్ (ఐఎల్‌పీ)లోకి తేవాలని మేఘాలయ వాసులు కోరుతున్నారు. వలసలను అడ్డుకునేందుకు మేఘాలయ నివాసుల భద్రతా చట్టానికి సవరణలు చేయాలని భావిస్తున్నది. దీని ప్రకారం ఇతరులెవరైనా తమ మేఘాలయలో 24 గంటలకు పైగా బస చేయాలని భావిస్తే మేఘాలయ ప్రభుత్వం అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మిజోరంలోకి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ కొండల నుంచి వలస వచ్చిన హిందూ చక్మా శరణార్థులు తమపై పెత్తనం చేస్తారని ఆ రాష్ట్ర వాసుల్లో ఆందోళనలు ఉన్నాయి. ఇక తమ రాష్ట్రంలోకి అసోం నుంచి బెంగాలీ హిందువులు తేలిగ్గా వస్తారని అరుణాచల్ ప్రదేశ్ వాసులు భయపడుతున్నారు.



# రాజధాని రణరంగం!



బీహార్ రాజధాని పాట్నాలోని కార్గిల్ చౌక్ వద్ద పోలీసు ఔట్‌పోస్టుకు నిప్పపెట్టిన ఆందోళనకారులు

మొదటిపేజీ తరువాయి...

దిగారు. ఢిల్లీలో ఆందోళనల నేపథ్యంలో ఆదివారం సుమారు డజను మెట్రో స్టేషన్లను మూసివేశారు. దక్షిణ ఢిల్లీలో సోమవారం పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మరోవైపు, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వివిధ రాష్ర్టాల్లో ఆదివారమూ ఆందోళనలు కొనసాగాయి. పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల ఆందోళనకారులు రహదారులను దిగ్బంధించారు. రైల్వే స్టేషన్లపై దాడిచేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆరు జిల్లాలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. అసోంలో ప్రజలు హింసను వీడి శాంతియుత మార్గంలో నిరసన చేపట్టారు. బెంగళూరు, పాట్నాలోనూ నిరసనలు జరిగాయి. పాట్నాలోని కార్గిల్ చౌక్ వద్ద ఒక పోలీస్ చౌకీకి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. 'పౌరసత్వ' సెగ బ్రిటన్‌కూ పాకింది. అక్కడి భారత హైకమిషన్ ఎదుట బ్రిటిష్ అస్సామీ ప్రజలు ఆందోళన నిర్వహించారు.

**అట్టుడికిన ఢిల్లీ**

ఆగ్నేయ ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీలో జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. నిరసన సందర్భంగా దుండగులు నాలుగు బస్సులకు, రెండు పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టారు. ఘర్షణలో సుమారు 60 మంది గాయపడ్డారు. అయితే హింసలో తమ ప్రమేయం లేదని, అది స్థానిక దుండగుల పనేనని విద్యార్థులు ఆరోపించారు. జామియా వర్సిటీ చీఫ్ ప్రొక్టార్ వసీమ్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఢిల్లీ పోలీసులు విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించారని, విద్యార్థులను, సిబ్బందిని కొట్టారని ఆరోపించారు. పోలీస్ చర్యను యూనివర్సిటీ ఉపకులపతి నజ్మా అఖ్తర్ ఖండించారు. హింస అనంతరం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకే తాము వర్సిటీలోకి వెళ్లామని పోలీసులు తెలిపారు. డీసీపీ బిశ్వాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ క్యాంపస్ నుంచి పోలీసులపైకి రాళ్లు రువ్వారని, హింసకు పాల్పడుతున్న మూకను చెదరగొట్టేందుకే టియర్‌గ్యాస్ ప్రయోగించినట్లు చెప్పారు. కొంతమందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పిన ఆయన.. వారి వివరాలు వెల్లడించలేదు. పోలీసుల మధ్య కొంతమంది యువత తలపై చేతులు పెట్టుకుని హాస్టళ్ల నుంచి బయటకు రావడం కనిపించింది. పోలీసులు లైబ్రరీలోకి ప్రవేశించి కొంతమంది విద్యార్థులను వేధించారని పలువురు విద్యార్థులు ఆరోపించారు. కాగా, పోలీస్ చర్యకు నిరసనగా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఐటీవోలోని ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం ఎదుట ఆదివారం రాత్రంతా విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులు లాఠీచార్జి జరిపారని అంతకుముందు నిరసనకారులు తెలిపారు. హింసలో ప్రమేయమున్న 'బయటి వ్యక్తులు' యూనివర్సిటీలోకి వెళ్లి దాక్కున్నారని పేర్కొంటూ.. పోలీసులు వర్సిటీ గేట్లకు తాళాలేసి లోపలకు ప్రవేశించారు. పలు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, జామియా యూనివర్సిటీలోకి పోలీసుల ప్రవేశాన్ని నిరసిస్తూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులు కూడా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ తలెత్తింది. హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ ఉర్దూ వర్సిటీలోనూ అర్ధరాత్రి ఆందోళనలు మొదలయ్యాయి.

**హింస సరికాదు: సీఎం కేజ్రీవాల్**

విద్యార్థుల నిరసన సందర్భంగా చోటుచేసుకున్న హింసను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. అయితే ఆమ్‌ఆద్మీ పార్టీనే హింసను ప్రేరేపిస్తున్నదని బీజేపీ విమర్శించింది.



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ ఉర్దూ వర్సిటీ వద్ద ఆదివారం రాత్రి విద్యార్థుల ఆందోళన

**బెంగాల్ హింసాత్మకం..**

పశ్చిమబెంగాల్‌లో వరుసగా మూడోరోజు ఆదివారం కూడా నిరసనలు కొనసాగాయి. పలు జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని దేగంగా ప్రాంతంలో నిరసనకారులు షాపులను కొల్లగొట్టారు. దక్షిణ 24 పరిగణాల జిల్లాలోని అక్రా రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలకు నిప్పుపెట్టారు. అలాగే టికెట్ కౌంటర్‌పై దాడిచేసి నగదును దోచుకెళ్లారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై రాళ్లు రువ్వారు. నాదియా జిల్లాలో కల్యాణీ ఎక్స్‌ప్రెస్‌వేను నిరసనకారులు దిగ్బంధించారు. ఆందోళన నేపథ్యంలో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే రద్దు చేసింది. హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆరు జిల్లాల్లో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీని బెంగాల్‌లో అమలుచేయబోమంటూ ప్రభుత్వం చేసిన ప్రకటన రాజ్యాంగ విరుద్ధమని ఆ రాష్ట్ర గవర్నర్ జగదీప్ ధన్‌కర్ విమర్శించారు. మరోవైపు, రాష్ట్రంలో పరిస్థితిపై చర్చించేందుకు సీఎం మమతాబెనర్జీ ఆదివారం రాత్రి ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.

**అసోం కర్ఫ్యూ సడలింపు**

అసోంలో కర్ఫ్యూను ఆదివారం కొన్ని గంటల పాటు సడలించారు. దీంతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు ప్రజలు షాపుల ముందు బారులు తీరారు. రాష్ట్ర ప్రజలు ఆసు, ఏజేవైసీపీ వంటి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శాంతిత నిరసన చేపడుతున్నారు. రాష్ట్రంలో ఇంతకుముందు హింసాత్మక ఘటనల సందర్భంగా పోలీసుల కాల్పుల్లో గాయపడిన మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది.



ఢిల్లీ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌వద్ద ఆదివారం రాత్రి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## పౌరసత్వ చట్టంపై సుప్రీంకోర్టుకు ఏజీపీ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టంపై బీజేపీ మిత్రపక్షం అసోం గణ పరిషద్ (ఏజీపీ) యూటర్న్ తీసుకున్నది. పార్లమెంట్‌లో బిల్లుకు అనుకూలంగా ఓటు వేసిన ఆ పార్టీ.. తాజాగా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఈ చట్టం వల్ల తమ సంస్కృతి, భాష, గుర్తింపు ప్రమాదంలో పడుతుందని ప్రజల్లో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో దీనిపై న్యాయ మార్గంలో పోరాటం చేయనున్నట్లు ఆ పార్టీ నేత కుమార్ దీపక్ దాస్ చెప్పారు. కాగా, ఏజీబీ గువాహటి విభాగం ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం ముందు నిరసన చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు అతుల్ బోరాతో పాటు ముగ్గురు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్‌చేసింది. చట్టానికి అనుకూలంగా పార్లమెంట్‌లో పార్టీ ఎంపీ ఓటువేసి, ఇప్పుడు చట్టానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటిషన్ వేస్తే ఏం ప్రయోజనమని ఆ పార్టీ నేత బృందావన్ గోస్వామి విమర్శించారు.

## రాజకీయ పార్టీగా 'ఆసు'!

**న్యూఢిల్లీ:** అసోంలో అధికార బీజేపీ, ఏజీపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మరో కొత్త పార్టీ తెరపైకి రాబోతున్నది. పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా ముందు నుంచీ ఆందోళన చేస్తున్న ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు).. శిల్పి సమాజ్ (కళాకారుల వేదిక)తో కలిసి రాజకీయ పార్టీ ఏర్పాటుచేయనున్నట్లు సంకేతాలిచ్చింది. ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ మాట్లాడుతూ.. మనం కొత్త పార్టీ పెట్టబోతున్నాం అని పేర్కొనగా, ఆసు అధ్యక్షుడు దీపంకనాథ్ స్పందిస్తూ.. ఈ విషయమై శిల్పి సమాజ్‌తో తాము చర్చలు చేపడుతున్నట్లు తెలిపారు.

# సత్వర న్యాయం జరగాలి

### మహిళలపై అఘాయిత్యాలు దేశవ్యాప్త సమస్య

### లైంగికదాడులు లేని ప్రదేశం ప్రపంచంలో ఎక్కడా లేదు

### కనుక కేవలం ఢిల్లీనే నిందించలేం

### మా కుమార్తె లాంటివారు ఎంతోమంది ఉన్నారు

### వారికి సత్వర న్యాయం కోసం పోరాడుతాం.. 'నిర్భయ' తల్లిదండ్రుల స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'నిర్భయ' ఘటన జరిగి నేటికి (డిసెంబర్ 16)ఏడేండ్లు గడిచినప్పటికీ బాధితురాలికి ఇంకా న్యాయం జరుగలేదు. ఈ ఘటన తర్వాత 'రేప్ క్యాపిటల్'గా ఢిల్లీ అపఖ్యాతిపాలైనప్పటికీ ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఉన్నదని, మహిళలపై లైంగికదాడులు దేశమంతటా జరుగుతున్నాయని, తమ కుమార్తెను బలితీసుకొన్నప్పటికీ ఢిల్లీని అసహ్యించుకోబోమని 'నిర్భయ' తల్లిదండ్రులు స్పష్టంచేశారు. 'మా సర్వస్వాన్నీ ఢిల్లీ హరించివేసింది. అంతమాత్రన ఢిల్లీని నిందించబోము. ఎందుకంటే.. మా సొంత రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లోనూ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరుగని ప్రదేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. కనుక మొత్తం ప్రపంచాన్ని మనం అసహ్యించుకోలేము' అని 'నిర్భయ' తల్లి పేర్కొన్నారు. ఇకనైనా పరిస్థితులు బాగుపడతాయని ఆశిస్తున్నామని, అలా జరుగాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని ఆమె తెలిపారు. 'నిర్భయ' కేసులో నలుగురు దోషులకు త్వరలో ఉరిశిక్ష అమలుచేయవచ్చని జోరుగా వార్తలు వెలువడుతుండటంతో ఇకనైనా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని, అయినప్పటికీ దోషులకు డెత్ వారెంట్ జారీచేసి ఉరిశిక్ష తేదీని ఖరారుచేసే వరకు ఇలాంటి వార్తలను నమ్మలేమని ఆమె అన్నారు.

**కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతున్నాం..**

తాము కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతామని, కన్నకూతుర్ని కోల్పోయి ఎంతో క్షోభకు గురైనప్పటికీ భగవంతునిపై విశ్వాసాన్ని కోల్పోలేదని, తమకు దేవుని అండ ఉన్నదని 'నిర్భయ' తండ్రి చెప్పారు. 'నలుగురు నిందితులకు ఉరిశిక్ష అమలుచేయడం ద్వారా నిర్భయకు న్యాయం జరుగుతుంది. కానీ నిర్భయ లాంటి బాధితులు దేశంలో ఎంకా ఎంతోమంది ఉన్నారు. వారి కోసం మా పోరాటాన్ని కొనసాగిస్తాం' అని ఆయన స్పష్టంచేశారు. 'నిర్భయ'కు న్యాయం కోసం గత ఏడేండ్ల నుంచి సాగించిన పోరాటంతో తాము ఎంతో అనుభవాన్ని గడించామని, క్రిమినల్ న్యాయవ్యవస్థలోని లొసుగులేమిటో, వాటిని ఎలా అధిగమించాలో అవగతమైందని, కామాంధుల చేతిలో అఘాయిత్యాలకు గురైన బాధితులకు నిర్ణీత వ్యవధిలోగా న్యాయం జరిగేలా పోరాడుతామని తెలిపారు. రివ్యూ పిటిషన్లు లేదా క్షమాభిక్ష పిటిషన్ల దాఖలుకు నిర్దిష్ట గడువుతో కూడిన విధానమేదీ లేదని, వీటికి గడువును నిర్దేశించాల్సిన అవసరమున్నదని ఆయన పేర్కొన్నారు. దిగువకోర్టు తీర్పుపై కేవలం పరిశీలన జరిపేందుకే హైకోర్టులు, సుప్రీంకోర్టు అధిక సమయం తీసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

**'దిశ'కు న్యాయం జరుగలేదు..**

'దిశ' కేసులో నలుగురు నిందితులను హైదరాబాద్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంతో బాధితురాలికి సత్వర న్యాయం జరిగిందని సంతోషిస్తున్న ప్రజలతో మీరూ ఏకీభవిస్తారా? అని ప్రశ్నించగా.. ఈ కేసులో ఆ యువతిని కాల్చి చంపినందుకు నిందితులను శిక్షించలేదని, కనుక 'దిశ'కు న్యాయం జరుగలేదని, కానీ ఆమె కుటుంబానికైనా శాంతి చేకూరిందని భావిస్తున్నానని 'నిర్భయ' తల్లి చెప్పారు.

## నిర్భయ ఘటనకు ఏడేండ్లు..



**న్యూఢిల్లీ:** రాక్షసత్వం స్వైరవిహారం చేసిన రాత్రికి.. భారతమాత కన్నీటి సంద్రంగా మారిన సందర్భానికి.. ఆహేతు సిమాచలం భగ్గుమన్న 'నిర్భయ' ఘటకు ఏండేండ్లు. ఢిల్లీలో 2012 డిసెంబర్ 16న రాత్రి 9:30 గంటలకు 23 ఏండ్ల వైద్య విద్యార్థిని (నిర్భయ), ఆమె స్నేహితుడు కలిసి ఇంటికి వెళ్లేందుకు సాకేత్ ప్రాంతంలో ఓ ప్రైవేట్ బస్సు ఎక్కారు. డైవరు బస్సు దారి మళ్ళించగా మిగితా ఐదుగురు నిర్భయతోపాటు ఆమె స్నేహితుడిపై ఇనుప రాడ్‌తో దాడిచేశారు. ఆమెను బస్సు చివరకు ఈడ్చుకెళ్లి సామూహిక లైంగికదాడి చేశారు. ఇనుపరాడ్‌ను ఆమె మర్మాంగాల్లోకి జొప్పించి, పేగులను బయటికి లాగి పైశాచిక ఆనందం పొందారు. నెత్తురోడుతున్న ఆమెను వివస్త్రగానే రోడ్డుపై పడేసి వెళ్లిపోయారు. స్థానికులు ఆమెను సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించారు. పేగులకు ఇన్ఫెక్షన్ సోకడంతో 19న దెబ్బతిన్న భాగాలను తొలగించారు. సింగపూర్‌కు తరలించి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. 13 రోజులు మృత్యువుతోపోరాడిన నిర్భయ.. డిసెంబర్ 29న కన్నుమూసింది. ఈ దారుణ అకృత్యం యావత్ దేశాన్ని కదిలించింది. బస్సు డ్రైవర్ రామ్‌సింగ్, తమ్ముడు ముకేశ్ సింగ్, ఇతర నిందితులు వినయ్‌శర్మ, పవన్ గుప్త, అక్షయ్ ఠాకూర్, రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2013 సెప్టెంబరు 13న ట్రాక్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి యోగేష్‌ఖన్నా పవన్, వినయ్, ముఖేశ్, అక్షయ్‌ని చనిపోయేవరకూ ఉరితీయాలని తీర్పునిచ్చారు. రామ్‌సింగ్ ఆత్మహత్య చేసుకోగా.. మైనర్ అయిన రాజు మూడేండ్ల జైలు శిక్ష అనంతరం 2016లో విడుదలయ్యాడు. నలుగురు దోషులు ప్రస్తుతం ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు.

## మా గోస వినేదెవరు?

### నిర్భయ కేసులో దోషి వినయ్‌శర్మ తల్లి ఆవేదన



నిర్భయ దోషులు అక్షయ్, పవన్, ముఖేశ్, వినయ్

**న్యూఢిల్లీ:** 'ప్రతి సంవత్సరం డిసెంబర్ 16కు రెండుమూడు రోజుల ముందు మీలాంటోళ్లు వస్తారు. మా గురించి ఆరా తీస్తారు. ఆ తర్వాత మా బతుకులు ఎట్లున్నయని అడిగేటోళ్లే ఉండరు' అని నిర్భయ కేసులో దోషి వినయ్‌శర్మ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్భయ ఘటన జరిగిన తర్వాత తమ పరిస్థితి దారుణంగా తయారైందని వాపోతున్నారు. ఏండ్లుగా కోర్టుల చుట్టూ, జైళ్ల చుట్టూ తిరిగి అలిసిపోయామని చెప్తున్నారు. తన కొడుకు మరణశిక్ష రద్దవుతుందని, జైలు నుంచి తిరిగొస్తాడని ఆమె ఆశగా ఎదురుచూస్తున్నారు. నిర్భయ కేసులోని ఆరుగురు దోషుల్లో నలుగురు వినయ్‌శర్మ, పవన్ గుప్తా, రామ్‌సింగ్, ముఖేశ్ సింగ్ దక్షిణ ఢిల్లీలోని రవిదాస్ కాలనీలో నివాసం ఉండేవారు. రామ్‌సింగ్, ముఖేశ్ సింగ్ అన్నదమ్ములు. నిర్భయ ఘటన తర్వాత వారి కుటుంబం రాజస్థాన్‌లోని సొంతూరుకు వెళ్లిపోయింది. వినయ్, పవన్ కుటుంబాలు ఇప్పటికీ ఆ మురికివాడలోనే నివాసం ఉంటున్నారు. కొడుకులు చేసిన పనికి అవమాన భారంతో బతుకుతున్నామని, దీనికి తోడు అప్పుడప్పుడూ మీడియా ప్రతినిధులు వచ్చి ప్రశ్నలు వేస్తుండటం మరింత వేదన కలిగిస్తున్నదని వారు వాపోతున్నారు. వినయ్‌శర్మ తల్లి వయసు 50 ఏండ్లు. ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. మురికివాడలోని ఓ ఇరుకైన, కూలడానికి సిద్ధంగా ఉన్న ఓ ఇంటిలో ఆమెనివాసం ఉంటున్నారు.

## 'ఉన్నావ్' కేసులో నేడు తీర్పు!

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్‌దీప్‌సింగ్ సెంగర్‌పై నమోదైన లైంగికదాడి కేసులో సోమవారం కోర్టు తీర్పునివ్వనుంది. 2017లో ఉన్నావ్‌లో ఓ యువతిని కిడ్నాప్ చేసి, లైంగికదాడికి పాల్పడినట్లు అతడిపై గతంలో కేసు నమోదైంది. ఓసారి సదరు యువతి తన బంధువులు, న్యాయవాదితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ఓలారీ ఢీకొట్టింది. దీంతో యు వతి బంధువులు ఇద్దరు మరణించగా.. ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం వెనుక కుల్‌దీప్‌సింగ్ హస్తమున్నదని ఆమె ఆరోపించారు. అయితే లైంగికదాడి కేసులో ఢిల్లీలోని ఓకోర్టు ఎలా ంటి తీర్పునివ్వనున్నదన్నదానిపై ఆసక్తి నెలకొంది.

## యూపీ లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

**బాందా:** ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో 18 ఏండ్ల వయసున్న యువతిపై లైంగికదాడికి పాల్పడి, నిప్పుపెట్టిన దుండగుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం యువతి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దూరపు బంధువు అయిన దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై లైంగికదాడికి పాల్పడి, నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు 90 శాతం శరీరం కాలిపోవడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. పోలీసులు మాట్లాడుతూ సదరు యువతి, నిందితుడు సన్నిహితంగా మెలిగేవారని, ఈ విషయం తెలిసి ఇరువురు దూరంగా ఉండాలని గ్రామ పెద్దలు ఆదేశించినట్లు చెప్పారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన యువతి ఇంటికి వెళ్లి తనంతట తానే నిప్పుపెట్టుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు యువతి మాత్రం ప్రకారం.. ఇంట్లో బాధితురాలు ఒక్కరే ఉన్న సమయంలో నిందితుడు మేవాలాల్ ఇంట్లోకి ప్రవేశించి లైంగికదాడికి పాల్పడి, నిప్పుపెట్టాడు.

# నాంపల్లిలో త్వరలో జంతు సంరక్షణ కేంద్రం

వట్టినాగులపల్లిలోని సంరక్షణ కేంద్రానికి మాజీ ఎంపీ కవిత రూ.5 లక్షల విరాళం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాంపల్లిలో త్వరలోనే జంతు సంరక్షణ కేంద్రాన్ని జంతు సంరక్షకుడు జబీఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్టు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రామ ప్రణాళిక కార్యక్రమంలో ప్రతిగ్రామంలో జంతు సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. హైదరాబాద్ శివారు వట్టినాగులపల్లిలో జబీఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జంతు సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించిన సందర్భంగా కవిత మాట్లాడుతూ.. నాంపల్లిలో ఏర్పాటుచేసే సంరక్షణ కేంద్రానికి పశుసంవర్ధకశాఖ నుంచి పూర్తి సహకారం అందేలా కృషి చేస్తానని చెప్పారు. దేశంలో జంతు సంరక్షణ అంశం చర్చకు వచ్చినప్పుడు తెలంగాణ పేరు, సీఎం కేసీఆర్ పేరు వినిపించేలా చేసిన జబీఖాన్‌ను అభినందించారు. డబ్బు ఆశించకుండా జంతు సంరక్షణకు జబీ చేస్తున్న కృషిని కవిత ప్రశంసిస్తూ.. ఆయన పొందిన అవార్డులు తెలంగాణకు గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా జబీ ప్రారంభించిన జంతు సంరక్షణ కేంద్రానికి కవిత రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జంతు సంరక్షణ కేంద్రానికి రూ.5 లక్షల విరాళం చెక్కును జబీఖాన్‌కు అందజేస్తున్న మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.

## ఎస్సీఆర్‌కు నాలుగు ఇంధన పొదుపు అవార్డులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ మధ్య రైల్వే నాలుగు ఇంధన పొదుపు అవార్డులను గెలుచుకున్నది. వీటిని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఇంధన మంత్రిత్వశాఖ ప్రదానంచేసింది. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్‌శాఖ సహాయ మంత్రి ఆర్కేసింగ్ చేతులమీదుగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఏఏ ఫడ్కే, హైదరాబాద్ డివిజనల్ డీఆర్‌ఎం ఎన్‌ఎస్‌ఆర్ ప్రసాద్ నాలుగు పురస్కారాలను అందుకున్నారు. ఇతర మంత్రిత్వశాఖలు, కార్పొరేట్ సంస్థలు పోటీలో ఉన్నా దక్షిణ మధ్య రైల్వే ఎనిమిది ఏండ్లుగా జాతీయ ఇంధన పొదుపు అవార్డులను సాధించడంలో ముందుంటున్నది.




ఢిల్లీలో అవార్డులు అందుకుంటున్న ఏఏ ఫడ్కే, ఎన్‌ఎస్‌ఆర్ ప్రసాద్





సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలుగుపల్లిలోని రుద్రమ చెరువు అలుగుపోస్తుండటంతో ఆదివారం పూలుచల్లి పూజలుచేస్తున్న మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్

# డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్

- అమెరికా- భారత్‌ల రక్షణ బంధం బలోపేతంలో కీలకపాత్ర
- 18 బిలియన్ డాలర్లకు చేరుకున్న ఇరుదేశాల రక్షణ వాణిజ్యం
- నేటినుంచి టీహబ్‌లో డిఫెన్స్ స్టార్టప్‌ల వర్క్‌షాప్
- బుధవారం నుంచి రక్షణ సంబంధాలపై సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

భారత్, అమెరికాల మధ్య రక్షణరంగ వాణిజ్యం రోజురోజుకూ బలోపేతమవుతున్నది. గత రెండు దశాబ్దాలలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అగ్రరాజ్యం భారత్‌ను అతి ముఖ్యదేశంగా భావిస్తున్నది. అమెరికాకు వ్యూహాత్మక వాణిజ్య అధికారదేశంగా ఎస్టీఏ-1 హోదా ఉన్న భారత్ అగ్రరాజ్యానికి ప్రధాన రక్షణ భాగస్వామిగా ఎదిగింది. ప్రస్తుతం రెండుదేశాల మధ్య 18 మిలియన్ డాలర్ల మేర వాణిజ్యం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ నెల 18 న అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఇరుదేశాల రక్షణ, విదేశాంగ మంత్రుల సమావేశం జరుగనున్నది. భద్రత, సైన్స్, సాంకేతికత, ఉగ్రవాదం తదితర అంశాలతోపాటు ఇరు దేశాల మధ్య గల వ్యూహాత్మక సంబంధాలపై చర్చించనున్నారు. భారత్ నుంచి రక్షణ వ్యవహారాల మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీవ్యవహారాల మంత్రి జైశంకర్ పాల్గొంటున్నారు. ఇదేసమయంలో తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అమెరికా, భారత్ రక్షణ సంబంధాలపై రెండు కీలక సమావేశాలు జరుగనున్నాయి. సోమ, మంగళవారాల్లో (డిసెంబర్ 16-17) టీ-హబ్‌లో రక్షణరంగ స్టార్టప్‌ల వర్క్‌షాప్ జరుగుతుండగా.. బుధ, గురువారాల్లో (డిసెంబర్ 18-19) హోటల్ తాజ్ కృష్ణలో ఇరుదేశాల రక్షణ సంబంధాల సదస్సు జరుగుతున్నది. దేశ రక్షణరంగానికి అవసరమైన ఉత్పత్తులకు సంబంధించి 22 శాతం హైదరాబాదే తీరుస్తున్నది. హైదరాబాద్ వేదికగా జరుగబోయే సదస్సులు రక్షణ రంగంలో నగరఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



### రక్షణరంగ స్టార్టప్‌ల వర్క్‌షాప్

సోమ, మంగళవారాల్లో టీ-హబ్‌లో జరుగనున్న స్టార్టప్‌లో వర్క్‌షాప్‌ను అమెరికా కాన్సులేట్, నెక్సస్ స్టార్టప్ హబ్ (న్యూఢిల్లీ) సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. భారత, అమెరికా ద్వైపాక్షిక రక్షణ బంధాన్ని పటిష్ఠం చేస్తుందని నిపుణులంటున్నారు. డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి స్టార్టప్ సంస్థలు తమ వినూత్న ఆవిష్కరణలను ఇందులో ప్రదర్శించనున్నాయి. పలువురు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులు ఈ వర్క్‌షాపులో పాల్గొంటున్నారు.

### రక్షణ ఒప్పందాల సదస్సు

బుధ, గురువారాల్లో భారత, అమెరికా రక్షణ ఒప్పందాల సదస్సు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. రెండుదేశాల రక్షణ అధికారులు, పరిశోధకులు, రక్షణ వ్యాపార దిగ్గజాలతో యూఎస్ కాన్సులేట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో, బిజినెస్ కౌన్సిల్ ఫర్ ఇంటర్‌నేషనల్ అండర్ స్టాండింగ్ (బీసీఐయూ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సంయుక్తంగా సదస్సును నిర్వహిస్తున్నాయి. రక్షణ రంగంలో అనుసరిస్తున్న ద్వైపాక్షిక విధానాలు, అమెరికా రక్షణ పరిశ్రమల సహకారం, భాగస్వామ్యంతో తయారీ విధానాలు, ఆవిష్కరణలు, సాంకేతికత తదితరాలపై సదస్సులో సమీక్ష జరుగనుంది.

### రక్షణ రంగానికి హబ్‌గా హైదరాబాద్

భౌగోళికంగా ఉన్న పరిస్థితులకుతోడు తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాద్‌లో నెలకొన్న సానుకూల వాతావరణం వల్ల దేశ విదేశాల్లోని బడా కంపెనీలు ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నాయి. రక్షణరంగానికి చెందిన మల్టినేషనల్, ఇండియన్ ప్రీమియర్ రీసెర్చ్ సెంటర్స్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. జీఈ, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, సికోర్స్కీలు ఇప్పటికే రాగా, మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు క్యూ కడుతున్నాయి. రక్షణ రంగానికి అవసరమయ్యే లీప్ ఇంజన్లు, ఎఫ్ 16 యుద్ధ విమానాల రెక్కలు, అపాచీ హెలికాప్టర్ల విడిభాగాలు, అదానీ ఎల్బిట డిఫెన్స్ సిస్టమ్స్ ద్వారా డ్రోన్ల తయారీ, సూపర్ హెర్క్యులస్ ఎయిర్ లిఫ్టర్ (సీ-130జె), హెలికాప్టర్ (ఎస్-92)ల ఉత్పత్తి విజయవంతంగా జరుగుతున్నది. ఈ బడా కంపెనీలకు సంబంధించి పరికరాలు తయారుచేసేందుకు పెద్ద మొత్తంలో ఎంఎస్‌ఎంఈలు నెలకొంటున్నాయి. హైదరాబాద్ మిస్సైల్ టెక్నాలజీలో మేజర్ హబ్‌గా కొనసాగుతున్నది.

### హైదరాబాద్‌లో ఉన్న రక్షణరంగ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు

**ప్రభుత్వరంగ సంస్థలు**

- డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)
- డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబోరేటరీ (డీఆర్డీఎల్)
- అడ్వాన్స్‌డ్ న్యూమెరికల్ రీసెర్చ్ అండ్ అనాలసిస్ గ్రూప్ (అనురాగ్)
- డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబోరేటరీ (డీఎల్లార్ఎల్)
- డిఫెన్స్ మెటలార్జికల్ రీసెర్చ్ లాబోరేటరీ (డీఎమ్మార్ఎల్)
- సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్(సీఏఎస్)
- భారత్ ఎలక్ట్రానిక్స్ (బెల్)

**ప్రైవేటు భాగస్వామ్యంతో..**

- టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్)
- సాబ్ ఇండియా టెక్నాలజీ సెంటర్ (ఎస్ఐటీసీ)
- డుపాంట్ బాలిస్టిక్ ఫెసిలిటీ (డీబీఎఫ్)
- నేషనల్ బెలూన్ ఫెసిలిటీ (ఎన్‌బీఎఫ్)

### రక్షణ వాణిజ్యంలో ముందడుగు

భారత్, అమెరికా మధ్య రెండు దశాబ్దాలనుంచి కొత్త సంబంధాలు మొదలయ్యాయి. రక్షణరంగంలో ఇరుదేశాల మధ్య భాగస్వామ్యం ఉన్నత స్థితికి చేరుతున్నాయి. హైదరాబాద్ వేదికగా ఇలాంటి సదస్సులు జరగటం గొప్ప విషయం. దీని వల్ల హైదరాబాద్‌కు రక్షణ రంగానికి సంబంధించి పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుంది.

**-జాన్ డ్రూ గిబ్లిన్, పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్, యూఎస్ కాన్సులేట్ హైదరాబాద్**

# కరువు నేలకు కాళేశ్వరం నీళ్లు

- ఆ ఘనత సీఎం కేసీఆర్‌దే
- జనహిత సభలో ఇచ్చిన హామీ నెరవేర్చాం
- మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి వెల్లడి
- సూర్యాపేట జిల్లా రుద్రమచెరువులో పూజలు

**తిరుమలగిరి నమస్తేతెలంగాణ:**

కరువు నేలైన తుంగతుర్తి నియోజకవర్గానికి కాళేశ్వరం నీళ్లను అందించిన ఘనత అపర భగీరథుడు, ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలుగుపల్లిలోని రుద్రమ చెరువును సందర్శించారు. 24 ఏప్రిల్ 2018న అసంపూర్తిగా, అస్తవ్యస్తంగా ఉన్న ఎస్సారెస్పీ కాల్వలను మంత్రులు జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌తో కలిసి మోతె, అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో కాల్వల గట్ల వెంట సుమారు 70 కిలోమీటర్లు పర్యటించారు. అదే రోజు తిరుమలగిరిలో నిర్వహించిన జనహిత సభలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దసరా వరకు కాళేశ్వరం నీటిని అందించడంతో ప్రస్తుతం రుద్రమ చెరువు నిండి అలుగుపోస్తున్నది. దీంతో మంత్రులు ఆదివారం అక్కడికి చేరుకొని ఆనందం వ్యక్తం చేస్తూ చెరువులో పూలు చల్లి పూజలు చేశారు. అలుగు పోస్తున్న నీటిలోకి దిగారు. ఆనందంతో ఆ నీటిని ముద్దాడటంతోపాటు తాగారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఎస్సారెస్పీ కాల్వల ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి మొదటిసారి రావడంతో రైతుల కండ్లల్లో ఆనందం కనిపిస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ కలలు ఫలిస్తున్నాయని, కోటి ఎకరాల మాగాణే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయన్నారు. రాబోవు రోజుల్లో రుద్రమ చెరువును సైతం రిజర్వాయర్‌గా మార్చి తుంగతుర్తి నియోజక వర్గానికి సాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ముఖ్యమంత్రి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. కాల్వల ద్వారా రైతులకు రెండు పంటలకు నీరందించడం కేవలం కేసీఆర్‌కే సాధ్యమని చెప్పారు. వీరి వెంట రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనవరి 31 కల్లా వివరాలు ఇవ్వండి

- అన్నిశాఖలను కోరిన పీఆర్సీ
- ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌పై కసరత్తు ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సర్వీస్‌రూల్స్ ఎలా ఉండాలన్న దానిపై పే రివిజన్‌కమిషన్ (పీఆర్సీ) కసరత్తు మొదలుపెట్టింది. 2020 జనవరి 31లోపు ప్రభుత్వ శాఖలకు సంబంధించి అన్నిరకాల ఉద్యోగుల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో పంపించాలని కోరింది. రెగ్యులర్, వర్క్ చార్జ్‌డ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హోంగార్డులు, అంగన్‌వాడీలు తదితర క్యాటగిరీలకు చెందిన, గ్రామస్థాయి నుంచి సచివాలయం వరకు ఉద్యోగుల వివరాలన్నీ పంపించాలని కోరింది. 2020 మార్చిలో అసెంబ్లీలో బడ్జెట్ ప్రిపరేషన్ కోసం ఆర్థికశాఖ కూడా వివరాలు కోరింది. ఆర్థికశాఖకు పంపించే వివరాలనే అన్నిశాఖలు పీఆర్సీకి పంపించనున్నాయి. రాష్ట్రప్రభుత్వం పీఆర్సీ గడువును ఫిబ్రవరి 24 వరకు పొడిగించింది. దీంతోపాటు జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పీఆర్సీకి అదనపు పనిని అప్పగించింది. ఇప్పుడున్న ప్రభుత్వశాఖల్లో ఎంతమంది ఉద్యోగులున్నారు? వారి పని విభజన ఎలా ఉన్నది? ఉద్యోగుల పునర్విభజన జిల్లాలవారీగా ఎలా ఉండాలో సర్వీస్ రూల్స్ రూపొందించాలని ప్రభుత్వం పీఆర్సీని కోరింది. జనవరి 31లోగా సమాచారం పంపిస్తే ఫిబ్రవరి 1 నుంచి 24 వరకు సర్వీస్‌రూల్స్‌పై కసరత్తు చేసి, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు నివేదికరూపంతో ఇవ్వనున్నది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం కొత్త సర్వీస్‌రూల్స్ తీసుకువచ్చే అవకాశం ఉన్నది.

## లైంగికదాడి కేసుల్లో పక్కాగా దర్యాప్తు

- శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రత్యేక కిట్లు
- రూ.71.60 లక్షలతో 3,120 కిట్లు కొనుగోలు చేసిన కేంద్రం
- రాష్ట్రానికి 87 కిట్లు కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలపై లైంగికదాడుల కేసుల్లో నిందితులకు పక్కాగా శిక్షపడేలా అవసరమైన శాస్త్రీయ ఆధారాల సేకరణలో మరింత నాణ్యత పెరుగనున్నది. ఇందుకోసం కేంద్రం ప్రత్యేక కిట్లను కొనుగోలు చేసింది. రూ.71.60 లక్షల ఖర్చుతో 3,120 నేర పరిశోధన ఆధారాల సేకరణ కిట్లను కొనుగోలు చేసింది. వీటిలో తెలంగాణ రాష్ట్రానికి 87 కిట్లను కేటాయించింది. ఇవి త్వరలోనే రాష్ట్ర పోలీస్‌శాఖకు చేరనున్నట్టు సమాచారం. లైంగికదాడుల కేసుల్లో నిందితులను గుర్తించడంలో కీలకమైన వీర్యకణాలు, డీఎన్‌ఏ శాంపిల్స్ సేకరణకు ఈ కిట్లు మరింత ఉపకరిస్తాయని ఫోరెన్సిక్ నిపుణులు చెప్తున్నారు. ప్రతి కిట్‌లో టెస్ట్‌ట్యూబ్‌లు, అవసరమైన కెమికల్ బాటిల్స్, కేసు నమోదైనట్టు క్రైం సీన్‌లో ఏయే ఆధారాలను తప్పక సేకరించాలి, వాటిని సేకరించే సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలని తదితర పూర్తి సమాచారాన్ని తెలిపే బుక్‌లెట్ సైతం ఉంటుంది. ఈ అత్యాధునిక కిట్లతో శాస్త్రీయ ఆధారాలను ఏవిధంగా సేకరించాలన్నదానిపై నవంబర్ 11 వరకు దేశవ్యాప్తంగా 6,053 మంది ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. వీరంతా ఆయా రాష్ట్రాల్లోని ఫోరెన్సిక్ బృందాలకు మళ్లీ శిక్షణ ఇవ్వనున్నారు.

# సీఎం కేసీఆర్ కల సాకారం

- స్వరాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు పెద్దపీట
- గృహ నిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- రాఘవపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవం
- పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే రాజయ్య



జనగామ జిల్లా రాఘవపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే రాజయ్య కూడా ఉన్నారు.

**స్టేషన్‌ఘన్‌పూర్, నమస్తే తెలంగాణ:** అధికారంలోకి వస్తే మొదట బడుగు, బలహీనవర్గాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని తెలంగాణ ఉద్యమ సమయంలో హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ కల సాకారమైందని, ఇందుకు నిదర్శనం రాఘవపూర్‌లో పేదలకు అందించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లేనని గృహనిర్మాణశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్‌లో రూ.2.51 కోట్లతో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఆదివారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు పేదలను పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం పేదలకు పెద్దపీట వేస్తూ కల్యాణలక్ష్మి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వంటి పథకాలు ఎన్నో అమలుచేస్తున్నదని చెప్పారు. ప్రపంచంలోనే అతి తక్కువ కాలంలో సీఎం కేసీఆర్ తెలంగాణలో కాళేశ్వరం లాంటి గొప్ప ప్రాజెక్టును నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజల ఆశయాలను సీఎం కేసీఆర్ నేరవేర్చారని తెలిపారు. రాష్ట్రంలో 2.83 లక్షల డబుల్ బెడ్‌రూం ఇండ్లకు రూ.18 వేల కోట్లు నిధులు మంజూరు కాగా, ఇప్పటివరకు 1.30 లక్షల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. సీఎం కేసీఆర్‌కు రైతులు, పేదవాళ్లు రెండు కండ్లలాంటి వారని పేర్కొన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాఘవపూర్‌లో డబుల్ ఇండ్లకు సీఎం కేసీఆర్ కాలనీగా నామకరణం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. తెలంగాణను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు.

# పెరిగిన విజయ పాల ధరలు

- లీటరుకు రూ.2 పెంపు
- నేటి నుంచి అమల్లోకి..
- నాలుగునెలల క్రితమే రేట్లు పెంచిన ప్రైవేటు డెయిరీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాడి రైతుల నుంచి పాలసేకరణ ధరలు పెరిగిన నేపథ్యంలో పాల సరఫరా ధరలను కూడా పెంచాలని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) నిర్ణయించింది. ఈ మేరకు లీటరుకు రూ.2 చొప్పున పాల ధరలు పెంచింది. కొత్త ధరలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని టీఎస్‌డీడీసీఎఫ్ వెల్లడించింది. స్టాండర్డ్ (వెన్నశాతం 4.5 శాతం) పాలు, హోల్ (వెన్న 6 శాతం) పాల ధరల్లో ఎలాంటి మార్పుచేయలేదని పేర్కొన్నది. పెరిగిన పాల ధరల నేపథ్యంలో వెండర్ మార్జిన్‌ను లీటర్‌కు 25 పైసలు, బేస్ మార్జిన్‌ను లీటరుకు రూ.3.25 పైసలు పెంచినట్టు టీఎస్‌డీడీసీఎఫ్ జనరల్ మేనేజర్ తెలిపారు. విజయ డెయిరీ నుంచి నిత్యం 2.20 లక్షల లీటర్ల పాలు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రైవేటు డెయిరీలు నాలుగునెలల క్రితమే పాల ధరలను పెంచాయి. ప్రైవేటు డెయిరీల పాల ధరలతో పోలిస్తే మార్కెట్‌లో విజయ పాల ధరలే తక్కువగా ఉన్నాయి.

| పాలరకం | ప్యాకింగ్ పరిమాణం | ప్రస్తుత ధర | కొత్త ధర |
|---|---|---|---|
| 1. డైట్‌మిల్క్ | 500 మి.లీ | రూ.18.00 | రూ.19.00 |
| 2. డబుల్ టోన్డ్‌మిల్క్ | 200 మి.లీ | రూ.8.00 | రూ.8.50 |
| 3. డబుల్‌టోన్డ్ మిల్క్ | 300 మి.లీ | రూ.11.00 | రూ.12.00 |
| 4. ఫ్యామిలీ మిల్క్ | 500 మి.లీ | రూ.20.00 | రూ.21.00 |
| 5. డబుల్‌టోన్డ్ మిల్క్ | 500 మి.లీ | రూ.19.00 | రూ.20.00 |
| 6. టీ స్పెషల్ మిల్క్ | 500 మి.లీ | రూ.20.00 | రూ.21.00 |
| 7. టోన్డ్ మిల్క్ | 200 మి.లీ | రూ.8.50 | రూ.9.00 |
| 8. టోన్డ్‌మిల్క్ | 500 మి.లీ | రూ.21.00 | రూ.22.00 |
| 9. టోన్డ్ మిల్క్ | 1000 మి.లీ | రూ.42.00 | రూ.44.00 |
| 10. టోన్డ్‌మిల్క్ | ఆరు లీటర్లు | రూ.246.00 | రూ.258.00 |
| 11. ఆవుపాలు | 500 మి.లీ | రూ.21.00 | రూ.22.00 |

## సినీ నిర్మాత బషీద్‌షేక్ అరెస్ట్!

### రియల్‌ఎస్టేట్ రుణాలు ఇప్పిస్తానని మోసం



బషీద్‌షేక్

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** దేశ విదేశాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, రుణాలను ఇప్పిస్తానంటూ బంజారాహిల్స్, కేపీహెచ్‌పీ పోలీస్టేషన్ల పరిధిలో రూ.లక్షలు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న సినీ నిర్మాత బషీద్‌షేక్‌ను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా వేజండ్లకు చెందిన బషీద్‌షేక్ అలియాస్ బాసిత్ (46) రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు 2008లో హైదరాబాద్‌కు వచ్చాడు. బంజారాహిల్స్ రోడ్‌నం. 7లో ఉంటూ.. ఎస్బీకే గ్రూపు పేరుతో రియల్‌ఎస్టేట్ సంస్థను ప్రారంభించాడు. ముంబై, చెన్నై, బెంగళూరు, దుబాయ్‌లోనూ కార్యాలయాలు ప్రారంభించిన బషీద్‌షేక్ సినిమా ఫైనాన్స్ వ్యాపారంలోకి దిగి 9 తెలుగు సినిమాలను నిర్మించి, మరో 4 సినిమాలకు కోప్రొడ్యూసర్‌గానూ ఉన్నాడు. ఐదేండ్ల కిందట విడుదలైన 'ఎవడ్రా హీరో' సినిమాలో హీరోగా చేసి నష్టపోయాడు. తర్వాత బషీద్ అక్రమాలకు తెరలేపాడు. ఫిలింనగర్ ఎమ్మార్సీకాలనీలో కార్యాలయం తెరిచి రియల్‌ఎస్టేట్ రుణాలు ఇప్పిస్తానని రిజిస్ట్రేషన్ చలాన్ల పేరిట వసూళ్లకు పాల్పడ్డాడు. రూ.10 కోట్ల రుణం ఇప్పిస్తానని కేపీహెచ్‌పీకి చెందిన వ్యాపారి సోడిషెట్టి పానకాలరావు నుంచి గత జూన్‌లో రూ.65 లక్ష లు వసూలు చేయగా, గతనెల గుంటూరుకు చెందిన గురవయ్య నుంచి రూ.35 లక్షలు వసూలు చేశాడు. బషీద్‌పై బాధితుడు బంజారాహిల్స్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# నెలాఖరుకల్లా దిశ చార్జిషీట్!

- అన్ని ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు
- 30 మంది సాక్షుల గుర్తింపు.. స్టేట్‌మెంట్ల రికార్డు
- మూడ్రోజుల్లో హైదరాబాద్‌కు త్రిసభ్య కమిషన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ కేసు దర్యాప్తులో పోలీసులు మరింత వేగం పెంచారు. ఈ కేసులో మొత్తం 30మంది సాక్షులను గుర్తించిన పోలీసులు వారి నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ఇప్పటికే డీఎన్‌ఏ ఫోరెన్సిక్ నివేదికలు అందగా.. వేలిముద్రలు, సీసీ కెమెరాల దృశ్యాలు, వాటి విశ్లేషణ నివేదిక, ఇతర ఫోరెన్సిక్ నివేదికలు సేకరించి నెలాఖరులోగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. గత నెల 27న లైంగికదాడికి గురై హత్య చేయబడిన దిశ కేసుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా టోల్‌బూత్ సిబ్బంది, పంక్చర్‌షాపు, పెట్రోల్ బంక్, వైన్‌షాపు సిబ్బంది తదితర 30 మంది సాక్షులు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. విచారణలో వీరందరినీ పోలీసులు ఫాస్ట్‌ట్రాక్‌లో హాజరుపర్చే అవకాశం ఉన్నది. లారీతోపాటు సంఘటనాస్థలంలో దొరికిన మద్యం బాటిళ్లు, దిశ ద్విచక్రవాహనంపై ఉన్న వేలిముద్రలను పోలీసులు సేకరించారు. వీటిని నిందితులు అరెస్టు సమయంలో తీసుకున్న వేలిముద్రలతో సరిపోల్చనున్నారు. సైబరాబాద్ పోలీసులు దాదాపు 10 బృందాలతో దర్యాప్తుకు సంబంధించిన పూర్తి వివరాలను క్రోడీకరించుకుని వాటికి సంబంధించిన ఆధారాలను సేకరించి పోలీసులు చార్జిషీటు దాఖలుకు సమయాత్తమవుతున్నారు. కాగా, దిశ నిందితుల ఎదురుకాల్పుల ఘటనపై సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన త్రిసభ్య కమిషన్ మూడ్రోజుల్లో హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉన్నది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీఎస్ సిర్‌పుర్కర్, బాంబే హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ రేఖా తొండూర్, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్ బృందం నగరానికి చేరుకున్న తర్వాత ముందుగా గాంధీ మార్చురీలో భద్రపర్చిన నిందితుల మృతదేహాలను పరిశీలించనున్నది. అనంతరం ఎదురుకాల్పుల ఘటనపై విచారణ జరిపి అర్నెల్లలో సుప్రీంకోరుక్టు నివేదిక అందజేయనున్నది.

### విరాళాల సేకరణ తప్పుడు ప్రచారం: దిశ తండ్రి

**శంషాబాద్:** దిశ పేరు మీద విరాళాలు సేకరణ అంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతున్నదని దిశ తండ్రి ఖండించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమకు అలాంటి అవసరం కూడా లేదని తెలిపారు. తమ కూతురును ఎంతో అల్లారుముద్దుగా పెంచి, మంచి చదువులు చదివించామని.. ఉన్నతమైన ఉద్యోగం కోసం ఎంతో ప్రోత్సహించామని చెప్పారు. దిశ లేని లోటు మాకు ఎవరు పూడ్చలేరని.. ఎంతో విలువైన తమ కూతురినే పోగొట్టుకున్న మాకు ఎవరేమీ ఇవ్వగలరని ప్రశ్నించారు. తమపై తప్పుడుప్రచారం ఆపకుంటే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## బాటిళ్లలో పెట్రోల్ తీసుకెళ్లొద్దు!

అతిక్రమిస్తే ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బాటిళ్లలో పెట్రోలు తీసుకెళ్లేవారిపై పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించారు. ఆదేశాలను ఉల్లంఘించి బాటిళ్లలో పెట్రోల్ తీసుకువెళ్తున్నవారితోపాటు పోసిన బంక్ సిబ్బందిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. దిశ ఘటన అనంతరం బాటిళ్లలో పెట్రోలు తీసుకువెళ్లొద్దని, తీసుకువెళ్తే చట్టపరమైన చర్యలు తప్పవని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు దీనిపై ప్రత్యేక దృష్టిని పెడుతున్నారు. ఇప్పటికే పెట్రోల్ బంక్ యాజమాన్యాలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో పెట్రోల్ విక్రయించేవారిపైనా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి చర్యలు తీసుకోనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా తీసుకెళ్తే వారి పూర్తి వివరాలు, ఫొటో, ధ్రువీకరణపత్రాలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అందుకు భిన్నంగా ఎవరైనా బాటిళ్లలో పెట్రోల్, డిజిల్ తీసుకెళ్తే ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదుచేస్తామని, పెట్రోలు తీసుకెళ్తున్న వ్యక్తి చెప్పేవివరాలు అనుమానాస్పదంగా ఉంటే అప్పుడు ఐపీసీ సెక్షన్ తీవ్రత పెరుగుతుందని స్పష్టం చేశారు. కేసు నమోదయి అభియోగం రుజువైతే నెల నుంచి 6 నెలల వరకు జైలు శిక్ష, జరిమానా పడే అవకాశం ఉందని పోలీసులు వివరించారు.

### నిబంధన ఉల్లంఘిస్తే కేసు తప్పదు



బాటిళ్లలో పెట్రోలు తీసుకెళ్తే చట్టప్రకారం నేరం. దీనిపై బంక్ యాజమాన్యాలు, సిబ్బందికి అవగాహన కల్పించాం. అత్యవసరమై తీసుకెళ్లేవారు అవసరమైన పత్రాలు బంక్ సిబ్బందికి ఇవ్వాలి. దుకాణాల్లో అక్రమంగా పెట్రోల్ విక్రయించేవారిని గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తాం. నిబంధనను ఎవరు ఉల్లంఘించినా ఐపీసీ సెక్షన్188 కింద కేసు తప్పదు.

**-ప్రకాశ్‌రెడ్డి, శంషాబాద్ డీసీపీ**

## యాదాద్రికి పోటెత్తిన భక్తులు



యాదాద్రి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రద్దీ కారణంగా నారసింహుడిని దర్శించుకునేందుకు గంటల కొద్దీ క్యూకట్టారు. శ్రీసత్యనారాయణ స్వామివారి వ్రత పూజల్లో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి ఖజానాకు రూ.23,12,652 ఆదాయం సమకూరింది.
- యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ

## భద్రాద్రిలో దీక్షల విరమణ



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గతనెలలో ప్రారంభమైన శ్రీరామ పునర్వసు దీక్షలు ఆదివారం ముగిశాయి. దీక్షల విరమణను పురస్కరించుకొని స్వామివారి ఉత్సవ మూర్తులను బేడా మండపంలో వేంచేపుంచేసి పూజలు నిర్వహించారు. సంక్షిప్త రామాయణ హవనం చేసిన ఇరుముడులతో నగర ప్రదక్షిణ తరువాత దీక్షలను విరమించారు. ఈ వేడుకలో ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.
- భద్రాచలం, నమస్తే తెలంగాణ.



ములుగు జిల్లా వాజేడు మండలంలోని తెలంగాణ నయాగరా బొగత జలపాతాన్ని చూసేందుకు ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. జలపాతం ముందు ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్‌లో స్నానాలు చేస్తూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.. - వాజేడు



భూపాలపల్లిలో జిల్లా కేంద్రంలోని సుభాశ్‌కాలనీలో మటన్ షాపు నిర్వాహకుడు మొగిలిరాజు పర్యావరణ పరిరక్షణ కోసం వినూత్న ఆలోచన చేశాడు. తన దుకాణంలో మాంసం కొనుగోలు చేసే వారు టిఫిన్‌బాక్స్‌తో వస్తే 50 గ్రాముల మటన్ ఉచితంగా ఇస్తానని ప్రకటించాడు. దీంతో పలువురు పర్యావరణ ప్రేమికులు రాజు చొరవను అభినందిస్తున్నారు.
- భూపాలపల్లి టౌన్ (జయశంకర్ భూపాలపల్లి)

# ఎస్సారార్‌కు పరవళ్లు

- 11 రోజుల్లో 5.7 టీఎంసీలు
- లక్ష్మి పంప్‌హౌస్‌లో నడుస్తున్న మూడు మోటర్లు



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌లో పంపుల ద్వారా ఉప్పొంగుతున్న జలాలు



లక్ష్మి పంప్‌హౌస్‌లో ఎత్తిపోస్తున్న మోటర్లు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో ఆదివారం నాలుగు మోటర్లను నడిపించారు. పంప్‌హౌస్‌లోని 1, 5, 6,7వ మోటర్ల ద్వారా సరస్వతి బరాజ్‌కు 8,680 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఈ నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలుతున్నాయి. ఈ బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

**గాయత్రిలో బాహుబలి మోటర్లు..**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ధర్మారం మండలం నంది రిజర్వాయర్‌కు చేరుకుంటున్న గోదావరి జలాలు అక్కడి నుంచి గాయత్రి పంపుహౌస్ సర్జిపూల్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ 1, 3వ నంబర్ బాహుబలి మోటార్లు సుమారు 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా శ్రీరాజరాజేశ్వర జలాశయానికి పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నెల 5వ నుంచి ఆదివారం సాయంత్రం వరకు 5.7 టీఎంసీల నీటిని శ్రీ రాజరాజేశ్వర రిజర్వాయర్‌కు తరలించినట్టు అధికారులు తెలిపారు. ఎస్సారార్ పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలకు గాను ప్రస్తుతం 23.133 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని, కాగా 5,235 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

## బాలికను గర్భవతిని చేసిన యువకుడు

నిజామాబాద్ జిల్లాలో ఘటన

**వర్ని:** ప్రేమపేరుతో ఓ యువకుడు బాలికను నమ్మించి గర్భవతిని చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో వెలుగుచూసింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదే గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ (20) బాన్సువాడలో డిగ్రీ చదువుతున్నారు. వీరిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో వీరు సన్నిహితంగా మెలగడంతో బాలిక గర్భం దాల్చింది. కాగా బాలిక మూడ్రోజుల క్రితం అబార్షన్ కోసం మాత్రలు వేసుకున్నది. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబీకులు బోధన్‌లోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. అక్కడి వైద్యులు నిజామాబాద్ జిల్లాకేంద్ర దవాఖానకు తరలించారు. శనివారం బాలికను పరీక్షించగా గర్భం దాల్చినట్టు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో అమ్మాయి కుటుంబ సభ్యులు శనివారం రాత్రి వర్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.



వనపర్తి చెరువులో బోటులో ప్రయాణిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## పర్యాటక కేంద్రాలుగా వనపర్తి చెరువులు

వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్:** వనపర్తిలోని రాజనగరం చెరువు, నల్లచెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వనపర్తి మండలం రాజనగరంలో ఉన్న చెరువులో బోటు షికారును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డి బోటు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వనపర్తిలోని చెరువుల్లో ఎల్లవేళలా కృష్ణమ్మ నీరు ఉండేలా చర్యలు తీసుకున్నామని, దీంతో వనపర్తి, చుట్టు పక్కల ప్రజలు సెలవు రోజుల్లో ఆహ్లాదకరంగా విహరించడానికి వీలుగా బోటు షికారును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరగా వనపర్తిలోని నల్లచెరువులో బోటు షికారు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాన్నారు. నిర్వాహకులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు.

## సీనియర్ల ర్యాగింగ్

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**తిమ్మాజిపేట:** సీనియర్ల ర్యాగింగ్ భరించలేక ఓవిద్యార్థి ఆత్మహత్యయాత్నానికి పాల్పడ్డఘటన తిమ్మాజిపేట మండటం రాళ్లచెరువు తాండాలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాళ్లచెరువుతండాకు చెందిన ఆర్ బోజ్యా, రామ్లీ దంపతుల కుమారుడు సంతోష్ (19) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న సంతోష్‌ను సీనియర్లు ర్యాగింగ్ పేరుతో వేధించడం, దాడి చేయడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి హాస్టల్ నుంచి తన సొంత ఊరు రాళ్లచెరువు తండాకు వెళ్లి పురుగులు మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వెంటనే చికిత్స అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

# చివరి దశలో మిషన్ కాకతీయ పనులు

- 46 వేల చెరువుల పూడికతీత
- చెరువుల పునరుద్ధరణతో 265 టీఎంసీల నీటి లభ్యత
- ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు
- పుస్తకావిష్కరణలో పాల్గొన్న మంత్రులు హరీశ్, జగదీశ్‌రెడ్డి



'పిట్ట వాలిన చెట్టు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, సోలిపేట రామలింగారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ దీపికా, ఎంపీ బడుగుల, రచయిత వర్ధెల్లి వెంకటేశ్వర్లు

**తుంగతుర్తి:** స్వరాష్ట్రం ఏర్పాటు అనంతరం 2014లో సీఎం కేసీఆర్ తొలిసారి మిషన్ కాకతీయ పథకాన్ని ప్రవేశపెట్టిన కాకతీయులు, నవాబుల కాలం నాటి 46 వేల చెరువుల పునరుద్ధరణ పనులు పూర్తి కావచ్చినట్టు ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ప్రస్తుతం చెరువుల ద్వారా 265 టీఎంసీల నీరు సాధించినట్టు చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో అదే గ్రామానికి చెందిన వర్ధెల్లి వెంకటేశ్వర్లు రచించిన 'పిట్ట వాలిన చెట్టు' పుస్తకాన్ని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, సోలిపేట రామలింగారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'పిట్ట వాలిన చెట్టు' పుస్తకం వర్ధెల్లి వెంకటేశ్వర్లు రచించడం అభినందనీయమన్నారు. గతంలో పాలమూరు నుంచి వలసలు వెళ్లిన ప్రజలు దుర్భరమైన జీవితాలు గడిపారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మిషన్ కాకతీయ పథకంలో చెరువులు నిండటంతో ఆ జిల్లాలో పచ్చని పైర్లు పండుతుండటంతో రైతులు, ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రి కావడంతో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇంజినీర్‌గా పనిచేసి మూడున్నరేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లను పంపిణీ చేశారన్నారు.

**కేసీఆర్ చొరవతోనే కాళేశ్వరం నీళ్లు: జగదీశ్‌రెడ్డి**

సీఎం కేసీఆర్ లేకుంటే వెయ్యేళ్లు అయినా గోదావరి జలాలను చూసేవారం కాదని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. గోదావరి జలాలు సూర్యాపేట జిల్లాలో పారుతుంటే చూసిన సీఎం కేసీఆర్ కండ్లల్లో కనిపించిన ఆనందం వర్ణనాతీతమన్నారు. మిషన్ కాకతీయ రూపంలో 'పిట్ట వాలిన చెట్టు' పుస్తకాన్ని చక్కగా వర్ణించిన వర్ధెల్లి వెంకటేశ్వర్లును ఆయన అభినందించారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. 'పిట్టవాలిన చెట్టు' పుస్తకంలో చెరువుల పునరుజ్జీవం పొందిన విధానాన్ని చాలా చక్కగా వివరించారన్నారు. చెరువులో నీళ్లు లేకపోతే చెట్లు ఎండిపోయి పిట్టలు అంతరిస్తాయని, అదే చెరువులో నీళ్లు ఉంటే చెట్లు పెరిగి పిట్టలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాలమూరు ప్రొఫెసర్ మనోజ్ఞ, తెంజు రాష్ట్ర అధ్యక్షుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## కరీంనగర్‌లో కాంగ్రెస్ ఖాళీ

- ప్రభుత్వ పనితీరుకు ఆకర్షితులై టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్

**టవర్‌సర్కిల్:** కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ ఖాళీ అవుతున్నదని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ శాఖ మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ పెరుమాండ్ల నిర్మల-గోపాల్, వార్డు సభ్యులు ఉమా మహేశ్వరి-విద్యాసాగర్, గౌడ సంఘ నాయకులు శ్రీనివాస్‌తో పాటు 100 మంది కార్యకర్తలు మంత్రి గంగుల సమక్షంలో కరీంనగర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్‌లో చేరేవారికి రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## జనవరి 13 నుంచి ఐనవోలు మల్లన్న జాతర



వరంగల్ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న మంత్రులు అల్లోల, ఎర్రబెల్లి, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, రాజయ్య

- రూ.5.35 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు
- బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్‌ను తీసుకొస్తాం
- మంత్రులు అల్లోల, ఎర్రబెల్లి

**ఐనవోలు:** చారిత్రకంగా ప్రసిద్ధిగాంచిన ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలను వచ్చే నెల 13 నుంచి వైభవంగా నిర్వహిస్తామని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఐనవోలుకు వచ్చిన మంత్రులు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, టీ రాజయ్య, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కుడాచైర్మన్ మర్రి యాదవరెడ్డి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌తో కలిసి సమీక్షించారు. ఆలయ పరిసరాల్లో రూ. 5.35 కోట్లతో నిర్మించే డార్మెటరీ హాల్, ఫంక్షన్‌హాల్, అన్నదానసత్రం, ఈవో కార్యాలయం, దాతల సహకారంతో నిర్మించే 45 గదులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు అల్లోల, ఎర్రబెల్లి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. ఆలయాభివృద్ధికి రూ.50 లక్షల మంజూరు చేస్తానని ఇంద్రకరణ్‌రెడ్డి హామీ ఇచ్చారు.

**వైభవంగా అతిరుద్ర యాగం ప్రారంభం**

**రెడ్డికాలనీ:** వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఆదివారం అతిరుద్రయాగం వైభవంగా ప్రారంభమైంది. యాగ నిర్వాహకులు తాటిపల్లి శ్రీనివాస్-రోజారాణి ఆధ్వర్యంలో చేపట్టిన యాగంలో ముఖ్యఅతిథులుగా మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే సమక్క-సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులకు రూ.75 కోట్లు కేటాయించినట్టు చెప్పారు. జాతరకు జాతీయ హోదా లభించేలా కృషి చేస్తున్నామన్నారు.



జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## ధర్మారాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మారం:** ధర్మారాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఇందుకోసం దశల వారీగా నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఆదివారం ఆయన జగిత్యాల జిల్లా మల్లాపూర్, ధర్మారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మారంలోని 14 వార్డుల్లో రూ.28 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎస్సారెస్పీ డీ 83/బీ కాల్వ సమీపంలో బోడగుట్ట వద్ద వైకుంఠ ధామం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం 30 రోజుల ప్రణాళికలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ధర్మారంలో పలు అభివృద్ధి పనులకు రూ. 10 కోట్ల దాకా నిధులు అవసరమవుతాయనీ, దశలవారీగా కేటాయించి ధర్మారాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం 36 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంత్రి కొప్పుల చెక్కులను పంపిణీ చేశారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

మానవ వికాస వేదిక కేంద్రకమిటీ అధ్యక్షుడు సాంబశివరావు



**హుజూరాబాద్‌టౌన్:** ప్రజలు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ అధ్యక్షుడు బీ సాంబశివరావు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో నిర్వహిస్తున్న మానవ వికాస వేదిక 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా శనివారం జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కుల, మతాల ఆధారంగా రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలు మానవత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

## హైదరాబాద్‌లో స్వల్పంగా పెరిగిన చలి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి చలి కొంచెం పెరిగింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 29 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19 డిగ్రీలు, గాలిలో తేమ 83 శాతంగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**చలికాలం**

| జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం | జిల్లా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|---|---|---|
| | | | సూర్యాపేట | 18.0 | 30.0 |
| | | | మహబూబాబాద్ | 18.0 | 30.0 |
| | | | నాగర్‌కర్నూల్ | 18.0 | 30.0 |
| వికారాబాద్ | 14.3 | 35.0 | జగిత్యాల | 18.0 | 30.0 |
| మెదక్ | 15.2 | 33.2 | రాజన్నసిరిసిల్ల | 18.0 | 31.0 |
| వనపర్తి | 16.7 | 33.1 | పెద్దపల్లి | 18.0 | 31.0 |
| వరంగల్ రూరల్ | 17.0 | 27.0 | సంగారెడ్డి | 18.1 | 29.9 |
| నిర్మల్ | 17.0 | 28.0 | జనగామ | 18.2 | 28.5 |
| యాదాద్రి భువనగిరి | 17.0 | 29.0 | హైదరాబాద్ | 19.0 | 29.0 |
| రంగారెడ్డి | 17.0 | 30.0 | మేడ్చల్ | 19.0 | 29.0 |
| నల్లగొండ | 17.0 | 31.0 | వరంగల్ అర్బన్ | 19.0 | 29.0 |
| మంచిర్యాల | 17.1 | 34.8 | ఆసిఫాబాద్ | 19.0 | 30.0 |
| కరీంనగర్ | 17.2 | 32.9 | ఖమ్మం | 19.0 | 31.0 |
| జోగులాంబ గద్వాల | 17.3 | 30.1 | భద్రాద్రి కొత్తగూడెం | 19.0 | 31.0 |
| సిద్దిపేట | 18.0 | 29.0 | ఆదిలాబాద్ | 19.2 | 31.3 |
| కామారెడ్డి | 18.0 | 29.0 | నిజామాబాద్ | 19.4 | 31.4 |
| ములుగు | 18.0 | 29.0 | మహబూబ్‌నగర్ | 19.6 | 31.1 |
| జయశంకర్ | 18.0 | 30.0 | నారాయణపేట | 19.6 | 31.1 |

## కొడుకును చంపిన తండ్రి

మహబూబాబాద్ జిల్లా లక్ష్మీనర్సింహాపురంలో ఘటన

**బయ్యారం:** మద్యానికి బానిసై నిత్యం కుటుంబసభ్యులను వేధిస్తున్న ఓ యువకుడిని తండ్రి హత్యచేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురంలో శనివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనర్సింహాపురానికి చెందిన వీరయ్య కుమారుడు మధుకర్ (29) ప్లంబింగ్ పనులు, కూలీ పనులకు చేస్తూ జీవనం సాగించేవాడు. కాగా ఇటీవల తాగుడుకు బానిసైన మధుకర్ నిత్యం భార్య, తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం భార్య శ్రావణికి చెందిన బంగారపు గొలుసు తాకట్టు పెట్టి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. ఈ విషయంపై తండ్రి వీరయ్య ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఆవేశానికి లోనైన తండ్రి పక్కనే ఉన్న రోకలిబండతో కుమారుడు తలపై కొట్టడంతో తలకు గాయమైంది. కుటుంబసభ్యులు అతడిని మహబూబాబాద్ జిల్లా దవాఖానకు తరలించి .. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. మహబూబాబాద్ డీఎస్పీ నరేశ్ కుమార్, గార్ల, బయ్యారం సీఐ రమేశ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

## ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లిన కారు

100 డయల్‌తో వెంటనే స్పందించిన పోలీసులు.. త్రుటిలో తప్పిన ప్రమాదం

**మరిపెడ నమస్తేతెలంగాణ:** ప్రమాదవశాత్తు ఓ కారు ఎస్సారెస్పీ కాల్వ అంచుల్లోకి దూసుకెళ్లగా, కారులోనే ఉన్న ప్రయాణికులు అప్రమత్తమై 100కు డయల్ చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిని కాపాడారు. ఈ ఘటన శనివారం రాత్రి మరిపెడ మున్సిపల్ పరిధి నేతవత్‌తండా దగ్గర 563 నేషనల్ హైవేపై చోటు చేసుకున్నది. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండకు చెందిన హన్మనాయక్ భార్య లక్ష్మి నల్లగొండ జిల్లాలోని కోదాడ లో ఏసీటీవోగా విధులు నిర్వహిస్తున్నారు. డ్యూటీ ముగించుకొని తిరిగి హన్మకొండకు కారులో వస్తున్నారు. మరిపెడ మున్సిపల్ పరిధి నేతవత్‌తండా సమీపంలోని హైవేపై ఉన్న పెద్దగుంతలో పడి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాల్వలోకి దూసుకెళ్లింది. వెంటనే దంపతులు 100కు డయల్ చేశారు. మరిపెడ పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్ సాయంతో కారును బయటికి తీయించారు.

## భర్త ఇంటి ఎదుట ధర్నా

- దుబాయ్ వెళ్లే ముందు రహస్య వివాహం
- వచ్చాక మరో యువతితో నిశ్చితార్థం

**మాక్లూర్:** దుబాయ్ వెళ్లేముందు ఓ యువతిని రహస్య వివాహం చేసుకున్న వ్యక్తి తిరిగొచ్చాక మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య అతడి ఇంటి ముందు ఆదివారం బంధువులతో కలిసి ఆందోళన చేపట్టింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మత్యంపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. బాధిత యువతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన ఓ యువతి(20) అదే మండలం ముత్యంపల్లికి చెందిన శెట్టి సాగర్(26) ప్రేమించుకున్నారు. 2018, ఏప్రిల్ 26న ఆర్మూర్‌లోని సిద్దుల గుట్టపైన రహస్యంగా పెండ్లి కూడా చేసుకున్నారు. అనంతరం యువతి గర్భం దాల్చింది. ఇప్పుడే పిల్లలు ఎందుకని నమ్మబలికిన భర్త ఆమెకు అబార్షన్ చేయించాడు. తర్వాతా చెప్పకుండా దుబాయ్ వెళ్లిపోయాడు. తాను రాగానే ఇంటికి తీసుకువెళతానని నమ్మబలికాడు. కాగా ఇటీవల దుబాయ్ నుంచి వచ్చి సాగర్ ఆర్మూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అతడి భార్య ఆదివారం ముత్యంపల్లిలో ప్రియుడు సాగర్ ఇంట్లోకి వెళ్లింది. గమనించిన తల్లిదండ్రులు, సాగర్‌తో మాట్లాడుదామని బయటకు పిలిచి.. తాళం వేసుకొని ఇంటి నుంచి పరారయ్యారు. అనంతరం తనకు న్యాయం చేయాలని ఆమె ఇంటి ఎదుట బంధువులతో కలిసి దీక్ష చేపట్టింది. మాక్లూర్ ఎస్సై సాయినాథ్ ఘటనాస్థలికి వెళ్లి బాధితురాలితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## పుట్టిన రోజున విషాదం

కాల్వలో పడి ఇంటర్ విద్యార్థి గల్లంతు



షేక్ బాబా (ఫైల్)

**నల్లగొండ, నమస్తే తెలంగాణ:** స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేందుకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి కాల్వ లోపడి గల్లంతైన ఘటన నల్లగొండ సమీపంలో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండకు చెందిన షేక్ ఖాజా బాబా (16) ఓ ప్రైవేటుకళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఆదివారం పుట్టినరోజు కావడంతో స్నేహితులు ప్రవీణ్, నవీన్, ధీరజ్, నిరంజన్‌తో కలిసి పట్టణ శివారులో ఆర్జాల బావి పరిధిలోని అద్దంకి- నార్కట్‌పల్లి బైపాస్ సమీపంలో ఉన్న ఏఎంఆర్పీ కాల్వ వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు బాబా కాల్వ లోపలికి వెళ్లాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. స్థానికులు వెతికినా ఆచూకీ లభించలేదు. రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా రాత్రి వరకు జాడ తెలియరాలేదు.

# హిట్టయ్యారు

## హెట్‌మైర్, హోప్ సూపర్ సెంచరీలు

### తొలి వన్డేలో 8 వికెట్ల తేడాతో భారత్‌పై విండీస్ గెలుపు

### అయ్యర్, పంత్ శ్రమ వృథా.. బుధవారం విశాఖలో రెండో వన్డే


హెట్‌మైర్ (139)


హోప్ (102★)

**అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్‌లో సిరీస్ గెలువలేకపోయిన వెస్టిండీస్ తొలి వన్డేలో దమ్ము చూపెట్టింది. టీమ్‌ఇండియా బౌలర్లను ఓ ఆటాడుకుంటూ చెపాక్ స్టేడియంలో చెలరేగిపోయింది. చెన్నైలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తే.. విండీస్ బ్యాట్స్‌మెన్ చెపాక్ స్టేడియంలో పరుగుల వరద పారించారు. పిచ్ నుంచి స్పిన్నర్లకు లబ్ధి చేకూరే అవకాశముండటంతో.. టీమ్‌ఇండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలో దిగినా.. ఫలితం మాత్రం బెడిసికొట్టింది. కొత్త కుర్రాడు దూబేను లక్ష్యంగా చేసుకున్న కరీబియన్లు ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడి మరో 13 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించారు.**

**చెన్నై:** యువ ఆటగాళ్లు షిమ్రాన్ హెట్‌మైర్ (106 బంతుల్లో 139; 11 ఫోర్లు, 7 సిక్సర్లు), షై హోప్ (151 బంతుల్లో 102 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో కదంతొక్కడంతో వన్డే సిరీస్‌లో వెస్టిండీస్ బోణీ కొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం ఇక్కడి చెపాక్ స్టేడియంలో జరిగిన తొలి వన్డేలో విండీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 287 పరుగులు చేసింది. యువ ఆటగాళ్లు రిషబ్ పంత్ (69 బంతుల్లో 71; 7 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయాస్ అయ్యర్ (88 బంతుల్లో 70; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో ఆకట్టుకోగా.. కేదార్ జాదవ్ (35 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (56 బంతుల్లో 36; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. విండీస్ బౌలర్లలో కాట్రెల్, కీమో పాల్, అల్జారీ జోసెఫ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో హెట్‌మైర్, హోప్ అదరగొట్టడంతో వెస్టిండీస్ 47.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 291 పరుగులు చేసింది. స్పిన్‌కు సహకరిస్తుందనుకున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా.. కరీబియన్ హిట్టర్లు పరుగుల పండుగ చేసుకున్నారు. హెట్‌మైర్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే బుధవారం విశాఖపట్నంలో జరుగనుంది.

#### టాప్ విఫలం

కొన్నేండ్లుగా టీమ్‌ఇండియా బ్యాటింగ్ భారం మోస్తున్న టాపార్డర్ విఫలమవడంతో ఈ మ్యాచ్‌లో కోహ్లీసేనకు శుభారంభం దక్కలేదు. గాయపడ్డ శిఖర్ ధవన్ స్థానంలో ఓపెనర్‌గా బరిలో దిగిన లోకేశ్ రాహుల్ (6) ఆకట్టుకోలేకపోగా.. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ (4) ఎదుర్కొన్న నాలుగో బంతికే పెవిలియన్ చేరాడు. తొలి రెండు ఓవర్లను మెయిడెన్‌గా వేసిన కాట్రెల్ తన నాలుగో ఓవర్లో ఈ ఇద్దరిని ఔట్ చేశాడు. ఏడో ఓవర్ రెండో బంతికి రాహుల్‌ను బలిగొన్న కాట్రెల్.. చివరి బంతికి భారత కెప్టెన్‌ను బోల్తా కొట్టించి విండీస్ శిభిరంలో డబుల్ ఆనందం నింపాడు. దీంతో భారత్ 25/2తో కష్టాల్లో పడింది. నాలుగో స్థానంలో వచ్చిన శ్రేయాస్ అయ్యర్‌తో కలిసి రోహిత్ శర్మ ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేయడంతో 18 ఓవర్లు ముగిసేసరికి టీమ్‌ఇండియా 80/2తో కోలుకున్నట్లే కనిపించింది. కానీ మూడో వికెట్‌కు 55 పరుగులు జోడించాక.. రోహిత్ శర్మ చెత్త షాట్‌తో డగౌట్ బాటపట్టాడు. ఇక కోలుకోవడం కష్టమే అనుకుంటున్న దశలో రిషబ్ పంత్ చక్కటి ఇన్నింగ్స్‌తో అలరించాడు.

#### ఆ ఒక్కటి మినహా..

విండీస్ ఇన్నింగ్స్ ఐదో ఓవర్ తొలి బంతికి సునీల్ ఆంబ్రీస్ (9) వికెట్ల ముందు దొరికిపోవడంతో భారత్‌కు మంచి ఆరంభమే లభించినట్లైంది. కాకపోతే అక్కడి నుంచే అసలు ఆట మొదలైంది. టీమ్‌ఇండియా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిన హెట్‌మైర్, హోప్ నింపాదిగా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. హోప్ ఆచితూచి ఆడుతుంటే.. హెట్‌మైర్ మాత్రం భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హోప్ ఇచ్చిన క్లిష్టమైన క్యాచ్‌ను స్లిప్స్‌లో రోహిత్ వదిలేయడం కూడా విండీస్‌కు కలిసొచ్చింది. ఈ క్రమంలో హెట్‌మైర్ 50 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. హోప్ 92 బంతుల్లో ల్యాండ్ మార్క్ దాటాడు. ఫిఫ్టీ తర్వాత హెట్‌మైర్ మరింతగా రెచ్చిపోయాడు. జడేజా ఓవర్‌లో 6,6 అరుసుకున్న హెట్‌మైర్.. షమీ, దూబే బౌలింగ్‌లో ఒక్కో సిక్స్ కొట్టి చూస్తుండగానే సెంచరీకి చేరువయ్యాడు. భారత కెప్టెన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ఈ జోడీని విడదీయలేకపోయాడు. కుల్దీప్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 85 బంతుల్లో వన్డేల్లో ఐదో శతకం పూర్తి చేసుకున్న హెట్‌మైర్.. జడేజా ఓవర్‌లో మరోసారి 6,6 అందుకున్నాడు. దూబే ఓవర్‌లోనూ 6,4 బాదిన అతడిని ఎట్టకేలకు షమీ ఔట్ చేశాడు. ఆ తర్వాత పరుగుల వేగం తగ్గినా.. లక్ష్యం ఎక్కువగా లేకపోవడంతో పూరన్ (29 నాటౌట్)తో కలిసి హోప్ మిగిలిన పని పూర్తి చేశాడు. చాహర్ ఓవర్‌లో 6,4 కొట్టి 149 బంతుల్లో హోప్ సెంచరీ మార్క్ దాటాడు. దూబే ఓవర్‌లో 4,4,4 కొట్టిన పూరన్ మరో 13 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

### ఆదుకున్న యువతరం

తీవ్ర ఒత్తిడిలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. ఆరంభంలో ఆచితూచి ఆడాడు. మరో ఎండ్‌లో ఐపీఎల్ ఢిల్లీ సహచరుడు శ్రేయాస్ అయ్యర్ సమయోచితంగా ఆడుతుండటం పంత్ గాడినపడ్డాడు. ఒక్కసారి కుదురుకున్నాక ఈ జోడీ ధాటిగా ఆడటం మొదలెట్టింది. ఒక దశలో 12 ఓవర్ల పాటు ఈ జంట 8 రన్‌రేట్‌ను కొనసాగించడం విశేషం. ఈ క్రమంలో మొదట అయ్యర్, ఆ తర్వాత పంత్ అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. వన్డేల్లో రిషబ్‌కు ఇదే తొలి హాఫ్ సెంచరీ కాగా.. అయ్యర్‌కు వరుసగా మూడోది. అయితే నాలుగో వికెట్‌కు 114 పరుగులు జోడించాక అయ్యర్ మిడ్‌వికెట్‌లో పొలార్డ్‌కు చిక్కాడు. మరో రెండు ఓవర్లకే పంత్ కూడా అతడిని అనుసరించాడు. చాన్నాళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన కేదార్ జాదవ్ కొన్ని చక్కటి షాట్లు కొట్టినా.. అవసరమైనంత వేగంగా ఆడలేకపోయాడు. అరంగేట్రం ఆటగాడు శివం దూబే (9) కంటే ముందే క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా (21) కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు.


శ్రేయాస్ (70) పంత్ (71)

### కోహ్లీకి కోపమొచ్చింది



రవీంద్ర జడేజా రనౌట్ విషయంలో టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆన్‌ఫీల్డ్ అంపైర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. 48వ ఓవర్లో జడేజా సింగిల్ కోసం వేగంగా పరుగెత్తగా ఫీల్డర్ వేసిన త్రో వికెట్లను గిరాటేసింది. వెస్టిండీస్ ఆటగాళ్లు అప్పీల్ చేసినా ఫీల్డ్ అంపైర్ షాన్ జార్జ్ తొలుత ఔటివ్వలేదు. అయితే, విండీస్ కెప్టెన్ పొలార్డ్ అంపైర్ వద్దకు వెళ్లి మాట్లాడాడు. ఆ తర్వాత జార్జ్.. థర్డ్ అంపైర్‌ను సమీక్ష కోరాడు. జడేజా క్రీజులోకి రాకముందే బంతి వికెట్లను తాకినట్టు రిప్లైలో తేలడంతో థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. ఈ ఫలితాన్ని స్క్రీన్‌పైన చూసిన విరాట్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. కుర్చీలో నుంచి లేచి ఫోర్త్ అంపైర్ అనిల్ చౌదరీ వద్దకు వెళ్లి ఈ అంశంపై చర్చించాడు. పొలార్డ్ అడిగిన తర్వాత ఫీల్డ్ అంపైర్ సమీక్షకు వెళ్లడంపై విరాట్ చాలాసేపు డ్రెసింగ్ రూమ్‌లోనూ చిరాకుగా కనిపించాడు.

### స్కోరు బోర్డు

**భారత్:** రోహిత్ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 36, రాహుల్ (సి) హెట్‌మైర్ (బి) కాట్రెల్ 6, కోహ్లీ (బి) కాట్రెల్ 4, అయ్యర్ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 70, పంత్ (సి) హెట్‌మైర్ (బి) పొలార్డ్ 71, జాదవ్ (సి) పొలార్డ్ (బి) పాల్ 40, జడేజా (రనౌట్/ చేజ్) 21, దూబే (సి) హోల్డర్ (బి) పాల్ 9, దీపక్ (నాటౌట్) 6, షమీ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 24, **మొత్తం:** 50 ఓవర్లలో 287/8. **వికెట్ల పతనం:** 1–21, 2–25, 3–80, 4–194, 5–210, 6–269, 7–269, 8–282, **బౌలింగ్:** కాట్రెల్ 10–3–46–2, హోల్డర్ 8–0–45–0, వాల్ష్ 5–0–31–0, పాల్ 7–0–40–2, జోసెఫ్ 9–1–45–2, చేజ్ 7–0–42–0, పొలార్డ్ 4–0–28–1.

**వెస్టిండీస్:** హోప్ (నాటౌట్) 102, ఆంబ్రీస్ (ఎల్బీ) చాహర్ 9, హెట్‌మైర్ (సి) అయ్యర్ (బి) షమీ 139, పూరన్ (నాటౌట్) 29, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 47.5 ఓవర్లలో 291/2. **వికెట్ల పతనం:** 1–11, 2–2–229, **బౌలింగ్:** చాహర్ 10–1–48–1, షమీ 9–1–57–1, కుల్దీప్ 10–0–45–0, దూబే 7.5–0–68–0, జాదవ్ 1–0–11–0, జడేజా 10–0–58–0.

## సెమీస్‌లో హైదరాబాద్, రంగారెడ్డి

### రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ



**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ టోర్నీలో హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నరగ్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో జరుగుతున్న ఈ టోర్నీ లీగ్ దశలో హైదరాబాద్ 15–3తో మెదక్‌పై, రంగారెడ్డి 27–17తో ఆదిలాబాద్‌పై, వరంగల్ 23–15తో రంగారెడ్డిపై, మహబూబ్‌నగర్ 31–18తో మెదక్‌పై గెలిచి సెమీస్‌కు చేరాయి. మహిళల విభాగంలోనూ హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. సోమవారం సెమీస్‌తో పాటు, ఫైనల్స్ జరుగనున్నాయి. అంతకుముందు టోర్నీ రెండో రోజు పోటీలను శ్రీరామ, జయరామ గ్రూప్స్ అధినేత బెక్కరి రాంరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, అహ్మద్ హుస్సేన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



**టోక్యో ఒలింపిక్స్ (2020) కోసం ప్రత్యేకంగా నిర్మించిన నూతన జాతీయ స్టేడియంను జపాన్ ప్రధాని షింజో అబే ఆదివారం ప్రారంభించారు.**

## ఆసీస్ జయభేరి

### డే అండ్ నైట్ టెస్టుల్లో వరుసగా ఏడో గెలుపు



**పెర్త్:** డే అండ్ నైట్ టెస్టుల్లో ఆస్ట్రేలియా జైత్రయాత్ర కొనసాగుతున్నది. ఇప్పటి వరకు ఆడిన ఆరు గులాబీ టెస్టుల్లో నెగ్గిన ఆసీస్.. సొంతగడ్డపై న్యూజిలాండ్‌ను చిత్తుచేసి ఆ సంఖ్య ఏడుకు పెంచుకుంది. ఏస్ పేసర్ మిషెల్ స్టార్క్ (4/45) విజృంభించడంతో కివీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 296 పరుగుల తేడాతో గెలుపొందింది. 468 పరుగుల లక్ష్యంతో ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ ఏ దశలోనూ ఆకట్టుకోలేకపోయింది. స్టార్క్, లియాన్ (4/63) ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి 171 పరుగులకు ఆలౌటైంది. వాట్లింగ్ (40), గ్రాండ్‌హోమ్ (33) కాస్త పోరాడారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 167/6తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆసీస్ చివరకు 217/9 వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. కివీస్ బౌలర్లలో సౌథీ 5, వాగ్నర్ 3 వికెట్లు పడగొట్టారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 9 వికెట్లు పడగొట్టిన స్టార్క్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

## పాంచ్ పటాకా

### ఈ ఏడాది ఐదో టైటిల్ నెగ్గిన యువ షట్లర్ లక్ష్యసేన్



**ఢాకా:** భారత యువ షట్లర్ లక్ష్యసేన్ జోరు కొనసాగుతున్నది. ఈ ఏడాది నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచిన లక్ష్యసేన్.. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ చాలెంజర్ నెగ్గి ఐదో టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 22–20, 21–18తో లియాంగ్ జున్ హోవ్ (మలేషియా)పై విజయం సాధించాడు. 'విజయంతో ఏడాదిని ముగించడం సంతోషంగా ఉంది. ఈ యేడు నాకు ఇది ఐదో అంతర్జాతీయ టైటిల్. వచ్చే ఏడాది కూడా ఇదే ఫామ్ కొనసాగించాలని అనుకుంటున్నా' అని లక్ష్య ట్వీట్ చేశాడు. ఫైనల్ చేరే క్రమంలో లక్ష్యసేన్ అన్ని మ్యాచ్‌ల్లోనూ వరుస గేమ్‌ల్లో విజయం సాధించడం విశేషం.

## ఢిల్లీ, మణిపూర్‌కు టైటిళ్లు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** భాగ్యనగరం వేదికగా జరిగిన సెపక్‌తక్రా జూనియర్ చాంపియన్‌షిప్‌లో ఢిల్లీ బాలుర జట్టు, మణిపూర్ బాలిక జట్టు విజేతలుగా నిలిచాయి. ఆదివారం ఇక్కడి విక్టరీ ప్లే గ్రౌండ్‌లో జరిగిన రెగూ విభాగం ఫైనల్స్‌లో ఢిల్లీ బాలుర టీమ్ 18–21, 21–18, 21–16తేడాతో మణిపూర్‌పై విజయం సాధించింది. బాలికల రెగూ విభాగంలో మణిపూర్ 21–19, 21–16తేడాతో వరుస సెట్లలో నాగాలాండ్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకుంది. బాలుర, బాలికల డబుల్స్ తుదిపోరులోనూ మణిపూర్ విజేతగా నిలిచింది. ముగింపు పోటీలకు ముఖ్యఅతిథిగా జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ యాదగిరి రావు హాజరు కాగా.. సెపక్‌తక్రా సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌ఆర్ ప్రేమ్‌రాజ్, సెక్రటరీ జనరల్ యోగిందర్ సింగ్ దహియా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తస్నీమ్‌కు స్వర్ణం



**సురబయ (ఇండోనేషియా):** ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ తస్నీమ్ మీర్ స్వర్ణం పతకం కైవసం చేసుకోగా.. తారా షా రజతం దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన అండర్–15 బాలికల సింగిల్స్ ఫైనల్లో తస్నీమ్ 17–21, 21–11, 21–19తో మన దేశానికే చెందిన తారా షాపై గెలిచి, ఈ విభాగంలో తొలి టైటిల్ చేజిక్కించుకుంది. 55 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌లో ఓటమి పాలైన తస్నీమ్.. చివరి రెండు గేమ్‌ల్లో సత్తాచాటింది. అంతకుముందు జరిగిన పోటీల్లో సునాయాస విజయాల ద్వారా ఇద్దరు ప్లేయర్లు ఫైనల్‌కు చేరుకున్నారు.



## అతడు దొరికేశాడు

**న్యూఢిల్లీ:** తనకు సలహా ఇచ్చిన హోటల్ ఉద్యోగి కోసం అన్వేషించిన క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కృషి ఫలించింది. తమ ఉద్యోగితో ఉన్న అనుభవాన్ని పంచుకున్నందుకు కృతజ్ఞతలు చెబుతూ.. అతడు ఎక్కడున్నాడో తెలిసిందని తాజ్ హోటల్ యాజమాన్యం మాస్టర్ బ్లాస్టర్‌కు ఆదివారం రిప్లై ఇచ్చింది. ఇద్దరి మధ్య సమావేశం జరిగితే ఎంతో సంతోషిస్తామని ట్వీట్ చేసింది. అప్పట్లో ఓ టెస్టు కోసం చెన్నైలోని తాజ్ హోటల్‌లో బస చేసినప్పుడు అక్కడ ఓ ఉద్యోగితో తన బ్యాటింగ్‌పై సంభాషణ జరిగిందని, అతడి సూచనల మేరకు ఎల్బోగార్డ్‌ను మార్చుకొని సత్ఫలితాలు పొందానని సచిన్ శనివారం ట్వీట్ చేశాడు. ఆ ఉద్యోగి ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసుకోవాలని ఉందని, అతడిని కనిపెట్టేందుకు సహకరించాలని నెటిజన్లను సైతం కోరిన సంగతి తెలిసిందే. దీంతో తాజ్ హోటల్ యాజమాన్యమే ఆ ఉద్యోగి ఎక్కుడున్నాడో గుర్తించడంతో పాటు.. అప్పటి ఫొటోను కూడా ట్వీట్ చేసింది.

## ఆబిద్, బాబర్ అజేయ శతకాలు

### పాకిస్థాన్, శ్రీలంక టెస్టు 'డ్రా'


ఆబిద్ (109★)


బాబర్ (102★)

**రావల్పిండి:** పదేండ్ల తర్వాత పాకిస్థాన్‌లో జరిగిన తొలి టెస్టులో అరంగేట్రం ఆటగాడు ఆబిద్ అలీ (109 నాటౌట్; 11 ఫోర్లు), మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ (102 నాటౌట్; 14 ఫోర్లు) అజేయ శతకాలతో అలరించారు. ఫలితంగా శ్రీలంక, పాకిస్థాన్ మధ్య వర్షప్రభావిత మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. వరుణుడి వల్ల మూడు రోజుల ఆట తుడిచిపెట్టుకుపోయిన ఈ మ్యాచ్‌లో ఆబిద్, బాబర్ పరుగుల వరద పారించడంతో పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 252 పరుగులు చేసింది. తొలి వన్డేలోనూ సెంచరీతో కదంతొక్కిన ఆబిద్ అలీ.. టెస్టుల్లోనూ ఆ ఫీట్ రిపీట్ చేశాడు. అరంగేట్రం చేసిన మొదటి వన్డే, టెస్టులో శతకాలు బాదిన తొలి బ్యాట్స్‌మన్‌గా ఆబిద్ రికార్డుల్లోకెక్కాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 282/6తో ఆదివారం ఆట కొనసాగించిన లంక 308/6 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ధనంజయ డిసిల్వా (102 నాటౌట్; 15 ఫోర్లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి మూడు రోజుల్లో కేవలం 91.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. నాలుగో రోజు భారీ వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడలేదు. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు గురువారం నుంచి కరాచీలో జరుగనుంది.

## కెంటో మొమోటాదే టైటిల్



**గ్వాంగ్ జౌ (చైనా):** పురుషుల సింగిల్స్ ప్రపంచ టాప్ ర్యాంకర్ కెంటో మొమోటా (జపాన్) బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టైటిల్ చేజిక్కించుకున్నాడు. కెంటోకు ఈ ఏడాది ఇది పదకొండో టైటిల్ కావడం విశేసం. ఆదివారం ఇక్కడ జరిగిన వరల్డ్ టూర్ ఫైనల్స్ తుదిపోరులో మొమోటా 17–21, 21–17, 21–14తో ఎనిమిదో ర్యాంకర్ సునిసుక గింటింగ్ (ఇండోనేషియా)పై విజయం సాధించాడు. ఈ ఏడాది ఐదు టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరిన గింటింగ్ అన్నింట్లోనే పరాజయం పాలవడం గమనార్హం. మహిళల సింగిల్స్‌లో టాప్ ర్యాంకర్ తై జూ యింగ్ (చైనీస్ తైపీ)కు చెన్ యూఫీ (చైనా) షాకిచ్చింది. తుదిపోరులో రెండో ర్యాంకర్ చెన్ 12–21, 21–12, 21–17తో తై జూపై గెలిచింది. పురుషుల డబుల్స్‌లో ఎహెసాన్–సెటియావాన్ (ఇండోనేషియా) జోడీ విజేతగా నిలిచింది.

### బెంగళూరుకు తొలి ఓటమి

**బెంగళూరు:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఆరో సీజన్‌లో బెంగళూరు ఎఫ్‌సీకి తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ముంబై సిటీ ఎఫ్‌సీ 3–2తేడాతో బెంగళూరుపై గెలిచింది. మ్యాచ్ 12వ నిమిషంలో శుభాసిశ్ బోస్ గోల్ చేసి ముంబై ఖాతా తెరువగా.. మ్యాటిక్ రిక్ (58వ ని.లో) సెల్ఫ్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత డీగో కార్లోస్ గోల్ కొట్టి ముంబైని ఆధిక్యంలోకి తేగా.. బెంగళూరు కెప్టెన్ ఛెత్రి (89వ ని.లో) అద్భుత షాట్‌తో మరోసారి స్కోరు సమం చేశాడు. అయితే ఇంజ్యూరీ టైమ్‌లో రోలిన్ బోర్గ్స్ (90+4వ ని.లో) గోల్ బాది ముంబైని గెలిపించాడు.

### మేరీ కోమ్ X నిఖత్

**న్యూఢిల్లీ:** బిగ్ బౌట్ ఇండియన్ బాక్సింగ్ లీగ్‌లో భాగంగా ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్‌తో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ తలపడనుంది. సెమీస్ బెర్తుల కోసం కీలక మ్యాచ్‌లు జరుగుతున్న తరుణంలో 51 కేజీల విభాగంలో నార్త్‌ఈస్ట్ రైనోస్ తరపున మేరీ, పంజాబ్ పాంథర్స్ తరపున నిఖత్ మంగళవారం పరస్పరం పోటీ పడనున్నారు. ఎంపిక పోటీల ద్వారానే ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు బాక్సర్లను పంపాలని, 51 కేజీల విభాగంలో తనకు మేరీకోమ్‌తో పోటీ పెట్టాలని నిఖత్ గతంలో డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఓ దశలో నిఖత్‌పై మేరీ కోమ్ అసహనం కూడా వ్యక్తం చేసింది.

## ఐబీసీ ప్రీ-అడ్మిషన్ దశలో 9,650 కేసులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** దివాలా చట్టం (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ లేదా ఐబీసీ) ప్రీ-అడ్మిషన్ దశలో దాదాపు రూ.3.75 లక్షల కోట్ల విలువైన 9,650కి పైగా కేసులున్నాయని కేంద్రం తెలిపింది. ఐబీసీలో 21,136 దరఖాస్తులు నమోదైనట్లు ఆదివారం ఓ ప్రకటనలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో 9,653 కేసులు ప్రీ-అడ్మిషన్ దశలో ఉన్నాయని వెల్లడించింది. వీటి విలువ రూ.3,74,931.30 కోట్లుగా ఉందని స్పష్టం చేసింది. కాగా, కార్పొరేట్ దివాలా తీర్మాన ప్రక్రియ (సీఐఆర్పీ)లో సుమారు 2,838 కేసులున్నాయని, 306 కేసులు విజ్ఞప్తి/సమీక్ష/ఉపసంహరణల ద్వారా మూతబడ్డాయని కార్పొరేట్ మంత్రిత్వ శాఖ తెలిపింది. 161 పరిష్కరించబడిన కేసుల విలువ రూ.1,56,814 కోట్లుగా ఉన్నట్లు చెప్పింది.

## కసరత్తు షురూ..



### బడ్జెట్‌పై నేటి నుంచి వ్యాపార వర్గాలతో భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌పై కేంద్రం కసరత్తును ప్రారంభించబోతున్నది. ఈ సోమవారం పలు ఇండస్ట్రీ వర్గాలు, రైతుల ఆర్గనైజేషన్లు, ఆర్థికవేత్తలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంప్రదింపులు జరుపనున్నారు. దేశ వినిమయం పెంచడానికి, ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన వృద్ధికి మళ్లీ ఊతమివ్వడానికి తీసుకునే చర్యలపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తున్నది. రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ సర్కార్ ఫిబ్రవరి 1న నిర్మలా సీతారామన్ తన రెండో బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. బడ్జెట్‌పై విశ్లేషకులు, ఆర్థికవేత్తలు, ఇండస్ట్రీ వర్గాలతో భేటీ కావడం పరిపాటిగా వస్తున్నది. ఇదే క్రమంలో సోమవారం ప్రారంభంకానున్న సమావేశాలు ఈ నెల 23 వరకు కొనసాగనున్నాయి. దీంట్లోభాగంగా స్టార్టప్, ఫిన్‌టెక్, డిజిటల్ రంగాలకు చెందిన నిపుణులతో ఈ నెల 16న ఉదయం భేటీకానున్న మంత్రి.. సాయంత్రం ఆర్థిక సేవలు, క్యాపిటల్ మార్కెట్‌కు సంబంధించిన నిపుణులతో చర్చించనున్నారు. సులభతర వాణిజ్యం, రెగ్యులేటరీ నిబంధనలతో ప్రైవేట్ పెట్టుబడులపై పడుతున్న ప్రభావం, ఎగుమతుల్లో పోటీతత్వం, రాష్ర్టాల పాత్ర(చెల్లింపుల్లో ఆలస్యం, కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రైవేట్ పెట్టుబడులు, వృద్ధితోపాటు ఇతర విషయాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 19న పారిశ్రామిక చాంబర్లతో మంత్రి భేటీ అయ్యే అవకాశం ఉన్నది. వృద్ధికి ఊతమివ్వడానికి కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గించిన కేంద్రం.. ఈసారి బడ్జెట్‌లో వేతన జీవులకు ఊరట కల్పించేలా ఆదాయం పన్ను పరిమితిని పెంచే అవకాశాలు మెండుగావున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సార్వత్రిక బడ్జెట్‌పై ఇప్పటికే పలు మంత్రిత్వ శాఖలతో ఆర్థిక మంత్రిత్వ శాఖ సంప్రదింపులూ ఆరంభించింది.

**ఫిబ్రవరి 1న బడ్జెట్!**

2020-21 ఆర్థిక సంవత్సరానికిగాను సార్వత్రిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. జనవరి 31న ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించనున్న కేంద్ర ప్రభుత్వం..ఆ మరుసటి రోజే బడ్జెట్‌ను విడుదల చేయనున్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ఫిబ్రవరి 1 శనివారం కావడం విశేషం. 2015-16 ఆర్థిక సంవత్సరంలో నరేంద్ర మోదీ సర్కార్ శనివారమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా..మళ్లీ ఈసారి కూడా శనివారం ప్రవేశపెట్టబోతున్నట్లు తెలుస్తున్నది. సంప్రదాయాలు కొనసాగుతాయని పార్లమెంట్ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల వ్యాఖ్యలు దీనికి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# రాజుకున్న జీఎస్టీ చిచ్చు

### నష్టపరిహారం అందక అల్లాడిపోతున్న రాష్ర్టాలు

### కేంద్ర ప్రభుత్వంతో పెరుగుతున్న అంతరాలు

ఆర్థిక మందగమనం వేళ పన్ను గొడవలు • మాట తప్పుతున్న మోదీ సర్కారు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:**

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ).. కేంద్ర, రాష్ర్టాల మధ్య చిచ్చు పెడుతున్నది. దాదాపు రెండున్నరేండ్ల క్రితం ఇచ్చిన మాటను మోదీ సర్కారు తప్పుతుండటమే ఇందుకు కారణం. నష్టపరిహారం చెల్లిస్తామంటూ జీఎస్టీని అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం.. వసూళ్లు క్షీణించాయంటూ ఇప్పుడు చేతులెత్తేస్తున్నది. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ నినాదంతో జూలై 1, 2017న కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా తెచ్చినదే ఈ జీఎస్టీ. అటు కేంద్రంలో, ఇటు రాష్ర్టాల్లో ఉన్న డజనుకుపైగా పన్నులను ఏకం చేసి పరిచయం చేసిన జీఎస్టీ పరిధిలో 500లకుపైగా సేవలు, 1,300లకు పైగా వస్తువులున్నాయి. 0, 5, 12, 18, 28 శాతాల్లో ఆయా వస్తు, సేవలపై పన్నులను విధించారు. బంగారంపై ప్రత్యేకంగా 3 శాతం పన్ను వేయగా, విలువైన ముడి రత్నాలు, రాళ్లపై కనిష్ఠంగా 0.25 శాతం పన్ను నిర్ణయించారు. ఇక పెట్రో ఉత్పత్తులను జీఎస్టీలో చేర్చని కేంద్రం.. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితరాలకు ఈ పన్ను నుంచి మినహాయింపునిచ్చింది.

**ఆగస్టు నుంచి అందని పరిహారం**

ఈ ఏడాది ఆగస్టు నుంచి రాష్ర్టాలకు జీఎస్టీ నష్టపరిహారం అందలేదు. జీఎస్టీ అమల్లోకి తెస్తున్నప్పుడు రాష్ర్టాలకు ఎలాంటి నష్టం వాటిల్లినా పరిహారం ఇస్తామన్న కేంద్రం.. తొలి ఐదేండ్లు ఈ సాయం చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ర్టాల్లోని వివిధ పన్నులను జీఎస్టీలో కలిపేయడమే ఇందుకు కారణం. రెండు నెలలకోసారి ఈ నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. ఈ క్రమంలో రెండున్నరేండ్లకే మొండి చెయ్యి చూపిస్తున్నది. ఆగస్టు-సెప్టెంబర్ బకాయిలకుతోడు అక్టోబర్-నవంబర్ బకాయిలు పేరుకుపోయాయి. నిజానికి ఆగస్టు-సెప్టెంబర్ బకాయిలు అక్టోబర్‌లో, అక్టోబర్-నవంబర్ బకాయిలు డిసెంబర్‌లో చెల్లించాల్సి ఉన్నది. కానీ ఇంతవరకు ఆగస్టు-సెప్టెంబర్ బకాయిలే వసూలు కాలేదు. రాష్ర్టాలు తమ ఆదాయంలో దాదాపు సగభాగం కేంద్రం నుంచే అందుకుంటున్నాయి. 47.5 శాతం ఆదాయం కేంద్రం ద్వారానే వస్తున్నది. ఇందులో జీఎస్టీ నష్టపరిహారం కూడా ఉండగా, అది పెద్ద మొత్తంలో ఉండటంతో ఆయా రాష్ర్టాలు ఇప్పుడు ఇబ్బందులకు గురవుతున్నాయి. వీటిలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ర్టాలే ఉండటం గమనార్హం. ఇప్పటికే తమ బకాయిలు త్వరగా చెల్లించాలంటూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వివిధ రాష్ర్టాల ఆర్థిక మంత్రులు, ఉన్నతాధికారులు కోరారు.

**న్యాయ పోరాటం**

జీఎస్టీ బకాయిల కోసం కేంద్రంపై రాష్ర్టాలు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాయి. నష్టపరిహారం ఆలస్యం కావడంతో వెంటనే చెల్లించకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టుకు లాగుతామని కేరళ హెచ్చరించింది. పరిహారం అందక రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి జారుకుంటున్నదని కేరళ ఆర్థిక మంత్రి థామస్ ఇజాక్ తెలిపారు. కాంట్రాక్టర్ల బిల్లులు, వ్యవసాయ, సంక్షేమ పథకాల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ ఆదాయంలో దాదాపు 60 శాతం రాష్ర్టాలదేనని గుర్తుచేశారు. కేంద్రం నుంచి కేరళకు ఆగస్టు-సెప్టెంబర్‌కుగాను రూ.1,600 కోట్లు రావాల్సి ఉన్నది. కేరళతోపాటు పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ తమ బకాయిల కోసం కేంద్రంతో పోరాడుతున్నాయి. అయితే జీఎస్టీ వసూళ్లు పడిపోవడం వల్లే పరిహారం చెల్లించలేకపోతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చెబుతున్నది. ఈ ఏప్రిల్-జూలైలో రూ.45,750 కోట్ల నష్టపరిహారం ఇచ్చామని గుర్తుచేసింది. ఇదిలావుంటే 15వ ఆర్థిక సంఘం.. కేంద్రం-రాష్ర్టాల మధ్య ఆర్థిక సంబంధాలను నిర్వచిస్తూ కేంద్ర పన్నుల్లో రాష్ర్టాలకు అందేది తక్కువేనని వ్యాఖ్యానించింది. ఇదిప్పుడు రాష్ర్టాల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. అయితే 2025 వరకు జీఎస్టీ నష్టపరిహారాన్ని రాష్ర్టాలకు కేంద్రం చెల్లించాల్సిందేనని రాష్ర్టాలు డిమాండ్ చేస్తున్నాయి.

**18న జీఎస్టీ మండలి భేటీ**

**బుధవారం** జీఎస్టీ మండలి సమావేశం జరుగనున్నది. జీఎస్టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈసారి ఆయా వస్తు, సేవలపై పన్నులను పెంచే అవకాశాలున్నాయన్న అంచనాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ర్టాల నుంచి జీఎస్టీ నష్టపరిహారం బకాయిలు చెల్లించాలన్న ఒత్తిడి పెరుగుతుండటం కూడా పన్ను రేట్ల పెంపుపై మోదీ సర్కారు దృష్టిని నిలుపుతున్నది. జీడీపీ క్రమేణా పతనమవుతుండటంతో తగ్గిన ప్రభుత్వ ఆదాయాన్ని జీఎస్టీ రేట్ల పెంపుతో పెంచుకోవాలని కేంద్రం చూస్తున్నది. దీంతో గతంలో జీఎస్టీ నుంచి పన్ను మినహాయింపును పొందిన వాటిపై, ఇప్పటివరకు జీఎస్టీ పరిధిలోకి రాని ఉత్పత్తులపై పన్ను భారాన్ని వేయాలని జీఎస్టీ మండలి యోచిస్తున్నట్లు సమాచారం.

## దిగొస్తున్న పెట్రోల్

- నాలుగు రోజుల్లో 28 పైసలు తగ్గిన లీటర్ ధర
- హైదరాబాద్‌లో రూ.79.53కి దిగొచ్చిన ధర



**న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబర్ 15:** రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఇంధన ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు శాంతించడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ క్రమంగా బలపడుతుండటంతో ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు ధరలను తగ్గిస్తున్నాయి. వరుసగా నాలుగు రోజుల్లో లీటర్ పెట్రోల్ ధర 30 పైసల వరకు తగ్గించాయి. ఆదివారం ఢిల్లీలో లీటర్ పెట్రోల్‌పై 10 పైసలు తగ్గించడంతో ధర రూ.74.74కి దిగొచ్చింది. దీంతో వరుసగా నాలుగు రోజుల్లో ధర 26 పైసలు తగ్గించినట్లు అయింది. కానీ, పెట్రోల్ ధరల్లో కోత విధించిన ఇంధన విక్రయ సంస్థలు డీజిల్‌ను మాత్రం యథాతథంగా ఉంచాయి. డీజిల్ ధర వరుసగా ఐదు రోజులుగా రూ.66.04 వద్ద కొనసాగుతున్నది. మిగతా నగరాల విషయానికి వస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నుల ఆధారంగా ధరల తగ్గింపులో తేడాలు ఉంటాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర సోమవారం 11 పైసలు తగ్గడంతో రూ.79.53కి పరిమితమైంది. గురువారం నుంచి ఇప్పటి వరకు లీటర్ ధరను 28 పైసలు కోత విధించాయి. అలాగే డీజిల్ రూ.72.07 వద్ద కొనసాగుతున్నది. పెట్రోల్ ధరలు గరిష్ఠ స్థాయిలో పెరిగినప్పటికీ వీటిపై విధిస్తున్న ఎక్సైజ్, ఇతర సుంకాలను తగ్గించేది లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల స్పష్టంచేసిన విషయం తెలిసిందే.

## ఎన్‌ఎల్‌సీ @17 వేల కోట్లు

**భువనేశ్వర్, డిసెంబర్ 15:** ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. రూ.17 వేల కోట్ల పెట్టుబడితో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడంతోపాటు ఒడిశాలో మరో బొగ్గు గని కోసం ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. నవరత్న హోదా కలిగిన ఈ సంస్థ ప్రస్తుతం తలబిరా 2-3 బొగ్గు గనుల నుంచి ప్రతియేటా ఉత్పత్తి చేస్తున్న 2 కోట్ల టన్నుల విలువైన బొగ్గును 4,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు సరఫరా చేస్తున్నది. ఈ నూతన బొగ్గు గనిని ఏర్పాటు చేయడానికి ఒడిశా కంపెన్సేటరీ అఫోరెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథార్టీ(కంపా) అకౌంట్ కింద రూ.134.36 కోట్లు డిపాజిట్ చేసింది. ప్రస్తుతం భారత్‌లో సగటు ఒక్కరు తలసరి విద్యుత్ వినిమయం 1,110 యూనిట్లుగా ఉన్నదని, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే ఇది చాలా స్వల్పమని కంపెనీ వ్యాఖ్యానించింది.

## స్మార్ట్ టీవీలపై నజర్



### టెలివిజన్ తయారీలోకి అడుగుపెడుతున్న స్మార్ట్‌ఫోన్ కంపెనీలు

### షియామీ, వన్‌ప్లస్ బాటలో ఇన్ఫినిక్స్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ.. మానవ జీవితం మరింత సౌకర్యవంతంగా మారుతున్నది. ఫలితంగా మార్కెట్ యావత్తూ స్మార్ట్‌గా రూపాంతరం చెందుతున్నది. నేడు అంతటా స్మార్ట్ ఉత్పత్తులే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా టెలివిజన్ రంగం స్మార్ట్ పుంతలు తొక్కుతున్నది. అందుకే స్మార్ట్‌ఫోన్ తయారీదారులు.. ఇప్పుడు స్మార్ట్ టీవీలపైనా దృష్టి పెడుతున్నారు. ఇప్పటికే షియామీ, వన్‌ప్లస్, మోటోరోలా వంటి స్మార్ట్‌ఫోన్ కంపెనీలు.. స్మార్ట్ టీవీల ఉత్పత్తిలోకి రాగా, ఈ జాబితాలో తాజాగా హాంకాంగ్ ఆధారిత సంస్థ ఇన్ఫినిక్స్ చేరింది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో భారతీయ మార్కెట్‌లోకి స్మార్ట్ టెలివిజన్లను తీసుకురావాలన్న లక్ష్యంతో ఇన్ఫినిక్స్ ముందుకెళ్తున్నది. 'స్మార్ట్ టీవీలు, స్మార్ట్ యాక్సెసరీస్ వంటి కొత్త వ్యాపారాల్లోకి ప్రవేశించాలని చూస్తున్నాం. ఇప్పుడే వీటి గురించి మాట్లాడలేము. అయితే 2020 ప్రథమార్ధంలో స్మార్ట్ టీవీలను మార్కెట్‌కు పరిచయం చేసే వీలున్నది' అని ఇన్ఫినిక్స్ ఇండియా సీఈవో అనీశ్ కపూర్ పీటీఐకి తెలిపారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ హక్కులను పొందడం ముఖ్యమన్న ఆయన తొలుత భారత్‌లోనే తమ స్మార్ట్ టీవీలను ఆవిష్కరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా స్మార్ట్ టీవీల కంపెనీలు భారతీయ మార్కెట్‌లో విక్రయాలు జరుపుతున్నప్పటికీ.. విపణిలో ఇంకా పుష్కలమైన అవకాశాలున్నాయన్న విశ్వాసాన్ని కపూర్ ఈ సందర్భంగా వెలిబుచ్చారు.

**సరికొత్త ఫీచర్లతో..**

స్మార్ట్ టెలివిజన్ మార్కెట్ అత్యంత ఆకర్షణీయంగా, మరెంతో ఖరీదైనదిగా ఉన్నది. ఇందుకు కారణం అత్యాధునిక ఫీచర్లను ఈ టీవీలు కలిగి ఉండటమే. బ్లూటూత్, వైఫైలతోపాటు వీడియోకాల్, రికార్డింగ్ తదితర వెసులుబాట్లు ఈ స్మార్ట్ టీవీల్లో అందుబాటులో ఉంటున్నాయి. ఇంకా అనేక ఫీచర్లను కొత్త సంస్థలు అందిస్తుండగా, ఇన్ఫినిక్స్ కూడా ఆ కోణంలో అన్వేషిస్తున్నది. సామ్‌సంగ్, ఎల్‌జీ, సోనీ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే స్మార్ట్ టీవీల మార్కెట్‌ను ఏలుతున్నాయి. నాలుగింట మూడు వంతుల వాటా ఈ మూడు సంస్థలదే. ఏటా దాదాపు 12.5 మిలియన్ల టీవీలు అమ్ముడవుతున్నట్లు అంచనా. షియామీ, మైక్రోమ్యాక్స్, మోటోరోలా తదితర సంస్థలూ స్మార్ట్ టీవీలను తయారుచేసి మార్కెట్‌లో నిలదొక్కుకోవాలని చూస్తున్నాయి.

**ధరలే కీలకం**

మామూలు టెలివిజన్లతో పోల్చితే స్మార్ట్ టెలివిజన్ల ధరలు కాస్త ఎక్కువగానే ఉంటున్నాయి. ఈ క్రమంలో ధరలు తగ్గితే మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తాయన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కాబట్టి కొత్తగా ఈ రంగంలోకి వస్తున్న సంస్థలు తక్కువ ధరలతో ఎక్కువ ఫీచర్లతో కూడిన స్మార్ట్ టీవీలను పరిచయం చేస్తే పెద్ద ఎత్తున అమ్మకాలు సాధించవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో షియామీ ఈ తరహా ఎత్తుగడతోనే మార్కెట్ లీడర్‌గా అవతరించిన విషయం తెలిసిందే. ఇటీవల ఫ్లిప్‌కార్ట్.. దేశీయ మార్కెట్‌లో నోకియా స్మార్ట్ టీవీని ఆవిష్కరించిన సంగతి విదితమే.

## ఎయిర్ ప్యూరిఫైయర్లకు గిరాకీ

### ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరాది నగరాల్లో పెద్ద ఎత్తున డిమాండ్

### అక్టోబర్-నవంబర్‌లో 60 శాతం పెరిగిన అమ్మకాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** ఎయిర్ ప్యూరిఫైయర్ అమ్మకాలు 60 శాతం వరకు పెరిగాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌సహా ఇతర ఉత్తరాది నగరాలు, పట్టణాల్లో గాలి కాలుష్యం పెరుగడంతో ఎయిర్ ప్యూరిఫైయర్లకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా అక్టోబర్-నవంబర్ నెలల్లో గిరాకీ బాగా ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఫిలిప్స్, బ్లూఎయిర్, పానసోనిక్, యూరేకా ఫోర్బ్స్, షార్ప్, షియామీ, బ్లూస్టార్ వంటి ప్రముఖ సంస్థలు తమ విక్రయాల్లో ఈసారి రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం ఎయిర్ ప్యూరిఫైయర్ల అమ్మకాల్లో ఉత్తరాది నగరాల వాటానే సగానికిపైగా ఉంటుందని అంచనా. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ఇందులో టాప్‌లో ఉంటున్నది. 'దేశంలో ఎయిర్ ప్యూరిఫైయర్లకు డిమాండ్ పెరుగుతున్నది. వాతావరణ కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరడంతో ప్రజలు వీటిని ఏడాది పొడుగుతా కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొనేవారూ ఎక్కువే' అని షియామీ ఇండియా ఆన్‌లైన్ సేల్స్ అధిపతి రఘు రెడ్డి అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎయిర్ ప్యూరిఫైయర్ల ధరల శ్రేణి రూ.800-57,000లుగా ఉన్నది.




## సరికొత్తగా జాగ్వార్ ఎక్స్‌ఈ

### ప్రారంభ ధర రూ.44.98 లక్షలు

**హైదరాబాద్, డిసెంబర్ 15:** టాటా మోటర్స్‌కు చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ జాగ్వార్ సరికొత్త మోడల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 2020 సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన ఈ నూతన 'ఎక్స్‌ఈ' మోడల్ ప్రారంభ ధరను రూ.44.98 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా ఎక్స్‌ఈ ఎస్‌ఈ మోడల్ విలువను రూ.46.32 లక్షలకు విక్రయిస్తున్నది. 2.0 లీటర్ల పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారు చేసిన ఈ కారును టెక్నాలజీపరంగా భారీ మార్పులు చేసింది సంస్థ. వైర్‌లెస్ చార్జింగ్ సదపాయం, ఎయిర్ క్వాలిటీ సెన్సార్, నావిగేషన్‌తో నేరుగా అనుసంధానం, వై-ఫై, హాట్‌స్పాట్ వంటి ఫీచర్స్ ఉన్నాయని జేఎల్‌ఆర్ ప్రైడ్ మోటర్స్ ఎండీ సురేశ్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జాగ్వార్ విభాగంలో ఐదు మోడళ్లు మార్కెట్లో లభిస్తున్నాయి. బీఎండబ్ల్యూ 3 సిరీస్, మెర్సిడెజ్-బెంజ్ సీ-క్లాస్, వొల్వో ఎస్60, ఆడీ ఏ4లకు పోటీగా సంస్థ ఈ కారును అందుబాటులోకి తీసుకొచ్చింది.

## గ్లోబల్ మార్కెట్లే దిక్సూచి

### ఈ వారం స్టాక్ మార్కెట్లపై విశ్లేషకుల అంచనా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** ఈ వారంలో స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాణిజ్యయుద్ధంపై గతేడాదిన్నరగా అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న చర్చలు కొలిక్కిరావడం మార్కెట్లకు మరింత జోషునివ్వనున్నదని దలాల్ స్ట్రీట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. యూఎస్-చైనా ఒప్పందంతోపాటు బ్రిటన్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బోరిస్ జాన్సన్ విజయం సాధించడంతో గ్లోబల్ మార్కెట్లు కొనుగోళ్లతో కళకళలాడనున్నాయి. అమెరికా ఉత్పత్తులపై విధించిన అదనపు పన్నును ఎత్తివేస్తున్నట్లు చైనా ప్రకటించడంతో భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సఖ్యతకు ఇది సంకేతం లాంటిదని, దీంతో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్యంపై చర్చలు పూర్తిగా ఫలప్రదం కాబోతున్నట్లు వచ్చిన సంకేతాలు మార్కెట్లకు ఉత్తేజాన్ని ఇవ్వనున్నదని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇటీవల జరుగుతున్న పలు కీలక పరిణామాలు మార్కెట్లకు మరింత కిక్కునివ్వనున్నాయని, ఇరు అగ్రదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కొలిక్కి రావడంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరిపే అవకాశం ఉన్నదని చెప్పారు. ఇప్పటికే చారిత్రక గరిష్ఠ స్థాయిలోకదలాడుతున్న దేశీయ మార్కెట్లు మరో ఆల్‌టైం హైకీ చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి మరిన్ని సంస్కరణలు ప్రకటించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు కూడా సూచీల వృద్ధికి పరోక్షంగా దోహదం చేయనున్నది. అలాగే సోమవారం టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదల కానుండటం మదుపరులు కొనుగోళ్ల వైపు మొగ్గు చూపేందుకు ఆస్కారం ఉన్నది. వీటికితోడు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ధరల శ్రేణి, క్రూడాయిల్ ధరలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసే అంశాలని పేర్కొన్నారు. గతవారంలో బీఎస్‌ఈ 30 షేర్ల ఇండెక్స్ 564.56 పాయింట్లు లేదా 1.39 శాతం లాభపడింది. శుక్రవారం ఒక్కరేజో 428 పాయింట్లు అధికమైంది.

**రూ.65 వేల కోట్లు పెరిగిన ఎం-క్యాప్**

గతవారంలో బ్లూచిప్ సంస్థల పంటపండింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీలతోపాటు ఇతర నాలుగు సంస్థల నికర విలువ మరో రూ.65 వేల కోట్లు పెరిగింది. వీటిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐలు ఉన్నాయి. కానీ, టీసీఎస్, హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యూఎల్), ఇన్ఫోసిస్, ఐటీసీలు మాత్రం నష్టపోయాయి. దేశంలో అత్యంత విలువైన సంస్థగా కొనసాగుతున్న ఆర్‌ఐఎల్ విలువ మరో రూ.17,439.74 కోట్లు పెరిగి రూ.10,03,147.26 కోట్లకు చేరుకోగా, హెచ్‌డీఎఫ్‌సీ రూ.15,435.51 కోట్లు అందుకొని రూ.4,06,705.23 కోట్లకు, ఎస్బీఐ రూ.11,512.75 కోట్లు అధికమై రూ.2,96,921.83 కోట్లకు చేరుకున్నది. వీటితోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 9,089.48 కోట్లు అధికమవగా, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.8,210.91 కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ రూ.3,371.91 కోట్లు పెరిగింది. కానీ, టీసీఎస్ రూ.19,231 కోట్లు కోల్పోగా, హెచ్‌యూఎల్ రూ.4,372.92 కోట్లు, ఐటీసీ రూ.2,027.73 కోట్లు కోల్పోయింది.

## స్టాక్ మార్కెట్లోకి ఈజీమైట్రిప్!

### రూ.510 కోట్లు సేకరించనున్న సంస్థ

**ఆన్‌లైన్‌లో** రవాణా సదుపాయాలు సమకూర్చే ఈజీమైట్రిప్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ వద్ద దరఖాస్తు చేసుకున్నది కూడా. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.510 కోట్ల వరకు నిధులను సేకరించాలని చూస్తున్నది. కంపెనీ వ్యవస్థాపకులైన నిశాంత్ పిట్టి, రికాంత్ పిట్టిలకు చెందిన చెరో రూ.255 కోట్ల విలువైన షేర్లను ఆఫర్-ఫర్ సేల్ రూట్‌లో విక్రయించాలనుకుంటున్నట్లు సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ పేపర్‌లో వెల్లడించారు. ఈజీమైట్రిప్.కామ్‌ను ఈజీ ట్రిప్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు ఆపరేట్ చేస్తున్నాయి. బ్రాండ్‌ను మరింత ప్రమోటింగ్ చేయడంతోపాటు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో ఐపీవోకి వస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఐపోవోకి యాక్సిస్ క్యాపిటల్, జేఎం ఫైనాన్షియల్‌లు మేనేజింగ్‌గా వ్యవహరిస్తున్నాయి. 2008లో ప్రారంభమైన సంస్థ.. ప్రస్తుతం నోయిడా, బెంగళూరు, ముంబై, హైదరాబాద్‌లలో కార్యాలయాలను ఏర్పాటు చేసిన సేవలు అందిస్తున్నది. అంతర్జాతీయంగా సింగపూర్, బ్రిటన్, యూఏఈల్లో కార్యాలయాలు ఉన్నాయి. 2010లోనే నాస్‌డాక్‌లో లిస్టైన విషయం తెలిసిందే.

## భారత్‌లో మరో 3 వేల కోట్లు

### పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించిన ఎంజీ మోటర్స్



**కోల్‌కతా, డిసెంబర్ 15:** చైనాకు చెందిన ఎస్‌ఏఐసీ నేతృత్వంలోని బ్రిటన్‌కు చెందిన ఆటోమొబైల్ బ్రాండ్ మారిస్ గారాజెస్(ఎంజీ)..దేశీయ మార్కెట్లో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి మరో రూ.3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే దేశీయంగా రూ.2 వేల కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసిన సంస్థ..గుజరాత్‌లోని హలోల్ వద్ద తన ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది జూలైలో దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన సంస్థ..దీర్ఘకాలికంగా వ్యాపారాన్ని నిర్వహించాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చాం..భవిష్యత్తులో మరో రూ.3 వేల కోట్ల వరకు పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాం అని ఎంజీ మోటర్ ఇండియా చీఫ్ కమర్షియల్ అధికారి గౌరవ్ గుప్తా తెలిపారు. ఇప్పటి వరకు సంస్థ 13 వేల యూనిట్ల కార్లను దేశీయంగా విక్రయించింది. విద్యుత్‌తో నడిచే వాహనంతోపాటు జూలై 2021 నాటికి దేశీయంగా నాలుగు ఎస్‌యూవీ మోడళ్లను విక్రయించాలనుకుంటున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆరు నెలలో క్రితం సంస్థ ప్రవేశపెట్టిన హెక్టార్ మోడల్‌కు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని, దీంతో ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచినట్లు ఆయన ప్రకటించారు.

# ఉద్యోగులను తొలగించడం లేదు

### స్పష్టంచేసిన టాటా మోటర్స్




**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:**

ఆటోమొబైల్ రంగంలో మందకొడి పరిస్థితులు నెలకొన్న కారణంగా ఉద్యోగులను తొలగించాలనుకోవడం లేదని దేశీయ వాహన సంస్థ టాటా మోటర్స్ స్పష్టం చేసింది. నూతన వాహనాలను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనుండటం భవిష్యత్తు అంతా సానుకూలంగా ఉంటుందని కంపెనీ వర్గాలు అంచనావేస్తున్నాయి. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం కమర్షియల్, ప్యాసింజర్ వాహన విభాగంలో 80 వేల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది తొలగించే ప్రతిపాదనేది తమ వద్ద లేదని టాటా మోటర్స్ సీఈవో, ఎండీ గ్యుంటర్ బుచెక్ తెలిపారు. దీర్ఘకాలికంగా ఆటోమొబైల్ రంగం మందకొడి పరిస్థితులతో అల్లాడుతున్నప్పటికీ పునర్వ్యవస్థీకరించే క్రమంలో ఏడాదిక్రితమే పలువురు ఉద్యోగులను తొలగించినట్లు, మరో దఫా తొలగించే అవకాశాలు లేవని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. గత 12 నెలలుగా ఆటోమొబైల్ రంగం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నదని, ఇది భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశాలున్నాయన్నారు.

**బీఎస్-6 ప్రమాణాలతో కొత్త వాహనాలు**

కాలుష్యాన్ని నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి ఇక నుంచి అన్ని రకాల వాహనాలను బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించి విడుదల చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. వీటిలో వచ్చే కొన్ని నెలల్లో అల్ట్రోజ్, నెక్సాన్ ఈవీ, గ్రావిటాస్ ఎస్‌యూవీలు ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ ఎలా ఉన్నప్పటికీ సంస్థ స్థిరమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, నూతన వాహనాల ఉత్పత్తిలోనూ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. కమర్షియల్ వాహన విభాగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు, సంస్థకు వచ్చిన ఆదాయంలో ఇదే కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. ఆటోమొబైల్ రంగంలో 30 ఏండ్లకు పైగా అనుభవం ఉన్న నాకు ఇంతటి గడ్డు పరిస్థితిని ఎప్పుడూ చూడలేదని, ప్రస్తుత పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు, నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో కంపెనీ ఏకీకృత విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 44 శాతం పడిపోగా, అలాగే రూ.1,281.97 కోట్ల నష్టాన్ని చవిచూసింది. అంతక్రితం ఏడాది సంస్థ రూ.109.14 కోట్ల లాభాన్ని గడించింది. ప్యాసింజర్ వాహనాలపై ఆయన స్పందిస్తూ..వచ్చే నెలలో నూతన అల్ఫా ప్లాట్‌ఫాం కింద పలు వాహనాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. జనవరిలో ప్రీమియం కాంప్యాక్ట్ హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో కూడా ప్రవేశించనున్నట్లు చెప్పారు.




దట్టంగా కమ్ముకున్న పొగమంచు.. ఉదయం 9 గంటలైనా వీడని చలి.. వరంగల్‌లోని చారిత్రక కాకతీయుల కళల సౌధం పొగమంచుతో చూపరులకు కొత్త అనుభూతిని కలిగించింది. ఆదివారం ఉదయం ఓరుగల్లు కోటలో హిమపాతం ఇలా కనువిందుచేసింది. -ఖిలావరంగల్

# బాలీవుడ్ నటి పాయల్ రోహత్గీ అరెస్టు

**నెహ్రూ, గాంధీ కుటుంబంపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల కేసు**



**కోట, డిసెంబర్ 15:** నెహ్రూ, గాంధీ కుటుంబాలపై అభ్యంతరకరంగా సోషల్‌మీడియాలో పోస్టుచేశారన్న ఆరోపణల కేసులో బాలీవుడ్ నటి పాయల్ రోహత్గీని రాజస్థాన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కేసు విచారణ కోసం అహ్మదాబాద్‌లోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకున్నారు. మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్‌నెహ్రూ, ఇందిరా గాంధీ, ఇతర కుటుంబసభ్యులను దూషిస్తూ సోషల్‌మీడియాలో సెప్టెంబర్ 6, 21వ తేదీల్లో ఆమె అభ్యంతరకరంగా పోస్టులు పెట్టారు. పాయల్ పోస్టులపై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చర్మేశ్ శర్మ ఫిర్యాదుమేరకు పోలీసులు అక్టోబర్ 10న బుండి పోలీస్‌స్టేషన్‌లో ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఈ పోస్టులపై సమాధానం ఇవ్వాలంటూ ఈనెల ఆమెకు నోటీసు పంపారు. 'గూగుల్‌లో లభించిన సమాచారంతో మోతీలాల్ నెహ్రూపై వీడియో తయారుచేసినందుకు రాజస్థాన్ పోలీసులు నన్ను అరెస్టు చేశారు. మాట్లాడే స్వేచ్ఛ అపహాస్యంగా మారింది' అంటూ పాయల్ రోహత్గీ ట్వీట్ చేశారు. పాయల్‌ను అరెస్టు చేసి విచారణ కోసం బుండి స్టేషన్‌కు తరలించామని ఎస్పీ మమతా గుప్తా చెప్పారు. పాయల్ తమకు సహకరించడంలేదని తెలిపారు. ఆమె ఇప్పటికే యాంటిసిపేటరీ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా, అది సోమవారం విచారణకు రానుంది.



ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్‌చాలెంజ్‌కు అపూర్వ స్పందన లభిస్తున్నది. టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ చాలెంజ్‌ను స్వీకరించిన సినీనటుడు సుబ్బరాజు ఆదివారం హైదరాబాద్‌లోని తన ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ



# పీఆర్వోల పాత్ర కీలకం

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో విద్యకు ప్రాధాన్యమివ్వాలి

**పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ▪ ముగిసిన అఖిల భారత ప్రజాసంబంధాల సదస్సు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాజంలో ప్రజాసంబంధాల అధికారుల (పీఆర్వో) పాత్ర కీలకమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పీఆర్వోల సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మనోహర హోటల్‌లో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్సై) ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న అఖిలభారత ప్రజాసంబంధాల సదస్సు ముగింపు సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ వివిధ రంగాల్లో పురోగమిస్తున్నదని చెప్పారు. అనేక సంక్షేమ పథకాల అమలుతో ప్రపంచదేశాలు తెలంగాణ వైపు చూసేలా సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో యువత, విద్య, ఆరోగ్యం తదితర రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, శాశ్వత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించిన హైదరాబాద్ చాప్టర్ బాధ్యులను పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు అజిత్ పాఠక్ అభినందించారు. వచ్చే ఏడాది సదస్సును శ్రీలంకలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. పీఆర్‌ఎస్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదితా బెనర్జీ మాట్లాడుతూ సంస్థలకు ప్రజాసంబంధాలు అత్యంత కీలకమైనవని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్సై జాతీయ మాజీ అధ్యక్షుడు సమీర్ గోస్వామి, జాతీయ ఉపాధ్యక్షులు యూఎస్ శర్మ, నరేంద్రమెహతా, ఎంఎస్ మజుందార్, జాతీయ కోశాధికారి దిలీప్ చౌహాన్, హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఉత్తరాఖండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర దోభాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం అఖిలభారత ప్రజాసంబంధాల సదస్సుకు హాజరై జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**చాప్టర్ అవార్డుల ప్రదానం**

జాతీయ సదస్సులో పీఆర్‌ఎస్సై చాప్టర్ అవార్డులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. హైదరాబాద్ చాప్టర్.. ఉత్తమ చాప్టర్ అవార్డును అందుకోగా, ఉత్తమ చాప్టర్ చైర్మన్ అవార్డును హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, జైపూర్ చాప్టర్ చైర్మన్ రవిశంకర్ శర్మ స్వీకరించారు. బెస్ట్ ఎమర్జింగ్ చాప్టర్‌గా తిరుపతి చాప్టర్ జాతీయ అవార్డును దక్కించుకున్నది. ఉత్తమ కార్యక్రమాలు నిర్వహించిన కోల్‌కతా, గౌహతి, భోపాల్, అహ్మదాబాద్ చాప్టర్లకు అవార్డులను అందజేశారు.

## జీవోసీగా పీఎన్ రావు బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దక్షిణ భారత జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీవోసీ)గా లెఫ్టినెంట్ జనరల్ పండాల నాగేశ్‌రావు (పీఎన్ రావు) ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 1982లో భారత సైన్యంలోని పారాచూట్ రెజిమెంట్ ఐదో బెటాలియన్‌లో పీఎన్‌రావు విధుల్లో చేరారు. పారాచూట్ రెజిమెంట్ ఆపరేషన్స్‌లో భాగంగా పర్వత ప్రాంతాల్లో పనిచేసిన విశేష అనుభవం పీఎన్ రావుకు ఉన్నది.

## రాంగోపాల్‌వర్మకు నోటీసు

- నేడు విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వివాదాస్పద దర్శకుడు, నిర్మాత రాంగోపాల్‌వర్మకు హైదరాబాద్ సీసీఎస్ సైబర్ క్రైం పోలీసులు నోటీసులను జారీచేశారు. సోమవారం విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. వర్మపై మూడ్రోజుల క్రితం కేఏపాల్ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదుచేశారు. అమ్మరాజ్యంలో కడపబిడ్డలు సినిమా సెన్సార్ సర్టిఫికెట్‌ను రాంగోపాల్‌వర్మకు మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అందిస్తున్నట్టు మార్ఫింగ్ ఫొటోను ట్విట్టర్‌లో పెట్టినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపీసీ 469, 509 సెక్షన్ల కింద అభియోగాలు నమోదుచేసిన పోలీసులు.. తమ ఎదుట విచారణకు హాజరుకావాలని వర్మకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.



ఆదివారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో సీనియర్ పాత్రికేయుడు కంభాలపల్లి కృష్ణ రాసిన 'ది జర్నీ ఆఫ్ ఏ జర్నలిస్ట్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ కవిత, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, సంపాదకుడు కే శ్రీనివాస్, టీ శాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ తదితరులు

# ఉద్యమ జర్నలిస్టులు

- పాత్రికేయులతో రాజకీయనేతలది విడదీయరాని బంధం
- 'ది జర్నీ ఆఫ్ ఏ జర్నలిస్ట్' పుస్తకావిష్కరణలో మాజీ ఎంపీ కవిత

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్టులు ఉద్యమానికి కట్టుబడి పనిచేశారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో వారిపాత్ర మరువలేదని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. పాత్రికేయులు, రాజకీయనేతలకు చాలా దగ్గరి సం బంధాలు ఉంటాయని, ఇంటినుంచి బయటకెళితే మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తారో వారికే తెలియదని పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు కంభాలపల్లి కృష్ణ తన పాత్రికేయ జీవితంపై రాసిన 'ది జర్నీ ఆఫ్ ఏ జర్నలిస్ట్' పుస్తకాన్ని ఆదివారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకుడు వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణ స్నేహితుడు డాక్టర్ శ్రీనివాస్ పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా కవిత మా ట్లాడుతూ.. 'శ్రీకృష్ణుడికి మరోపేరు దామోదరుడని.. ఆ పేరుకు కట్టుబడనివాడు అని అర్థమని, అలా ఎవరికీ కట్టుబడని శ్రీకృష్ణుడు.. యశోద మీద ప్రేమతో రోలుకు కట్టేయబడ్డాడని.. అలాగే తెలంగాణలో జర్నలిస్టులు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి కట్టుబడి ఉన్నారు' అని తెలిపారు.

**అన్నబాటలోనే తమ్ముడు**

'నమస్తే తెలంగాణ' ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణ ప్రగతిశీల రాజకీయాల వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారని, ఆయన అన్న శేఖర్ బాటలోనే జర్నలిజంలోకి వచ్చారని గుర్తుచేశారు. 25 ఏండ్ల జర్నలిస్టు జీవితంలో ఎనిమిది సంస్థలు మారారని, అది ఆయన బలహీనత కాదు.. బలమని చెప్పారు. టీ శాట్ సీఈవో శైలేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను కృష్ణతో కలిసి పనిచేశానని, తెలంగాణ ఉద్యమకాలంలో రాష్ట్ర ఆవశ్యకతను టీవీల్లో చర్చల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎంతో కృషిచేశామని తెలిపారు. సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణతో తనకు మూడుర కాల సాన్నిహిత్యం ఉన్నదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ శివప్రసాద్ మాట్లాడుతూ.. కృష్ణ, తాను ఒకేసారి జర్నలిజంలోకి వచ్చినట్టు తెలిపారు. అప్పట్లో జర్నలిస్టులు ఆర్థిక పరిస్థితులు సరిగాలేక టీని కూడా పంచుకుని తాగేవారని, ఆ సమయంలోనూ కృష్ణ, శైలేశ్‌రెడ్డి వంటివారు నిజాయితీగా పనిచేశారని సీనియర్ జర్నలిస్టు పృథ్వీ తెలిపారు. సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇద్దరం కలిసి అనేక సర్వేలు చేశానమని గుర్తుచేశారు. 25 ఏండ్ల వృత్తిలో వ్యక్తిగత జీవితాన్ని చాలా కోల్పోయానని పుస్తక రచయిత కృష్ణ తెలిపారు.

## విచ్ఛిన్నకర శక్తుల ఆటలు సాగనివ్వం

**బజరంగ్‌దళ్ ఆలిండియా కన్వీనర్ సోలంకి సోహాన్‌జీ**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మత ప్రాబల్యం పెంచుకుని దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తే ఎంతటి దుష్టశక్తులనైనా ఎదిరిస్తామని బజరంగ్‌దళ్ ఆలిండియా కన్వీనర్ సోలంకి సోహాన్‌జీ అన్నారు. అక్రమంగా భారత్‌లోకి చొరబడి స్థావరాలు ఏర్పర్చుకున్న రోహింగ్యాలు దేశంలో అల్లర్లు సృష్టిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఆదివారం జరిగిన బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శిబిరాల ముగిం పు సదస్సుకు సోలంకి హాజరై మాట్లాడుతూ.. పాకిస్థాన్‌వాళ్లు భారత భూభాగంవైపు కన్నెత్తి చూస్తే ఊరుకోబోమన్నారు. సదస్సుకు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు అధ్యక్షత వహించగా.. అయోధ్య ఉద్యమంలో పాల్గొన్న దాదాపు 2800 మంది కర సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని అయోధ్య రామమందిర జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు సుభాష్‌చందర్, శివరాం, కుమారస్వామి, వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు రాజేందర్, జగదీశ్వర్, సత్యనారాయణ, పగడాకుల బాలస్వామి, రాజగోపాల్, నాగేశ్వర్‌రావు, బ్రహ్మం, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారైలకు 'యుద్ధకాండ' పరిచయం

**హ్యూస్టన్‌లో వాసుదాసు రామాయణం విశిష్టతపై ప్రసంగించిన జ్వాలా నరసింహారావు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం సీపీఆర్వో వనం జ్వాలానరసింహారావు తాను రచించిన మందార మకరందం 'యుద్ధకాండ' పుస్తకాన్ని అమెరికాలోని ఎన్నారైలకు పరిచయం చేశారు. హ్యూస్టన్‌లో 'నెల నెల వెన్నెల' పేరుతో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి సాహితీ మిత్రుడు సుధేశ్ పిల్లుట్ల ఆహ్వానం మేరకు ఆయన హాజరయ్యారు. ఆహ్వానితుల కోరిక మేరకు వాసుదాసు రామాయణం విశిష్టతపై ప్రసగించారు. ఇటీవలనే పూర్తిచేసిన 'యుద్ధకాండ' పుస్తకం గురించి సభికులకు వివరించారు. త్వరలో 'జ్వాలా రామాయణం– సమాలోచనం' పేరిట హైదరాబాద్‌లో సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నట్టు దర్శనమ్ సం పాదకుడు వెంకటరమణశర్మ తెలిపారు.



అమెరికాలో యుద్ధకాండ పుస్తకాన్నిప్రదర్శిస్తున్న సీఎం సీపీఆర్వో వనం జ్వాలానరసింహారావు

# ఇనాం భూమి ఇతరులకు పట్టా

- కబ్జాలో ఉన్నా అక్రమంగా కట్టబెట్టారు
- విచారణ జరిపి న్యాయంచేయండి
- జనగామ జిల్లా పడమటికేశ్వాపూర్ రజకుల వినతి
- రెవెన్యూ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం




కబ్జాలో ఉన్న భూమిని చూపుతున్న జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ రజకులు

**బచ్చన్నపేట:** గ్రామానికి చెందిన బ్రాహ్మణుడు విఠల రాజపున్నయ్య తమకు ఇనాంగా ఇచ్చిన భూమిలో కొన్నేండ్లుగా కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నా పహాణీల్లో తమ పేర్లను తొలిగించి ఇతరులు పట్టా చేసుకొని విక్రయించుకున్నారని జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెం దిన రజకులు ఆవేదన వ్యక్తంచేశారు. కబ్జాలో ఉన్న తమ భూమిని, వారి కుటుంబసభ్యుల సమాధులను ఆదివారం విలేకరులకు చూపించారు. భూమిలో అక్రమంగా నాటిన ఖనీలను తొలిగించారు. రజకులు ద్యాగరి చంద్రయ్య, కత్తెరపల్లి శ్రీనివాస్, ఉప్పలయ్య, నారాయణ, భిక్షపతి, ఆంజనేయులు, ప్రభాకర్ తదితరులు వివరాలు వెల్లడించారు. తామంతా చాకలి పెద్ద మల్లయ్య వారసులమని, గ్రామానికి చెందిన బ్రాహ్మణుడు విఠల రాజపున్నయ్యకు సర్వే నంబర్– 454లో 9.27 ఎకరాల భూమి ఉండేదని తెలిపారు. 1950లో వడ్ల లక్ష్మీనారాయణకు 4.33 ఎకరాలు, చాకలి పెద్దమల్లయ్యకు 4.33 ఎకరాలను ఇనాంగా ఇచ్చారని చెప్పారు. అప్పటినుంచి నేటివరకు తామే కబ్జాలో ఉంటూ కొంత భూమిలో వ్యవసాయం, మరి కొంత భూమిలో పశువులను మేపుకుంటున్నామని వివరించారు. వడ్ల లక్ష్మీనారాయణ వారసులైన రామలింగయ్య, ఆంజనేయులు, శ్రీను, రాజలింగం అక్రమంగా సర్వే నంబర్–454లో వారి వాటాగా ఉన్న 4.33 ఎకరాలతోపాటు తమ భూమిని కలుపుకొని మొ త్తం 6.20 ఎకరాలను ఇదే గ్రామానికి చెందిన ఓ రైతుకు అమ్మినట్టు తెలిసిందని చెప్పారు. అయితే సదరు రైతు 6.20 ఎకరాలతోపాటు ఇంకా తమకు చెందిన భూమిలో (9.27 ఎకరాలు) ఫెన్సింగ్ కోసం ఖనీలు గతంలో వేయగా, తాము తొలగించామన్నారు.

**ఆర్డీవో ఆదేశాలు పట్టించుకోవడం లేదు**

ఈ విషయమై జనగామ ఆర్డీవో మధుమోహన్, బచ్చన్నపేట తాసిల్దార్ వెంకటేశ్వర్లుకు ఇప్పటికే వినతిపత్రాలు అందించామన్నారు. విచారణ జరిపి రజకులకు ఇనాంగా వచ్చిన భూమి విషయం పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశాలు ఇచ్చినా కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. విచారణ కోసం వీఆర్వో, ఎంపీ వచ్చి సదరు రైతుకు వత్తాసు పలికారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిద్దిపేట జిల్లా మిడిదొడ్డిలో ఉంటున్న రాజపున్నయ్య వారసులను వెళ్లి కలువగా ఇనాం ఇచ్చిన విషయాన్ని ఎక్కడైనా చెప్తామని పేర్కొన్నట్టు తెలిపారు. 1972లో తమ తాతలు మృతి చెందగానే పహాణీల నుంచి వాళ్ల పేర్లను తొలగించి వడ్ల లక్ష్మీనారాయణ పేరును నమోదు చేయించుకున్నారని, 1998 వరకు పహాణీలో విఠల రాజపున్నయ్య పేరు వచ్చిందని, ఆ తర్వాత ఆయన పేరును తొలిగించి అక్రమంగా భూమిని అమ్ముకొని తమకు అన్యాయంచేశారని, ఉన్నతాధికారులు స్పందించి చాకలి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయంచేయాలని కోరారు.

# ఇక సమావేశాలుండవ్

- ఇవే తుది ప్రొసీడింగ్స్
- వీటినే సుప్రీంకోర్టుకు సమర్పిస్తా
- విద్యుత్ ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి స్పష్టీకరణ
- ఏపీ తీరుపై అసహనం



జస్టిస్ ధర్మాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ విద్యుత్ సంస్థల ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉద్యోగుల విభజన విషయంలో ఏపీ విద్యుత్ సంస్థలు అనుసరిస్తున్న తీరుపై జస్టిస్ ధర్మాధికారి తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. సమస్య పరిష్కారానికి తెలంగాణ ఒకమెట్టు కిందకు దిగి ఏపీకి చెందిన కొందరిని తీసుకోవడానికి అనుమతించినా ఉద్దేశపూర్వకంగానే ఈ సమస్యను ఏపీ సాగదీస్తున్నదని గుర్తించారు. ఆదివారం ఆయన హైదరాబాద్ తాజ్‌డెక్కన్ హోటల్‌లో ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థల ప్రతినిధులతో రెండోరోజు సమావేశమై తుది ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఇకపై ఎలాంటి సమావేశాలు ఉండవని, ఇవే తుది ప్రొసీడింగ్స్ అని, వీటినే సుప్రీంకోర్టుకు సమర్పిస్తానని తేల్చిచెప్పారు. ఈ మేరకు తెలంగాణ నుంచి రిలీవ్‌చేసిన 1,157 ఏపీ ఉద్యోగుల్లో 504 మందిని, తెలంగాణకు ఆప్షన్ ఇచ్చిన 256 మందిలో 50 శాతం ఉద్యోగులను (128 మందిని), ఏపీలో పనిచేస్తున్న 242 మంది తెలంగాణ ఉద్యోగులను కలిపి మొత్తం 874 మందిని తీసుకోవడానికి తెలంగాణ విద్యుత్ సంస్థలు అంగీకరించాయి. తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులను తీసుకొనేందుకు ఆ రాష్ట్రం నిరాకరిస్తున్నది. గతంలో అంగీకరించిన ఏపీ విద్యుత్ సంస్థల ప్రతినిధులు.. ఇప్పుడు ఉత్తచేతులతో సమావేశానికి రావడంతో వారి కుట్రలు బయటపడ్డాయి.

**విభజన త్వరగా పూర్తిచేయండి..**

ఉద్యోగుల విభజన సమస్యను త్వరగా పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ సంస్థల ప్రతినిధులు జస్టిస్ ధర్మాధికారిని కోరారు. తెలంగాణ తరపున హెచ్చార్డీ డైరెక్టర్ అశోక్‌కుమార్, జెన్‌కో హెచ్చార్డీ, సీజీఎం నర్సింహ, ఆంధ్రా తరపున ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ హరినాథ్, జేఎండీ చక్రధర్‌బాబు, తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు హాజరయ్యారు.

**తెలంగాణ విద్యుత్ సంఘాల నేతల ఆగ్రహం**

విద్యుత్ ఉద్యోగుల విభజనలో ఏపీ కుట్రలు మరోసారి బయటపడ్డాయని తెలంగాణ విద్యుత్ సంఘాల నాయకులు శివాజీ, అంజయ్య మండిపడ్డారు. సమస్య పరిష్కారానికి తెలంగాణ ఓ మెట్టు దిగినా ఏపీ ప్రభుత్వం కావాలనే కొర్రీలు పెడుతున్నదని మండిపడ్డారు.

## 'మిషన్ భగీరథ'లో ఇంటింటికీ ఇంటర్నెట్

**ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కొత్త సాంకేతికతను అర్థం చేసుకొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ 27 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఫ్యూచర్ బ్రాడ్‌కాస్టింగ్ డైరెక్ట్ టు హోమ్' అనే అంశంపై ఆదివారం హోటల్ ప్లాజాలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. 'మిషన్ భగీరథ' పైప్‌లైన్లతోపాటు ఫైబర్ కేబుల్‌లైన్లు వేసి ఇంటింటికీ ఇంటర్నెట్ అందించనున్నామని, కియోస్కుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసార భారతి సీఈవో శశిశేఖర్ వెంపటి, సాఫ్‌నెట్ సీఈవో వెంకటేశ్వర్లు, బ్రాడ్‌కాస్ట్ ఇంజినీర్స్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ టీఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

## రాజ్యాంగ సంస్థలను బలహీనపర్చొద్దు: నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. మఖ్దూంభవన్‌లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ.. పౌరసత్వ సవరణ చట్టంతో ముస్లింలను టార్గెట్ చేసి లౌకితత్వానికి భంగం కలిగిస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# పండ్ల రైతులకు వరప్రదాయిని

- ఆకట్టుకుంటున్న ములుగు 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'
- 30 ఎకరాల్లో 42 వేల పండ్ల మొక్కల పెంపకం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పండ్ల తోటల సాగు విస్తీర్ణం, దిగుబడుల పెంపు లక్ష్యంగా ఉద్యానశాఖ ప్రణాళికలను అమలుచేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యాన పంటల్లో పెరుగుతున్న సాంకేతిక వినియోగాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటుచేసింది. సిద్దిపేట జిల్లా పరిధిలోని ములుగులో నెలకొల్పిన ఉద్యాన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని గత వారం సీఎం కేసీఆర్ ప్రారంభించి యాపిల్ మొక్క నాటారు. ఈ సెంటర్ పండ్ల తోటల రైతులను విశేషంగా ఆకట్టుకొంటున్నది. తెలంగాణకు మణిహారంగా 42 వేల మొక్కలను నాటిన అధికారులు వివిధ ప్రయోగాలకు సన్నద్ధమవుతున్నారు.

**వేలల్లో పండ్ల రకాల ప్రయోగాలు**

దాదాపు 30.01 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో మొత్తం 11 రకాల బహు వార్షిక పండ్ల తోటల పెంపకంపై దృషి సారించారు. 52 రకాల వంగడాలకు చెందిన 17,915 మొక్కలను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. వీటితోపాటు ఐదు రకాలకు చెందిన 14,747 ఆగ్రో ఫారెస్టీ మొక్కలు నాటారు. ఎగుమతులే లక్ష్యంగా వీటిని పెంచుతున్నట్టు ఉద్యాన శాఖ సంచాలకుడు ఎల్ వెంకట్రాంరెడ్డి వెల్లడించారు. 11 ఎకరాల్లో మామిడి, 8 ఎకరాల్లో నిమ్మ, బత్తాయి, మూడున్నర ఎకరాల్లో జామ, రెండున్నర ఎకరాల్లో దానిమ్మ, ఎకరంలో ఖర్జూరం, ఎకరం 10 గుంటల్లో చింత, 2.36 ఎకరాల్లో సీతాఫలం, 25 గుంటల్లో అల్లనేరడు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు పండిస్తున్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు 49 లక్షల లీటర్ల సామర్థ్యంతో నాలుగు ఫారంపాండ్‌లను నిర్మించారు. అలాగే 5,000 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల లోతుతో కందకాలు నిర్మించారు. ములుగులో 60 రోజులపాటు వర్షపునీరు అందుబాటులో ఉంటుంది. ఈ కందకాల వల్ల 1.12 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేసుకొనే అవకాశం ఉంటుందని ఎల్ వెంకట్రాంరెడ్డి తెలిపారు.




నమస్తే తెలంగాణ
జిందగీ
సోమవారం 16 డిసెంబర్ 2019   WWW. NTNEWS.COM   /nt.zindagi

# సముద్రాలు దాటిన ప్రేమ!

**మాటలు రాని జీవులతో కొంచెంసేపు గడిపితే చాలనుకుంటాం. దెబ్బ తగిలితే చికిత్స చేపిస్తాం. ఇంకా ప్రేముంటే ఇంటికి తెచ్చుకొని పెంచుకుంటాం. అంతకుమించి ఆమె ఏం చేసిందంటే.. ముంబైలోని ఏడుపిల్లులను విమానంలో తీసుకెళ్లి లండన్‌లో పెంచుకుంటున్నది. ఎందుకంటే..**



లండన్‌కు చెందిన ఎలెనా ఫెర్నాండెజ్‌కు మూగజీవాలతో సావాసం అంటే చాలా ఇష్టం. వాటి ఆలనాపాలనా చూసుకుంటూ జీవితం గడపమన్నా గడిపేస్తుంది. అలాంటి జీవుల్లో పిల్లి కూడా ఒకటి. మాటలురాని జీవులు రోడ్లపై తిరుగుతుంటే కనికరం లేకుండా ప్రమాదాలకు గురిచేస్తుంటారు. వాటికి దెబ్బతగిలినా చికిత్స చేసేందుకు ముందుకు రారు. ముంబైలోని బాంద్రా ప్రాంతాలలోని ప్రమాదకర ప్రదేశాల నుంచి ఏడు పిల్లులను 32 ఏండ్ల ఫెర్నాండెజ్ రక్షించింది. వాటికి గార్ఫిల్డ్, మర్ఫీ, మిస్చీఫ్, సూటీ, స్వీప్, డిస్నీ, పాచెస్ అని పేరు పెట్టింది. వాటికి దగ్గరుండి చికిత్స చేపించి వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకున్నది. ముంబైకు వచ్చిన ఫెర్నాండెజ్ తనతోపాటు యూకేకు ఆ ఏడు పిల్లులను వెంట తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేసుకున్నది. తల్లిదండ్రులు అక్కడే ఉన్నందువల్ల దత్తత తీసుకున్న పెంపుడు జీవుల్ని జాగ్రత్తగా చూసుకునేందుకు సులభంగా ఉంటుంది. ఫెర్నాండెజ్‌తోపాటు విమానంలో పిల్లుల అనుమతికి సహకరించిన బ్రిటిష్ ఎయిర్‌వేస్, కస్టమ్స్ అధికారులకు ఇన్‌స్టాగ్రామ్‌లో కృతజ్ఞతలు తెలిపింది. సముద్రాలు దాటి ప్రయాణించడానికి పిల్లులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. ఇంటర్నేషనల్ పెట్ రీలొకేషన్ ఏజెన్సీ డాక్యుమెంటేషన్ అందజేసింది. ఆ పిల్లులను ఇప్పుడు 'స్లమ్‌కాట్ మిలియనీర్లు' అని పిలుస్తున్నారు. ఎందుకంటే ఫెర్నాండెజ్ లండన్‌లోని కెన్సింగ్టన్ ప్యాలెస్‌కు దగ్గరగా ఉంటారు. ఆమె బాలివుడ్ నటి కావడం విశేషం.

సక్సెస్ మంత్ర



## సామాజిక వ్యాపారి

# తన్వీ జోహ్రీ

**మహిళలకు నెలసరి అనేది ఓ పెద్ద సమస్య. ఆ సమయంలో తప్పకుండా వారు నాప్‌కిన్స్ వాడాల్సిందే. అయితే మహిళలు వాడే శానిటరీ నాప్‌కన్‌ల వల్ల పర్యావరణానికి ఎంతో నష్టం. అవి సింథటిక్‌తో తయారవుతాయి. దీంతో వాడిన తర్వాత వాటిని పడేస్తే అవి భూమిలో కలవడానికి చాలా సమయం పడుతుంది. అంతేకాదు వాడిన మహిళలకు కూడా అనేక సమస్యలు కలుగజేస్తాయి. అలాంటి సమస్యనే ఎదుర్కొన్న ఒక యువతి వాటినుండి మహిళలకు విముక్తి కల్పించాలనే ఉద్దేశంతో త్వరగా భూమిలో కలిసిపోవడంతో పాటు భూమికి సారాన్ని కూడా అందించే శానిటరీ నాప్‌కిన్లను తయారు చేసింది.దానికోసం ఒక పరిశ్రమను ఏర్పాటు చేయడంతో పాటు కోట్ల వ్యాపారాన్ని చేస్తున్నది. ఆమె ఏర్పాటు చేసిన సంస్థను పోర్బ్స్ కూడా గుర్తించింది. కార్మెసీ సామాజిక వ్యాపార సంస్థను నిర్వహిస్తున్న తన్వి జోహ్రి సక్సెస్‌మంత్ర.**

**తన్వీ** స్వస్థలం ఉత్తరప్రదేశ్ లోని మధుర.సింథటిక్ శానిటరీ నాప్ కీన్స్ ప్రత్యామ్నాయం కోసం వెతికి శాస్త్రవేత్తల సహకారంతో మొక్కజొన్న పిండి,వెదురు గుజ్జుతో నాప్‌కిన్స్ తయారు చేసింది. ఇవి చర్మానికి హాని చేయక భూమిలో కలిసిపోతాయి. కార్మేసీ పేరుతో ఒక అంకుర పరిశ్రమను ఒక స్నేహితుని సాయంతో మొదలుపెట్టింది.అమె కృషికి తగిన గుర్తింపుగా పోర్బ్స్ ఆమె సంస్థను గుర్తించింది. ఇప్పుడు ఆమె వార్షికాదాయం కోటి రుపాయలు దాటింది. కార్మెసీ ఓ సామాజిక వ్యాపార సంస్థగా గుర్తింపు పొందింది.

### సమస్యను గుర్తించి..

తన్వీది ఉత్తరప్రదేశ్ అయినా వారి కుటుంబం ఢిల్లీలో స్థిరపడింది. మూడు పదులు కూడా నిండని ఆమె నెలసరి సమయంలో వాడే నాప్‌కిన్స్ వల్ల ఎదురయ్యే సమస్యలను గుర్తించింది. వాటివల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయనే విషయం ఆమెకు అర్థమైంది. ముఖ్యంగా నెలసరి సమయంలో చాలామంది మహిళలు కడుపునొప్పి, నడుము నొప్పితోపాటు ఇతర సమస్యలతోనూ బాధపడుతుంటారు. నెలసరి సమయంలో సాధారణంగా శానిటరీ నాప్‌కిన్స్ వాడుతుంటారు. అయితే వారు ఉండే పరిస్థితుల్లో తాము వాడుతున్నవి నాణ్యమైనవా కావా అనే విషయాన్ని పట్టించుకోరు. మహిళలు వాడే సింథటిక్ నాప్‌కిన్‌ల వల్ల దద్దుర్లు, అలర్జీలు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అసలే సమస్యతో ఉండే వారికి ఈ సమస్య మరింత ఇబ్బందికి గురిచేస్తుంది. నలుగురిలో ఉన్నప్పుడు ఆ సమస్య మరింత బాధిస్తుంది. తన్వీ ఇవ్వన్నీ స్వయంగా అనుభవించింది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. అటువంటి సమయంలోనే సింథటిక్ నాప్‌కిన్‌లకు ప్రత్యామ్నాయం వెతికింది. అయితే ఏవీ కూడా తనకు అనుకూలంగా లేకపోవడం ఆమెను మరింత బాధించింది. దీంతో తనే ఒక కొత్త రకం న్యాప్‌కిన్‌లను ఎందుకు తయారు చేయకూడదు అన్న ఆలోచన వచ్చింది. దాంతో తనే స్వయంగా పరిశోధించి చర్మానికి, ప్రకృతికి హాని చేయని నాప్‌కిన్‌లను తయారు చేయాలని నిర్ణయించుకుంది.

### ఫలించిన పరిశోధనలు

ఎంబీఏ పూర్తి చేసిన తన్వీ తన ప్రతిభతో ఓ కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం తెచ్చుకుంది. సంతోషంగా సాగిపోతున్న సమయంలోనే తనకు ఎదురైనా న్యాప్‌కిన్‌ల సమస్య కారణంగా ఉద్యోగం వదులుకుంది. అంతేకాదు, మహిళలకు ఎలాంటి ఇబ్బందిలేని నాప్‌కిన్‌లు తయారు చేయాలని సంకల్పించింది. వాటిమీద పరిశోధనలు చేసిన తన్వీ 2014 నుంచి పూర్తిస్థాయిలో అధ్యయనం మొదలుపెట్టింది. అనేక విషయాలపై శాస్త్రవేత్తల్ని, వైద్యుల్ని సంప్రదించింది. ఇంటర్నెట్‌లోనూ సెర్చ్ చెసింది. నాలుగు సంవత్సరాల కృషి ఫలితంగా 2017లో తానే స్వయంగా ఆర్గానిక్ శానిటరీ న్యాప్‌కిన్ల తయారీకి శ్రీకారం చుట్టింది. మొక్కజొన్న పిండి, వెదురు గుజ్జుతో వీటిని తయారు చేసింది. తను తయారు చేసిన నాప్‌కిన్లను పలువురు శాస్త్రవేత్తలకు చూపించింది. వారు చెప్పిన మార్పులతో మరింత నాణ్యమైన వాటిని తయారు చేసింది. వాటిని శాస్త్రవేత్తలు ఆమోదించారు. మొక్కజొన్న పిండి, వెదురు గుజ్జు.. చర్మానికి హాని చేయవు. పైగా భూమిలో కేవలం ఆరు నెలల్లో కలిసిపోతాయని నిర్ధారించారు. తన్వీ ప్రయోగం విజయం సాధించినప్పటికీ... ఆమె అంకుర పరిశ్రమకు పెట్టుబడి పెట్టడానికి మొదట్లో ఎవరూ ముందుకు రాలేదు. దాంతో నెలసరి పట్ల, తను తయారు చేసిన శానిటరీ నాప్‌కిన్ల గురించి అవగాహన కల్పించడం మొదలుపెట్టింది. ఆమె స్నేహితుడికి తెలిసి పెట్టుబడి పెట్టడానికి ముందు కొచ్చాడు.. అలా ఇద్దరూ కలిసి గతేడాది కార్మేసి పేరుతో ఓ అంకుర పరిశ్రమను ఏర్పాటు చేశారు.

### కోటి రూపాయల వార్షిక ఆదయం

సాధారణంగా ఆడవారు ఈ విషయాన్ని బయటకు చెప్పకూడదని భావిస్తుంటారు. ఎంత ఇబ్బందిగా ఉన్నా తోటి వారితో పంచుకోకపోవడం.. ఇంకా అనేక సామాజిక కారణాలు ఉన్నాయి. తను అలా చేయడం వల్ల మగవారు తమ స్నేహితురాళ్లకీ, భార్యలకీ, ఇంట్లో వారికి వాటిని బహుమతులుగా ఇవ్వడం మొదలుపెట్టారు. దాదాపు మూడు నెలల్లో మూడు వేల మంది వినియోగదారులు తన్వీ ఖాతాలో చేరిపోయారు. ప్రస్తుతం ఆ సంఖ్య ఇరవై వేలకు చేరుకుంది. వీరిలో ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కేరళ, మహారాష్ట్రకు చెందిన వారే ఉన్నారట. చిన్న వయసులో తన్వీ ఉత్పత్తిని ఫోర్బ్స్ గుర్తించి అభినందించింది. ఆమె కృషి ఊరికే పోలేదు. ఇప్పుడు పెద్ద ఎత్తున మహిళలు ఈ ఆర్గానిక్ నాప్‌కిన్లనే వాడుతున్నారు. దీంతో తన్వీ వార్షి కాదాయం కోటిరూపాయలు దాటిపోయింది.



**ఆకట్టుకునేలా**

తన్వీ ఉత్పత్తి చేసిన నాప్‌కిన్‌లను అందరినీ ఆకట్టుకునేలా ప్యాక్ చేయడంతో పాటు వాటిని పడేయడానికి మరో ప్యాక్ కూడా అందులో ఉంచుతున్నది. మగవారికి కూడా వీటి గురించి అవగాహన కల్పించడం మొదలుపెట్టింది. పెద్ద పెద్ద యూనివర్సిటీలు, ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థల్లో వర్క్‌షాపులు నిర్వహించింది.

**అభాగ్యులకు అసరా**

తన పరిశ్రమలో పలువురు తయారీదారులను నియమించుకుంది. అందులోనూ వివిధ ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న అభాగ్యులకు కార్మేసీలో ఉద్యోగం ఇచ్చి తనకు వచ్చే లాభాల్లో వారికీ వాటా కూడా ఇస్తున్నది. ఆడవారి సమస్యకు పరిష్కారం చూపడమే కాకుండా తన వ్యాపారంలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించడం నిజంగా అభినందనీయం.



# వ్యవసాయ పాఠశాల

**విద్యార్థులకు రాను రానూ పౌష్టికాహారం కరువవుతున్న పరిస్థితి. ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల వంటి వాటివల్ల ఆఅనారోగ్యలకు దగ్గరవుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు. పాఠశాల ఖాళీ స్థలంలో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ.. విద్యార్థుల ఆరోగ్యానికి హామీ ఇస్తున్నారు.**



**గుం**టూరు జిల్లా అత్తోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులే వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి సేద్యంలో పండించిన పంటలను వారే ఇండ్లకు తీసుకెళ్లి.. రోజూ పౌష్టికాహారాన్ని తింటున్నారు. ఇందుకు పాఠశాల యాజమాన్యంతో పాటు.. అభ్యుదయ రైతు బాపారావు విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులే స్వయంగా ప్రకృతి పంటలను పండించే విధంగా.. 'బడి పంట' కార్యక్రమాన్ని కలిసికట్టుగా నిర్వహిస్తూ పిల్లల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్నారు. దీనివల్ల ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన పెంచుకుంటున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా పండించిన కూరగాయలు, ఆకుకూరలను తినడం వల్ల పిల్లలు ఆరోగ్యకరంగా ఎదుగుతారని రాబోయే కాలంలో ఎవరైనా విద్యను ఆపేసి సేద్యం వైపు వెళ్లేవారు, రసాయనాల జోలికి పోకుండా ప్రకృతి వ్యవసాయం చేయడానికి వీలుంటుందని బాపారావు అంటున్నారు. పర్యావరణ విద్యలో భాగంగా సహజ పద్ధతిలో తయారుచేసిన వర్మీ కంపోస్ట్, జీవామృతాలను ఎరువులుగా ఉపయోగిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల పుట్టినరోజున మొక్కలు నాటుతున్నారు. అటవీ సంరక్షణతో పాటు పచ్చదనం, పరిశుభ్రత వంటి నైతిక విలువలు ఈ పాఠశాలలో నేర్పుతున్నారు. కేవలం చదువు, ఆటలే కాకుండా ఆరోగ్యం కోసం తామే పంటలు పండించుకోవడం చాలా ఆనందాన్నిస్తుందని అత్తోట పాఠశాల విద్యార్థులు అంటున్నారు. రసాయనాలు కలిసిన ఆహారం వల్ల తమ ఆరోగ్యాలు దెబ్బతిని చదువులు ఆగిపోతున్నాయని.. తామెప్పుడైతే ప్రకృతి విధానంలో జీవామృతాలను ఎరువులుగా వాడుతూ వ్యవసాయం చేస్తున్నామో అప్పటి నుంచి యాక్టివ్‌గా ఉంటున్నామని చెబుతున్నారు. విషయమేంటంటే... ఈ పాఠశాలలో పండించిన ఆకుకూరలు విద్యార్థులే వంతుల వారీగా తీసుకెళ్తారు. ఏదైనా పెద్ద పంటలు వేసినప్పుడు.. ఆ పంటద్వారా వచ్చే దిగుబడితో స్కూల్‌కు కావల్సిన మౌలిక వసతులు సమకూర్చుకుంటారు. సీజన్ మొదలైన దగ్గర్నుంచి.. విత్తనాలు చల్లడం, కలుపు తీయడం, ఎరువులు తయారు చేయడం వంటి పనులన్నీ విద్యార్థులే చేస్తుండడం గమనార్హం. విద్యార్థులు ఇలా ప్రకృతితో మమేకమై వ్యవసాయం చేస్తుండడాన్ని వారి తల్లిదండ్రులు స్వాగతిస్తున్నారు. గుంటూరు జిల్లా వ్యవసాయ, విద్యాధికారులు అత్తోట పాఠశాల వ్యవసాయ పద్ధతిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.





# అందానికి ఫలసాయం

**అందం కోసం అనేక లోషన్‌లు, క్రీమ్స్ వాడడమూ సహజమే. అవేమీ అక్కర్లేకుండా మనం తీసుకునే ఆహారంతో కూడా చర్మ ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు. కాలుష్యం కారణంగా చర్మం పొడిబారడం, చర్మం ముడతలు పడడం వల్ల కాంతిహీనంగా కనిపిస్తుంటారు. అయితే ఇలాంటి సమస్యలన్నింటికీ పండ్లు కూరగాయలే పరిష్కారం చూపుతాయి.**

- కివీ పండు విటమిన్-సితో పాటు యాంటీ ఆక్సిడెంట్‌ను సమృద్ధిగా కలిగి ఉంటుంది. ఇది చర్మానికి కావాల్సిన పోషకాలను అందించి చర్మం మీది ముడతలను నివారిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఏజింగ్ లక్షణాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.
- తరచుగా దానిమ్మ గింజలు, దానిమ్మ జ్యూస్ తీసుకోవడం వల్ల ఇది చర్మకణాలకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది. దానిమ్మ చర్మాన్ని బిగుతుగా మార్చే యాంటీ ఏజింగ్ లక్షణాలను సమృద్ధిగా కలిగి ఉంటుంది. ఇది చర్మానికి కావాల్సిన పోషణను అందిస్తుంది. ముఖ చర్మం మెరిసిపోయేలా చేస్తుంది.
- పుచ్చకాయ చర్మానికి కావాల్సిన పోషకాలను అందించి చర్మం ముడతలు పడకుండా నివారిస్తుంది. ఇది చర్మానికి కావాల్సిన తేమను అందించి డీహైడ్రేషన్ బారిన పడకుండా చేస్తుంది. పుచ్చకాయ గింజల్లో కూడా చర్మ సౌందర్యానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి.
- యాపిల్‌లో చర్మం ముడతల సమస్యను ఎదుర్కొనే లక్షణాలు అధికంగా ఉంటాయి. తరచూ యాపిల్ తిన్నా లేదా గుజ్జును చర్మానికి అప్లై చేసుకున్నా వృద్ధాప్యపు గుర్తులను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉన్న పోషకాలు, యాంటీ ఏజింగ్ లక్షణాలు చర్మాన్ని తాజాగా ఉంచుతాయి.

# అరచేతుల్లో చెమట తగ్గేదెలా?

అడుగండి చెబుతా



**నా వయసు 32 ఏళ్లు. ఇతరత్రా ఆరోగ్య సమస్యలేమీ లేవుగానీ.. అరచేతుల్లో చెమటలు, కొంచెం ఎక్కువ ఘాటు ఆహార పదార్థాలు తిన్నప్పుడు తల భాగమంతా విపరీతమైన చెమట వస్తుంది. అరచేతుల్లో చెమట వల్ల నా వృత్తి జీవితం చాలా ఇబ్బందిగా ఉంటున్నది. తోటి ఉద్యోగులకు షేక్ హ్యాండ్ ఇవ్వాలన్నా బిడియంగా ఉంటుంది. పెన్నుతో కాసేపు రాసినా చెమట వల్ల పేపర్లు తడుస్తాయి. కంప్యూటర్‌లో టైప్ చేసినా, టీవీ రిమోట్ ఎక్కువ సేపు పట్టుకున్నా మొత్తం చెమటతో ముద్దయిపోతాయి. మందులు వాడినా ఫలితం లేదు. సరైన పరిష్కారం తెలుపగలరు.**

**- పి. జానకిరామ్, నిజామాబాద్**

**ఈ** సమస్యను హైపర్ హైడ్రోసిస్ అంటారు. చూడ్డానికి ఇది చిన్న సమస్యగానే కనిపించినా సమస్య అనుభవించేవారికి అది పెద్ద సమస్యే. మరి కొంతమందికి షేక్‌హ్యాండ్ ఇచ్చేటప్పుడు, పరీక్షలు రాసే సందర్భాలలో ఈ సమస్య మరింత అసౌకర్యానికి లోను చేస్తూ, ఆత్మన్యూనతను కలిగిస్తూ ఉంటుంది. ఈ సమస్య ఉన్న వాళ్లు ల్యాప్‌టాప్‌ను వాడలేరు. అయితే ఈ సమస్య దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెట్టేంత తీవ్రంగా ఉంటే అలక్ష్యం చేయకుండా సర్జరీ ద్వారా సరిదిద్దుకునే వీలుంది. మెదడు నుంచి వెన్నెముక పక్కగా చేతుల్లోకి సాగే చెమటకు కారణమయ్యే సింపథెటిక్ నాడులను ఇన్వేసివ్ సర్జరీ ద్వారా కత్తిరించి క్లంప్ వేయడం ద్వారా సమస్యను అదుపు చేయవచ్చు. ఈ సర్జరీని వైద్యపరిభాషలో సింపథెటికమీ అంటారు. సర్జరీతో ఈ సమస్య వెంటనే నయమవుతుంది. మీరు హైదరాబాద్ వచ్చి ఒక మంచి థొరాసిక్ సర్జన్‌ని కలవండి. మీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



**డాక్టర్**
**కె. బాలసుబ్రమణియం**
సీనియర్ మినిమల్లీ ఇన్వేసివ్ లంగ్ అండ్ రోబోటిక్ థొరాసిక్ సర్జన్,యశోద హాస్పిటల్స్
హైదరాబాద్

## వంటింటి చిట్కాలు



- ఫ్రిజ్‌లో ఉంచిన నిమ్మకాయలను పది నిమిషాలు వేడి నేటిలో వేసి ఆ తర్వాత కోస్తే ఎక్కువ రసం వస్తుంది.
- ఇన్‌స్టంట్ కాఫీ పొడిని గాలి చొరబడని డబ్బాలో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో ఉంచితే గడ్డ కట్టకుండా ఉంటుంది.
- చెక్కగరిటెలు, స్పూన్లు వెనిగర్ కలిపిన నీటిలో ఉంచి ఆ తర్వాత వాడితే వాసన రాకుండా ఉంటాయి.
- గారెలు, వడలు చేసేటప్పుడు నూనె చిందకుండా ఉండాలంటే నూనెలో కొద్దిగా నెయ్యి కలపాలి.
- పెనానికి ఉన్న జిడ్డు వదలకుండా ఉంటే వేడి నీళ్లలో పెనాన్ని రెండు గంటలు ఉంచి ఆ తర్వాత నిమ్మ చెక్కతో రుద్దితే జిడ్డు వదులుతుంది.
- అల్లం, వెల్లుల్లిని కాగితంలో పొట్లం కట్టి ఉంచితే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- చేప ముక్కలను కొంచెం ఉప్పు కలిపి డీప్ ఫ్రిజ్‌లో పెడితే నిల్వ ఉంటాయి. ముక్కలు అంటుకోకుండా ఉంటాయి.

# సిరిముగ్గు

**11 చుక్కలు, సంధుచుక్క 6 వచ్చేవరకు**



**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

**సుమతి ఉన్నవ,**
విద్యానగర్,
హైదరాబాద్



నమస్తే తెలంగాణ
# నిపుణ
[ కరీంనగర్ ]
సోమవారం 16 డిసెంబర్ 2019

# అవార్డులు-2019

వ్యక్తులు, సంస్థలు వివిధ రంగాల్లో సమాజానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఇచ్చేవే అవార్డులు, పురస్కారాలు. ఆయా సేవలను గుర్తిస్తూ రాష్ట్రం మొదలుకొని ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థలు ప్రతి ఏటా అవార్డులను ప్రదానం చేస్తున్నాయి. వాటిలో దేశంలో అత్యున్నతమైన భారత రత్న, దాదాసాహెబ్, సాహిత్య, రాజీవ్ ఖేల్‌రత్న, జ్ఞాన్‌పీఠ్, అంతర్జాతీయంగా నోబెల్, ఆస్కార్, బుకర్, రామన్ మెగసెసె, లారెస్ స్పోర్ట్స్ అవార్డుల వంటివి ఉన్నాయి. ఈ ఏడాది ఆయా సంస్థలు, వ్యక్తులు అందుకున్న ప్రముఖ పురస్కారాలకు సంబంధించిన వివరాలు నిపుణ పాఠకులకోసం..

## నోబెల్

- ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారం నోబెల్. వినూత్న ఆవిష్కరణలు, వివిధ రంగాల్లో విశేష కృషిచేసినవారికి ఈ బహుమతిని ప్రతి ఏటా ప్రకటిస్తారు. 1901లో ప్రారంభమైన ఈ అవార్డుల ప్రదానం ఇప్పటికీ కొనసాగుతున్నది. 1969 నుంచి అర్థశాస్త్రంలో విశేష కృషి చేసినవారికి నోబెల్ అందిస్తున్నారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.
- వైద్యరంగంలో.. విలియమ్ జీ కెలిన్ జూనియర్, సర్ పీటర్ జే రాట్‌క్లిఫ్, గ్రెగ్ ఎల్ సెమెన్జా
- ఫిజిక్స్‌లో.. జేమ్స్ పీబుల్స్ (అమెరికా), మిచెల్ మేయర్ (స్విట్జర్లాండ్), డిడియర్ క్యులోజ్ (స్విట్జర్లాండ్)



- కెమిస్ట్రీలో.. జాన్ బీ గుడ్‌ఇనఫ్ (జర్మనీ), ఎం స్టాన్లీ విటింగ్‌హామ్ (బ్రిటన్), అకిరా యోషినో (జపాన్)
- సాహిత్యంలో.. 2018, 19కి సంబంధించిన పురస్కారాలను నోబెల్ కమిటీ ప్రకటించింది. 2018కి గాను రచయిత్రి ఓల్గా టోకార్క్యజుక్ (పోలండ్), 2019కిగాను నవల, నాటక రచయిత పీటర్ హండ్కె (ఆస్ట్రియా)కి లభించింది.
- ఇప్పటివరకు సాహిత్యంలో 15 మంది మహిళలు మాత్రమే నోబెల్ అందుకున్నారు.
- నోబెల్ శాంతి.. ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్
- అర్థశాస్త్రంలో.. అభిజిత్ బెనర్జీ (భారతీయ అమెరికన్), ఎస్తర్ డఫ్లో (ఫ్రెంచ్ అమెరికన్), మైకేల్ క్రెమెర్ (అమెరికన్)
- ఇప్పటివరకు ఆర్థిక నోబెల్ అందుకున్న వారిలో డఫ్లో అత్యంత పిన్నవయస్సు కలిగిన వ్యక్తిగా, రెండో మహిళగా రికార్డుల్లోకెక్కారు. అర్థశాస్త్రంలో మొదటిసారిగా నోబెల్ బహుమతిని ఎలినార్ ఓస్ట్రమ్ 2009లో అందుకున్నారు.




## భారత అత్యున్నత పురస్కారాలు

- **భారత రత్న:** 2019కిగాను భారతదేశ అత్యున్న పురస్కారం మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, అస్సామీ వాగ్గేయకారుడు భూపేన్ హజారికా (మరణానంతరం), జనసంఘ్ నాయకుడు నానాజీ దేశ్‌ముఖ్ (మరణానంతరం)లకు లభించింది. దీంతో ఈ అవార్డు పొందిన వారి సంఖ్య 48కి చేరింది. నాలుగేండ్ల తర్వాత (2015లో) కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డులను ప్రకటించింది.
- **పద్మ అవార్డులు:** తీజన్ బాయి, అనిల్‌కుమార్ మనిభాయ్ నాయక్, బల్వంత్ మోరేశ్వర్ పురందర్, ఇస్మాయిల్ ఒమర్ గులేహ్ (విదేశీయుడు)లకు పద్మవిభూషణ్, సుఖ్‌దేవ్‌సింగ్ ధిండ్సా, జాన్ చాంబర్స్, ఎస్ నంబి నారాయణ్, కరియా ముండాతో సహా 14 మందికి పద్మ భూషణ్, సునీల్ ఛెత్రి, రాజేశ్వర్ ఆచార్య, మనోజ్ బాజ్‌పాయ్, జ్యోతి భట్, ప్రభుదేవా, శంకర్ మహదేవన్ నారాయణ్, అజయ్ ఠాకూర్‌తో సహా 94 మందికి పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి గీతా మెహతా పద్మశ్రీ అవార్డును తిరస్కరించారు.



## గోల్డెన్ గ్లోబ్

- 76వ గోల్డెన్ గ్లోబ్ అవార్డులను లాస్ ఏంజెల్స్‌లో జనవరి 7న ప్రదానం చేశారు. సినిమా, అమెరికా టీవీ షోలకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులను ప్రతి ఏటా అందిస్తారు. 2018కిగాను బెస్ట్ ఫిల్మ్ (డ్రామా)గా బొహిమియన్ రాప్సోడి, బెస్ట్ ఫిల్మ్ (కామెడీ/మ్యూజికల్)గా గ్రీన్ బుక్, బెస్ట్ యాక్టర్ (ఫిల్మ్ డ్రామా)గా రామీ మాలెక్ (బొహిమియన్ రాప్సోడి), బెస్ట్ యాక్టర్ (ఫిల్మ్ డ్రామా)గా గ్లెన్ క్లోజ్ (ది వైఫ్), ఉత్తమ నటుడు (కామెడీ/మ్యూజికల్) క్రిస్టియన్ బాలె (వైస్), ఉత్తమ నటి (కామెడీ/మ్యూజికల్)గా ఒలివియా కోల్‌మన్ (ది ఫేవరెట్) అవార్డులు అందుకున్నారు.

## రామన్ మెగసెసె

- ఆసియా నోబెల్‌గా పిలిచే ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసె అవార్డును ప్రముఖ జర్నలిస్ట్ రవీష్‌కుమార్ సెప్టెంబర్ 9న అందుకున్నారు. 2019కి గాను రవీష్‌తోపాటు జర్నలిస్ట్ కోస్వీ విన్ (మయన్మార్), సామాజిక కార్యకర్తలు ఆంగ్‌ఖానా నీలప్‌జిత్ (థాయిలాండ్), కిమ్ జోంగ్ కి (దక్షిణ కొరియా), సంగీత కళాకారుడు రేముండో పూజంతే (ఫిలిప్పీన్స్)లకు లభించింది.
- ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రామన్ మెగసెసె జ్ఞాపకార్థం 1957లో ఈ అవార్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సేవలు, ప్రజాసేవ, సామాజిక న్యాయం, జర్నలిజం, సాహిత్యం, సృజనాత్మక కళలు, ప్రపంచ శాంతి, అత్యుత్తమ నాయకత్వ లక్షణాల వంటి అంశాల్లో కృషి చేసినవారికి ఈ అవార్డును ప్రతిఏటా ప్రదానం చేస్తున్నారు.
- ఈ అవార్డును పొందిన మొదటి భారతీయుడు ఆచార్య వినోబా భావే. 1958లో సామాజిక నాయకత్వం విభాగంలో ఈ అవార్డు అందుకున్నారు.

## బుకర్ ప్రైజ్

- ఆంగ్ల కాల్పనిక సాహిత్యంలో ఇచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డు బుకర్ ప్రైజ్-2019ను కెనడియన్ రచయిత మార్గరెట్ ఎట్‌వుడ్, ఆంగ్లో నైజీరియన్ రచయిత బెర్నార్డైన్ ఎవరిస్టోలు అక్టోబర్ 15న సంయుక్తంగా అందుకున్నారు. 'గర్ల్, ఉమన్, అదర్' అనే నవలకుగాను ఎవరిస్టోకు, 'ది టెస్టమెంట్' నవలకుగాను ఎట్‌వుడ్‌కు ఈ అవార్డు దక్కింది. దీంతో ఈ అవార్డు అందుకున్న తొలి నల్లజాతి మహిళగా ఎవరిస్టో గుర్తింపు పొందింది.
- కాల్పనిక సాహిత్యానికిచ్చే అత్యున్నత అవార్డు బుకర్ ప్రైజ్. దీన్ని 1969లో ప్రారంభించారు. 1992 తర్వాత తొలిసారి ఇద్దరు విజేతలను ప్రకటించారు.
- ఆంగ్లసాహిత్యంలోకి అనువాదమైన ఉత్తమ నవలకు అందించే మ్యాన్ బుకర్ ప్రైజ్‌ను ఈ ఏడాది ఒమన్‌కు చెందిన అరబిక్ రచయిత్రి జోఖా అల్‌హర్తి అందుకున్నారు. ఆమె రాసిన 'సెలస్టియల్ బాడీ' నవలకుగాను ఈ అవార్డు లభించింది. దీంతో ఈ అవార్డును గెలుచుకున్న తొలి అరబ్ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ఈ నవలను మార్లిన్ బూత్ ఇంగ్లిష్‌లోకి అనువదించారు. ఈ అవార్డు కింద ఇచ్చే రూ.44.60 లక్షలను అల్‌హర్తి, అనువాదకురాలు మార్లిన్ చెరిసగం పంచుకున్నారు. ఈ అవార్డును 2005లో ప్రారంభించారు. 2002 నుంచి బుకర్ ప్రైజ్‌కు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న మ్యాన్ గ్రూప్ ఈ ఏడాది తప్పుకున్నది.

## శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు

- శాస్త్ర సాంకేతిక రంగాల్లో అత్యంత ప్రతిభకనబర్చిన వారికి ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు-2019ను సెప్టెంబర్ 27న ప్రదానం చేశారు.
- జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, మ్యాథ్స్, మెడిసిన్, ఫిజిక్స్‌లలో విశేష కృషి చేసినవారికి కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) ఈ అవార్డులను ప్రతి ఏటా అందిస్తున్నది.
- జీవశాస్త్రంలో డా. కయరత్ సాయికృష్ణన్, డా. సౌమిన్ బసక్, రసాయన శాస్త్రంలో డా. బీ రాఘవన్, బీ సునోజ్, పర్యావరణ శాస్త్రంలో సుబిమాల్ ఘోష్, ఇంజినీరింగ్ సైన్సెస్‌లో మాణిక్ వర్మ, మ్యాథమెటికల్ సైన్సెస్‌లో దిశాంత్ మయూర్ భాయ్ పంచోలి, డా. నీనా గుప్త, మెడికల్ సైన్సెస్‌లో డా. ధీరజ్ కుమార్, డా. మహమ్మద్ జావేద్ అలీ, ఫిజికల్ సైన్సెస్‌లో డా. అనింద సిన్హా అందుకన్నారు.
- సీఎస్ఐఆర్‌ను స్థాపించిన శాంతి స్వరూప్ పేరుమీదుగా ఈ అవార్డులను 1958 నుంచి ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు రూ.5 లక్షలు, వారికి 65 ఏండ్లు వచ్చే వరకు ప్రతి నెల రూ.15వేలు అందిస్తారు.




## గాంధీ శాంతి బహుమతి

- 2015 నుంచి 2018 వరకు నాలుగేండ్ల కాలానికి గాంధీ శాంతి పురస్కారాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఫిబ్రవరి 26న ప్రదానం చేశారు. గాంధీ సిద్ధాంతాలు, పద్ధతుల ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పు కోసం కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ పురస్కారం అందిస్తారు. 1995 నుంచి ఇస్తున్న ఈ బహుమతి కింద రూ.కోటి నగదుతోపాటు ప్రశంసాపత్రం ఇస్తారు.
- 2018కిగాను యోహీ ససకవా (డబ్ల్యూహెచ్‌ఓ సౌహార్ధ రాయబారి), 2017కుగాను ఏకల్ అభియాన్ ట్రస్ట్, 2016కు అక్షయపాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషన్‌లకు సంయుక్తంగా, 2015కుగాను వివేకానంద కేంద్రానికి (కన్యాకుమారి) ఈ పురస్కారం లభించింది.

## దాదాసాహెబ్ ఫాల్కే

- సినిమారంగంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ అందుకున్నారు. భారతీయ సినిమా రంగానికి చేసిన కృషికి గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. సాత్ హిందుస్థానీ సినిమాతో ఆయన తన నట జీవితాన్ని ప్రారంభించారు.

## లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డులు

- ప్రతిష్ఠాత్మక క్రీడా పురస్కారమైన లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డులను ఫిబ్రవరి 18న ప్రదానం చేశారు. స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ద ఇయర్ నొవాక్ జకోవిక్ (సెర్బియా-టెన్నిస్), స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్ సైమన్ బైలెస్ (యూఎస్‌ఏ- జిమ్నాస్టిక్స్), కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్ టైగర్ వుడ్స్ (యూఎస్‌ఏ-గోల్ఫ్), బ్రేక్ త్రూ ఆఫ్ ద ఇయర్ నవోమి ఒసాకా (జపాన్-టెన్నిస్), టీమ్ ఆఫ్ ద ఇయర్ ఫ్రాన్స్ (ఫుట్‌బాల్), లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆర్సెనె వెన్‌గర్ (ఫ్రాన్స్)
- 2018లో సాధించిన విజయాలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపికచేశారు.

## సాహిత్య అకాడమీ

- కేంద్ర సాహిత్య అకాడమీ అందించే బాల సాహిత్య, యువ పురస్కారాలను తెలంగాణకు చెందిన గడ్డం మోహన్ రావు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బెలగం భీమేశ్వరరావు అందుకున్నారు. 35 ఏండ్లలోపు రచయితలకు ఇచ్చే యువ పురస్కాన్ని 'కొంగవాలు కత్తి' నవలకు గాను మోహన్‌రావు, 'తాత మాట వరాల మూట' చిన్న కథల పుస్తకం రాసిన భీమేశ్వరరావు బాల సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. మొత్తంగా దేశంలోని గుర్తింపుపొందిన 22 భాషలకు సంబంధించిన 22 మంది రచయితలు బాల సాహిత్య పురస్కారాలు, 23 మంది యువ పురస్కారాలను అందుకున్నారు.
- 2018కుగాను మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కవి అప్పరసు కృష్ణారావు సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆయన రాసిన 'గుప్పెడు సూర్యుడు-మరికొన్ని కవితలు' అనే అనువాద కవితా సంపుటికి ఈ పురస్కారం లభించింది.

## జ్ఞానపీఠ్ పురస్కారం



- సాహిత్యరంగంలో అత్యున్నత పురస్కారమైన జ్ఞానపీఠ్ ప్రముఖ మలయాళ కవి అక్కితమ్ అచ్యుతన్ నంబూద్రి అందుకున్నారు. ఇది 55వ జ్ఞానపీఠ్ పురస్కారం. మలయాళ సాహితీవేత్తల్లో ఒకరైన ఆయన ఇప్పటివరకు 55 పుస్తకాలు రాశారు. ఈ పురస్కార గ్రహీతలకు రూ.11 లక్షల నగదు, సరస్వతీదేవి కాంస్య విగ్రహం ప్రదానం చేస్తారు. 54వ జ్ఞాన్‌పీఠ్ అవార్డు ప్రముఖ రచయిత అమితవ్ ఘోష్‌కు లభించింది.
- ఈ అత్యున్నత పురస్కారాన్ని 1965లో తొలిసారి మలయాళ రచయిత జీ శంకర కురుప్ 'జదక్కుజల్' అనే పుస్తకానికిగాను అందుకున్నారు. జ్ఞానపీఠ్ అందుకున్న తొలి మహిళ ఆశాపూర్ణాదేవి (1976). బెంగాలీ రచయిత్రి అయిన ఆమె తన 'ప్రథమ్ ప్రతిశ్రుతి' అనే నవలకు అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా (1970) విశ్వనాథ సత్యనారాయణ (రామాయణ కల్పవృక్షం) అందుకోగా, తర్వాత 1988లో సీ నారాయణ రెడ్డి (విశ్వంభర), 2012లో రావూరి భరద్వాజకు జ్ఞానపీఠ్ లభించింది.

## ఇందిరాగాంధీ పురస్కారం

- 2018, 2019 సంవత్సరాలకు ఇందిరాగాంధీ శాంతి బహుమతిని ఇందిరాగాంధీ స్మారక ట్రస్ట్ నవంబర్ 19న ప్రదానం చేసింది. 2019కిగాను బ్రిటన్‌కు చెందిన పర్యావరణ వేత్త డేవిడ్ అటెన్‌బరో, 2018కిగాను సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) డైరెక్టర్ సునీతా నారాయన్ అందుకున్నారు.
- 2017-18కిగాను ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు చండీప్రసాద్ భట్ ఇందిరాగాంధీ జాతీయ సమైక్య అవార్డును అందుకున్నారు. అవార్డు కింద ఆయనకు రూ.10 లక్షల నగదును అందజేశారు.



## ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు

- నర్సింగ్ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారం 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు'-2019ను అస్కా సలోమీ అందుకున్నారు. ఆమె 2009లో గాంధీ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేశారు. కేరళకు చెందిన లీని సజీష్ (మరణానంతరం)తోసహా మొత్తం 36 మందికి ఈ అవార్డులు లభించాయి. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం అయిన డిసెంబర్ 5న ఈ అవార్డులను ప్రదానం చేశారు.
- నర్సింగ్ రంగంలో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా 1973 నుంచి ప్రతి ఏటా ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) 2020ని 'ఇయర్ ఆఫ్ నర్సెస్ అండ్ మిడ్‌వైవ్స్'గా ప్రకటించింది.

## తెలంగాణ సాహిత్య అకాడమీ

- తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి పురస్కారాలను మే 2న ప్రదానం చేశారు. ఉత్తమ వచన రచనా విభాగంలో ఉప్పల నరసింహం (మట్టి మనిషి-కథా సంపుటి), కవితా విభాగంలో సిద్ధార్థ (బొమ్మల బాయి) అవార్డులు అందుకున్నారు.

## దాశరథి పురస్కారం

- ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య పేరుతో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 'దాశరథి' అవార్డును ప్రముఖ కవి కూరెళ్ల విఠలాచార్య అందుకున్నారు. ఈ అవార్డును 2015లో తిరుమల శ్రీనివాసాచార్య, 2016లో బాపురెడ్డి, 2017లో ప్రొ. ఎన్ గోపి, 2018లో వజ్జల శివకుమార్ అందుకున్నారు.
- సాహిత్యరంగంలో విశేష కృషిచేసిన వారికి దాశరథి జన్మదినం సందర్భంగా జూలై 22న 2015 నుంచి ప్రతి సంవత్సరం ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. ఈ అవార్డు కింద రూ. 1,01,116తోపాటు జ్ఞాపిక అందజేస్తారు.
- ప్రతిష్ఠాత్మక సరస్వతీ సమ్మాన్ పురస్కారం-2018ను ప్రముఖ కవి కే శివారెడ్డి అందుకున్నారు. ఆయన రాసిన 'పక్కకి ఒత్తిగిలితే' అనే కవితా సంపుటికి ఈ అవార్డు దక్కింది. దీంతో ఈ అవార్డు అందుకున్న తొలి తెలుగు రచయితగా ఆయన నిలిచారు. 1991 నుంచి కేకే బిర్లా ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నది.

## మోదీకి అవార్డులు

- ప్రజలు, ప్రయోజనం, ప్రపంచం (పీపుల్, ప్రాఫిట్, ప్లానెట్) కోసం కృషి చేసిన దేశాధినేతలకు ప్రతి ఏటా ఇచ్చే ఫిలిప్ క్లాటర్ పురస్కారం- 2019ను ప్రధాని మోదీ జనవరి 14న అందుకున్నారు. ప్రముఖ ఆర్థికవేత్త, అమెరికన్ ప్రొఫెసర్ ఫిలిప్ క్లాటర్ పేరుతో ఈ అవార్డును నెలకొల్పారు.
- రష్యా అత్యున్నత పౌరపురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోసల్'ను ప్రధాని మోదీ ఏప్రిల్ 12న అందుకున్నారు. భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసినందుకుగాను రష్యా ఈ అవార్డును ప్రకటించింది.
- యూఏఈ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ జాయెద్' ఆగస్టు 24న ప్రధాని మోదీ అందుకున్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపొందించడానికి కృషి చేసినందుకుగాను ఆయనకు ఆ దేశ యువరాజు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఈ పురస్కారం ప్రదానం చేశారు.
- ప్రధాని మోదీకి బహ్రెయిన్ అత్యున్నత పురస్కారం 'కింగ్ హమద్ ఆర్డర్ ఆఫ్ ద రినైజాన్స్'ను ఆ దేశ రాజు హమద్ బిన్ సల్మాన్ అల్ ఖలీఫా ఆగస్టు 25న ప్రదానం చేశారు.
- బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ప్రతి ఏటా ఇచ్చే 'గ్లోబల్ గోల్‌కీపర్ పురస్కారం- 2019'ను ప్రధాని మోదీ సెప్టెంబర్ 24న అందుకున్నారు. స్వచ్ఛభారత్ అభియాన్ అమలులో చిత్తశుద్ధి, కార్యదక్షతకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## ఆస్కార్

- చలనచిత్ర రంగంలో ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారం ఆస్కార్. 2018కిగాను ఈ అవార్డులను అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ (ఏఎంపీఏఎస్) ఫిబ్రవరి 25 ప్రకటించింది. గ్రీన్ బుక్ (ఉత్తమ చిత్రం), అల్ఫాన్సో క్వేరాన్ (రోమా-ఉత్తమ డైరెక్టర్), రమీ మాలిక్ (ఉత్తమ నటుడు-బొహెమియన్ రాప్సోడి), ఒలీవియా కోల్మన్ (ఉత్తమ నటి- ద ఫేవరెట్), భారతీయ డాక్యుమెంటరీ పీరియడ్: ఎండ్ ఆఫ్ సెంటెన్స్ (ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్), ఫ్రీ సోలో (డాక్యుమెంటరీ ఫీచర్) సినిమాలు 91వ ఆస్కార్ అవార్డులను సొంతం చేసుకున్నాయి. 1929 నుంచి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు.



## గ్రామీ అవార్డులు

- సంగీత ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది 'గ్రామీ' అవార్డు. 2018కి సంబంధించిన అవార్డులను 2019 ఫిబ్రవరి 11న ప్రదానం చేశారు. ప్రముఖ గాయని కసే ముస్ గ్రేవ్స్‌కు చెందిన ఆల్బమ్ 'గోల్డెన్ అవర్' ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్, బెస్ట్ కంట్రీ ఆల్బమ్, బెస్ట్ కంట్రీ సాంగ్, బెస్ట్ కంట్రీ సోలో పెర్‌ఫార్మెన్స్ విభాగాల్లో అవార్డులు అందుకోగా, ఆఫ్ ది ఇయర్‌గా, బెస్ట్ ర్యాప్‌గా దిస్ ఈజ్ అమెరికా సాంగ్ (చైల్డిష్ గాంబినో), బెస్ట్ రాక్ ఆల్బమ్‌గా ఫ్రమ్ ద ఫైర్స్ (గ్రెటా వ్యాన్ ఫ్లీట్) నిలిచింది.
- ప్రధానంగా ఇంగ్లిష్ సంగీత పరిశ్రమలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి వీటిని ప్రదానం చేస్తారు. 'ద రికార్డింగ్ అకాడమీ' అందించే ఈ పురస్కారాలను గ్రామఫోన్ అవార్డులు అనికూడా అంటారు. ఈ అవార్డులను మొదటిసారి 1959, మే 4న కాలిఫోర్నియాలో ప్రదానం చేశారు. నేషనల్ అకాడమీ ఆఫ్ రికార్డింగ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ సంస్థ ఈ అవార్డులను అందిస్తుంది.
- 2019కి సంబంధించిన అవార్డులను 2020, జనవరి 26న ప్రకటిస్తారు.



## జాతీయ క్రీడా పురస్కారాలు

- వివిధ క్రీడల్లో చూపిన ప్రతిభకుగాను దేశంలోని క్రీడాకారులకు జాతీయ క్రీడా అవార్డులను ఆగస్టు 29న ప్రదానం చేశారు. ప్రముఖ క్రీడాకారుడు, హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకొంటున్నారు.
- దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారమైన రాజీవ్ ఖేల్‌రత్న-2019ను బజ్‌రంగ్ పునియా (రెజ్లింగ్), దీపా మాలిక్ (పారా అథ్లెట్) అందుకున్నారు.
- **అర్జున అవార్డు:** సాయిప్రణీత్ (బ్యాడ్మింటన్), రవీంద్ర జడేజా (క్రికెట్), అజయ్ ఠాకూర్ (కబడ్డీ), అంజుం మౌద్గిల్ (షూటింగ్), పూనమ్ యాదవ్ (క్రికెట్), స్వప్న బర్మన్ (అథ్లెటిక్స్)తో సహా 19 మంది ఈ అవార్డును అందుకున్నారు.
- **ద్రోణాచార్య అవార్డు:** విమల్ కుమార్ (బ్యాడ్మింటన్), సందీప్ గుప్తా (టేబుల్ టెన్నిస్), మొహిందర్ సింగ్ (అథ్లెటిక్స్)
- **ధాన్యచంద్ అవార్డ్:** మనోన్ కుమార్ (రెజ్లింగ్), మాన్యుయెల్ ఫ్రెడరిక్స్ (హాకీ), అరేప్ బసాక్ (టీటీ), లాల్ రెమ్‌సంగా (ఆర్చరీ), నితిన్ కీర్తనె (టెన్నిస్)
- రియో పారాలింపిక్స్ షాట్‌పుట్‌లో రజతం గెలిన దీపా మాలిక్, ఆ ఘనత సాధించిన తొలి మహిళా పారా అథ్లెట్‌గా నిలిచారు.

... గణేష్ సుంకరి




బోనకల్‌లో రైలు పట్టాలను కమ్మేసిన పొగమంచు

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** ఖమ్మం జిల్లాను ఆదివారం మంచుదుప్పటి కప్పేసింది. ఖమ్మం, వైరా, సత్తుపల్లి, మధిర, పాలేరు, బోనకల్లు ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల వరకు మంచుతెరలు వీడలేదు. దీంతో క్రీడాకారులు, పాలు, కూరగాయల వ్యాపారులు, వివిధ వృత్తులకు వెళ్లే ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్, వైరారోడ్, పెవిలియన్ గ్రౌండ్, సర్దార్‌పటేల్ స్టేడియం, ట్యాంక్‌బండ్ ప్రాంతాలు ఉదయకాలపు మంచులో అందాలొలికాయి. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. విజయవాడ వెళ్లే వాహనదారులు బోనకల్‌లో వాహనాలను నిలిపివేసి, మంచు తొలగిన అనంతరం ప్రయాణాలు కొనసాగించారు. బోనకల్ రైల్వేట్రాక్‌పై మంచు కురవడంతో విజయవాడ సికింద్రాబాద్ వెళ్లే పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. జిల్లాలో చలితీవ్రత నాలుగు రోజుల నుంచి పెరుగుతుండటంతో వృద్ధులు ఇబ్బందిపడుతున్నారు.

## స్పృహ కోల్పోయిన స్వాతి మలివాల్

- దవాఖానకు తరలింపు
- లైంగికదాడి దోషులకు వేగంగా శిక్ష అమలు కోసం దీక్ష చేస్తున్నమహిళా కమిషన్ చైర్‌పర్సన్



ఢిల్లీలోని ఎల్ ఎన్‌జేపీ దవాఖానలో చికిత్స పొందుతున్న స్వాతి మలివాల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** లైంగికదాడి దోషులకు ఆరు నెలల్లోగా శిక్షను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత 10 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ (డీసీడబ్ల్యూ) చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. స్పృహ కోల్పోయిన ఆమెను ఆదివారం ఉదయం దవాఖానకు తరలించారు. తొలుత శనివారం రాత్రి ఆమె ఆరోగ్యాన్ని పరీక్షించిన డాక్టర్లు పరిస్థితి చాలా తీవ్రంగా ఉన్నదని, వెంటనే దవాఖానలో చేరాలని సూచించారు. దీనికి ఆమె నిరాకరించారు. అయితే ఆదివారం ఉదయానికల్లా స్వాతి మలివాల్ స్పృహ కోల్పోవడంతో వెంటనే ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. డీసీడబ్ల్యూ సభ్యుడు ఒకరు మాట్లాడుతూ దవాఖానకు తరలించి చికిత్స అందించాక స్పృహలోకి వచ్చిన స్వాతి మలివాల్ ఫ్లూయిడ్స్ తీసుకోవడానికి నిరాకరించారని తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని చెప్పారు. స్వాతి మలివాల్‌ను దవాఖానకు తరలించిన విషయం తెలియగానే ఆమె మద్దతుదారులు భారీగా దవాఖాన వద్దకు చేరుకున్నారని పేర్కొన్నారు.



## బాలీవుడ్ నటి గీత కన్నుమూత

- గరమ్ హవా, షోలే, డిస్కోడాన్సర్ వంటి చిత్రాల్లో గుర్తింపు



గీతా సిద్ధార్థ కక్ (ఫైల్)

**ముంబై, డిసెంబర్ 15:** అలనాటి బాలీవుడ్ నటి గీతా సిద్ధార్థ కక్ శనివారం ముంబైలో కన్నుమూశారు. 1972లో గుల్జార్ చిత్రం పరిచయ్ ద్వారా ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. 1973లో దేశ విభజన అనంతర పరిణామాలపై ఎంఎస్ సాత్యు తీసిన గరమ్ హవాలో పాత్ర ద్వారా ప్రత్యేక గుర్తింపును పొందారు. ఈ సినిమాకు ఉత్తమ జాతీయ ఐక్యతా చిత్రం కేటగిరిలో జాతీయ అవార్డు లభించగా, అమీనా పాత్ర పోషించిన గీతా ప్రత్యేక స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. 1970-80 దశకంలో విడుదలైన పలు బాలీవుడ్ హిట్ చిత్రాలైన షోలే, త్రిశూల్, డిస్కో డాన్సర్, రామ్ తేరి గంగా మైలి, నూరియా, దేశ్ ప్రేమీ, డాన్స్ డాన్స్, కసమ్ పైదా కర్నే వాలే కి, షౌకీన్, అర్థ్, మండీ, ఏక్ చాదర్ మైలీ సి, గామన్ అండ్ దూసరా ఆద్మీ వంటి చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకున్నారు. ప్రముఖ టీవీ డాక్యుమెంటరీ నిర్మాత సిద్ధార్థ కక్‌తో ఆమె వివాహం జరిగింది. ఆయన వ్యాఖ్యాతగా ఉన్న 'సురభి' కార్యక్రమం 1990 నుంచి 2001 వరకు దూరదర్శన్‌లో ప్రసారమైంది. ఈ కార్యక్రమానికి ఆర్ట్ డైరెక్టర్‌గా గీతా వ్యవహరించారు. వీరి కుమార్తె అంతర కూడా పలు టీవీ డాక్యుమెంటరీలను నిర్మించారు. గీతా పలు సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆమె మరణం పట్ల సినీ, టీవీ ఆర్టిస్టుల సంఘంతోపాటు పలువురు సంతాపం తెలిపారు.

## రేపటినుంచి స్పీకర్లు, చైర్మన్ల సదస్సు

హాజరుకానున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పద్మారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో మంగళవారం నుంచి ఈ నెల 20 వరకు జరిగే అఖిల భారత చట్టసభల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభాపతులు, ఉపసభాపతుల సమావేశానికి రాష్ట్రానికి చెందిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసభాపతి టీ పద్మారావు, శాసనసభ, మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు హాజరుకానున్నారు. సదస్సులో లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షులు, పార్లమెంట్ ఉభయసభల సెక్రటరీ జనరల్స్, దేశంలోని అన్ని రాష్ట్రాల చట్టసభల ప్రిసైడింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొంటారు. మొదటిరోజు మంగళవారం రాష్ట్రాల చట్టసభల కార్యదర్శులు సమావేశమై చట్టసభల్లో వాడే అమర్యాదకర పదాల తొలగింపు నిబంధనలపై సమీక్షిస్తారు. తర్వాత చట్టసభలను సామాన్యుల దరిచేర్చడానికి మార్గాల అన్వేషణ అంశంపై చర్చిస్తారు. 18న ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్, స్పీకర్ల పాత్ర , చట్టసభల ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్టపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహిస్తారు. 19న అన్ని రాష్ట్రాల చట్టసభల్లో ఒకేవిధమైన పార్లమెంటరీ నిబంధనలను రూపొందించడం, సభలో తరుచూ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల అంశాలపై చర్చించనున్నారు.

## గోవులకు పది దుప్పట్లిస్తేనే తుపాకి లైసెన్స్

- చలినుంచి కాపాడేందుకు గ్వాలియర్ కలెక్టర్ ఆదేశాలు
- గతంలో మొక్కలు నాటి సెల్ఫీ పంపాలని నిబంధన

**గ్వాలియర్, డిసెంబర్ 15:** మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో మీరు తుపాకి లైసెన్సు పొందాలనుకుంటున్నారా? అయితే గోశాలలోని ఆవులను చలినుంచి కాపాడేందుకు పది దుప్పట్లను విరాళంగా అందించాల్సిందే. తుపాకి లైసెన్సులు తీసుకునేందుకు గ్వాలియర్ కలెక్టర్ అనురాగ్ చౌదరి ఈ మేరకు కొత్త నిబంధనలు అమలుచేయాలని ఆదేశాలు జారీచేశారు. గోలా కా మందిర్ ప్రాంతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే గోశాలలో విపరీతమైన చలి కారణంగా ఇటీవల ఆరు ఆవులు చనిపోయాయి. గోశాలను సందర్శించిన కలెక్టర్ గోవులను చలి నుంచి కాపాడేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గ్వాలియర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న లాల్ తిపారా ప్రాంతంలోని గోశాలను సైతం అనురాగ్ చౌదరి సందర్శించారు. ఈ ఏడాది జూన్‌లో చౌదరి.. తుపాకి లైసెన్సు పొందాలనుకునే వారు మొక్క నాటాలని, దాంతో సెల్ఫీ దిగి దరఖాస్తుకు జతపర్చాలని ఆదేశించారు. నెలపాటు ఆ మొక్కలను సంరక్షించాలని దరఖాస్తుదారుకు మార్గనిర్దేశం కూడా చేశారు. 'గోశాలలను సందర్శించిన అనంతరం కలెక్టర్.. తుపాకి లైసెన్సులు కోరేవారు రెండు గోశాలల్లోని ఆవుల కోసం పది దుప్పట్లు విరాళంగా అందించాలంటూ ఆదేశాలు జారీచేశారు' అని పీఆర్వో తెలిపారు. గోవులను చలి నుంచి కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కలెక్టర్ చెప్పారని పేర్కొన్నారు. గోలా కా మందిర్, లాల్ తిపారా ప్రాంతంలోని గోశాలల్లో మొత్తం 8 వేల ఆవులు ఉన్నాయి. గ్వాలియర్ జిల్లాలోని చంబల్ ప్రాంతం ఒకప్పుడు దోపిడీ దొంగలకు అడ్డాగా పేరుగాంచింది.



నేపాల్‌లోని సింధూపాల్‌చౌక్ జిల్లాలో లోయలోపడిన బస్సు ప్రమాద దృశ్యాలు

## నేపాల్‌లో ఘోర రోడ్డుప్రమాదం

- లోయలో పడిన బస్సు.. 14 మంది మృతి
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు

**కఠ్మాండు, డిసెంబర్ 15:** నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు లోయలో పడిపోవడంతో 14 మంది మరణించారు. వీరిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఈ దుర్ఘటన ఆదివారం సింధూపాల్‌చౌక్ జిల్లాలో చోటుచేసుకుంది. దాదాపు 40 మంది ప్రయాణికులతో దొలఖా జిల్లాలోని కాలించక్ ప్రాంతం నుంచి భక్తాపూర్ ప్రాంతానికి బస్సు బయలుదేరింది. అయితే మార్గమధ్యలో టైర్ జారిపోయి బస్సు అదుపు తప్పి లోయలో పడిపోయింది. దీంతో 12 మంది అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన 18 మంది చికిత్సపొందుతుండగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. పోలీసులు మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, వేగంగా బస్సును నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నదని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడని, అతడిని పట్టుకోవడానికి గాలిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులంతా యాత్రికులుగా తెలుస్తున్నదని పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని వివరించారు. కాగా సింధూపాల్‌ఛౌక్ జిల్లాలో కేవలం నెల వ్యవధిలో ఇలాంటి ప్రమాదం జరుగడం రెండోసారి. నవంబర్‌లో ఓ బస్సు సన్‌కోషి నదిలో పడటంతో 17 మంది మరణించారు.

# ఉల్లితో కనకవర్షం

నెలరోజుల్లోనే అప్పుల ఊబి నుంచి బయటపడిన ఉల్లి రైతు

తన అదృష్టాన్నే మార్చేసిందని సంబురపడుతున్న మల్లికార్జున

పెద్ద ఎత్తున లాభాలతో చిత్రదుర్గ జిల్లాలో సెలబ్రిటీగా మారిన కర్షకుడు



ఉల్లిరైతు మల్లికార్జున

**బెంగళూరు:** ఉల్లి కోస్తే కన్నీళ్లు రావడం దేవుడెరుగు.. బహిరంగ మార్కెట్లో ఉల్లి కొనాలంటేనే జనాలకు చుక్కలు కనిపిస్తున్నాయి. దేశంలో ఎక్కడ చూసినా కేజీ ఉల్లి రూ.100 పైమాటే పలుకుతున్నది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఏకంగా రూ.200కు చేరి కూర్చుంది. కొండెక్కిన ఉల్లి ధరలతో మధ్యతరగతి ఇబ్బంది పడిన మాట వాస్తవమే అయినప్పటికీ.. ప్రతి ఏటా నష్టాలు, పెట్టుబడులు రాబట్టుకోవడం కూడా తెలియని రైతులకు ఈ ఏడాది మంచి లాభాలను తెచ్చిపెడుతున్నాయి. సామాన్యులు ఒకవైపు ఆందోళన చెందుతుంటే.. ఉల్లి రైతులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పతాకస్థాయికి చేరిన ఉల్లిపాయల ధర పుణ్యమా అని కర్ణాటకకు చెందిన ఓ రైతు కరోడ్‌పతిగా మారారు. కేవలం నెలరోజుల వ్యవధిలో ఉల్లి పంటను వేసి అప్పుల ఊబి నుంచి బయటపడటమే కాకుండా కరోడ్‌పతిగా నిలిచారు. తన అదృష్టాన్ని ఉల్లి ఇలా మారుస్తుందని కలలో కూడాఅనుకోలేదంటున్నాడు చిత్రదుర్గ జిల్లాలోని దొడ్డసిద్ధవ్వనహళ్లికి చెందిన యువరైతు మల్లికార్జున. 'బ్యాంకు నుంచి రుణం తీసుకొని ఉల్లి పంట పండించాలని నిర్ణయం తీసుకొన్నాను. అయితే పంట పండకపోయినా.. మద్దతు ధర దొరక్కపోయినా దారుణంగా నష్టపోయేవాడిని. అయితే ఉల్లి నా కుటుంబం అదృష్టాన్నే మార్చేసింది. నెలరోజుల్లో 240 టన్నుల ఉల్లి పంట తీసి 20 ట్రక్కుల్లో మార్కెట్‌కు తరలించాను. ప్రస్తుతం కేజీ ఉల్లి ధర రూ.200గా ఉండటంతో మంచి లాభాలు వచ్చాయి' అని మల్లికార్జున వివరించారు. తప్పక రూ.5-10 లక్షల లాభం పొందుతానన్న ఆశాభావంతోనే మల్లికార్జున దాదాపు రూ.15 లక్షలు పెట్టుబడిగా పెట్టారు. తనకున్న 10 ఎకరాలకుతోడుగా మరో 10 ఎకరాలను కౌలుగా తీసుకొని 50 మంది కూలీలను పెట్టి ఉల్లి పంట పండించాడు. అయితే ప్రస్తుతం జనాల్ని దడ పుట్టిస్తున్న ఉల్లి.. మల్లికార్జునను కరుణించింది. అక్టోబర్ నెలలో క్వింటాల్ ఉల్లిని రూ.7 వేలకు అమ్మగా.. కొన్నిరోజుల వ్యవధిలోనే క్వింటాల్ ధర రూ.12 వేలకు చేరడంతో మెరుగైన లాభాలు వచ్చాయి. ఉల్లి పంటతో కరోడ్‌పతిగా మారిన మల్లికార్జున చిత్రదుర్గ జిల్లాలో సెలబ్రిటీగా మారాడు. 'అప్పుల ఊబి నుంచి బయటపడ్డాను. ఒక ఇల్లు కట్టుకోవాలని అనుకొంటున్నాను. మిగిలిన డబ్బుతో మరింత భూమి కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకొంటా' అని మల్లికార్జున చెప్తున్నాడు. గత 15 ఏండ్లుగా ఉల్లిపాయలు పండిస్తున్న మల్లికార్జున.. ఏడాదికి కేవలం రూ.5 లక్షలు లాభం పొందేవాడు. ఉల్లిగడ్డ దొంగతనం జరుగకుండా మల్లికార్జున కుటుంబసభ్యులు కండ్లల్లో వత్తులు వేసుకొని మరీ కాపలాకాస్తున్నారు.



ఉత్తరప్రదేశ్ వారణాసిలో ఉల్లిగడ్డల దండలు మార్చుకుంటున్న వధూవరులు



కర్నూలు జిల్లా ఆదోనిలో ఉల్లిగడ్డల కోసం క్యూలైన్‌లో నిలుచున్న మహిళలు

**ఉల్లి కోసం కిలోమీటర్ క్యూ**

రోజులు గడుస్తున్నా ఉల్లి కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఉల్లిపాయల్ని పొందేందుకు ప్రకాశం జిల్లా ఒంగోలు రైతు బజార్ వద్ద కిలోమీటర్ క్యూ కడుతున్నారు. ఎండవేడిమి తట్టుకోలేక క్యూలో చెప్పులను వరుసగా పెట్టి నీడ పట్టున కూర్చుంటున్నారు. అటు కర్నూలు జిల్లా ఆదోనిలో కూడా రాయితీ ఉల్లిపాయల కోసం కిలోమీటర్ల మేర జనాలు క్యూ కట్టి గంటల తరబడి నిల్చుంటున్నారు. రెండ్రోజులుగా నో స్టాక్ బోర్డు పెట్టిన అధికారులు ఇవాళనే తిరిగి తెరువడంతో.. జనాలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### దుస్తులు కొనండి.. ఉల్లి ఉచితంగా పొందండి

దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు ఆకాశాన్నంటడంతో పలువురు వ్యాపారులు తమ వ్యాపారాలకు అనువుగా మార్చుకొంటూ వినియోగదారులను ఆకట్టుకొంటున్నారు. మహారాష్ట్రలోని థానేకు చెందిన ఓ వస్త్ర దుకాణం యజమాని.. తమ వద్ద దుస్తులు కొనుగోలుపై ఉచిత ఉల్లిపాయల ఆఫర్ ప్రకటించారు. వేయి రూపాయల వస్త్రాల కొనుగోలుపై కేజీ ఉల్లిపాయలు ఉచితంగా ఇవ్వనున్నట్టు ఉల్హాస్‌నగర్‌కు చెందిన శీతల్ హ్యాండ్‌ల్యూమ్స్ యజమాని పేర్కొన్నారు. ఈ ఆఫర్ వినియోగదారులను ఆకర్షించడంతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది.



## 1300 కోట్ల నార్కోటిక్స్ పట్టివేత

9 మందితో కూడిన అంతర్జాతీయ ముఠా అరెస్ట్



**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలో భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. 9 మందితో కూడిన అంతర్జాతీయ ముఠాను నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు శనివారం పట్టుకొన్నారు. డ్రగ్ సిండికేట్ వద్ద పట్టుబడిన 20 కిలోల కొకైన్ విలువ రూ.1,300 కోట్ల మేర ఉంటుందని ఎన్సీబీ ఆదివారం వెల్లడించింది. ఈ ముఠా వెనుక పెద్ద హస్తం ఉన్నట్టు తెలుస్తున్నది. అంతర్జాతీయంగా ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, ఇండోనేషియా, శ్రీలంక, కొలంబియా, మలేషియా, నైజీరియా దేశాలతోపాటు మన దేశ రాజధాని ఢిల్లీతోపాటు పంజాబ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలతోపాటు గ్రూపులుగా ఏర్పడి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నట్టు ఎన్సీబీ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో అరెస్ట్ అయిన 9 మందిలో ఐదుగురు భారతీయులు ఉండగా.. ఇద్దరు నైజీరియన్లు, అమెరికా, ఇండోనేషియా నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. భారత్‌లో పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయంగా రూ.100 కోట్లు ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఆపరేషన్‌లో భాగంగా ఆస్ట్రేలియాలో అక్కడి అధికారులు 55 కేజీల కొకైన్, 200 కేజీల మెథాంపేటమిన్‌ను స్వాధీనం చేసుకొన్నట్టు ఎన్సీబీ అధికారులు తెలిపారు.

## చెప్పులు దాచె.. పెండ్లి నిలిచె

- వివాహ వేదికపై 'జూటా చురాయి'లో వివాదం
- మహిళను తిట్టిన వరుడు.. పెండ్లి రద్దు చేసిన వధువు
- రూ.10 లక్షల కట్నం తిరిగిస్తామని అంగీకారం

**ముజఫర్‌నగర్:** పెండ్లి వేడుకలో జరిపించే ఆచారం వివాదంగా మారింది. పెండ్లి రద్దయ్యేలా చేసింది. 'జూటా చురాయి' (వరుడి చెప్పులు దాచే కార్యక్రమం) నిర్వహిస్తుండగా వరుడు ఓ మహిళను తిట్టడంతో వివాహాన్ని రద్దు చేసిందో వధువు. పెండ్లి బరాత్‌ను తిప్పి పంపింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా సిసౌలి గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. వధువుకు చెల్లెలి వరుస అయ్యే యువతులు.. వరుడి చెప్పులు దాచి పెట్టి, డబ్బులు డిమాండ్ చేయడం అనేది ఆచారం. చెప్పులు దాచిపెట్టిన క్రమంలో వరుడు 22 ఏండ్ల వివేక్‌కుమార్‌తో మహిళ పరిహాసం ఆడగా, అతడు తిట్టాడు. వధువు కుటుంబ సభ్యులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. మరింత తిడుతూనే అడ్డొచ్చిన మరో వ్యక్తిపై వరుడు చెయ్యి చేసుకున్నాడు. ఈ విషయం వధువుకు తెలియడంతో ఆమె పెండ్లిని రద్దు చేసుకున్నారు. పెండ్లికి వచ్చిన బరాత్‌ను తిరిగి పంపించేశారు. వధువు కుటుంబసభ్యులు.. వరుడు, అతడి తండ్రితోపాటు మరో ఇద్దరు బంధువులను నిర్బంధించారు. తీసుకున్న రూ.10 లక్షల కట్నం తిరిగి ఇచ్చేస్తామని వరుడి కుటుంబం అంగీకరించడంతో వారిని వదిలిపెట్టారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఇరు కుటుంబాలు రాజీకి వచ్చాయని ఎస్‌హెచ్‌వో విరేంద్ర కాసాన తెలిపారు. గ్రామస్తులు జోక్యం చేసుకున్నప్పటికీ.. పెండ్లి చేసుకునేందుకు వధువు నిరాకరించింది.

## కాలుష్యం వసూళ్లు@382 కోట్లు

వెల్లడించిన సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్

**నోయిడా:** కాలుష్య నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి జరిమానాల రూపంలో రూ.382 కోట్లు వచ్చినట్టు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించింది. నోయిడాకు చెందిన రంజన్ తోమర్ అనే ఆర్టీఐ కార్యకర్త చేసుకొన్న దరఖాస్తుకు సీపీసీబీ జవాబిచ్చింది. తొలుత తమ వద్ద ఎలాంటి డేటా లేదని బుకాయించినప్పటికీ.. చివరకు తమకు తాముగా జరిమానాల రూపంలో జమ చేసిన మొత్తాన్ని ఆర్టీఐ కార్యకర్తకు తెలియజేసింది. 2017-18 సంవత్సరంలో రూ.31.85 కోట్లు, 2018-19లో జరిమానాల కింద రూ.227.94 కోట్లు జమైనట్టు సీపీసీబీ పేర్కొన్నది. 2019-20లో అక్టోబర్ 31వరకు రూ.122.27 కోట్లు పరిహారంగా స్వీకరించినట్టు తెలిపింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కింద సీపీసీబీ పనిచేస్తూ.. నీరు, వాయు కాలుష్యం నివారణ, నియంత్రణకు కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది. రాష్ట్రాల్లోని కాలుష్య నియంత్రణ మండలుల కార్యకలాపాలను సమన్వయం చేసుకోవడంతోపాటు వారి మధ్య వివాదాలను పరిష్కరించడం సీపీసీబీ బాధ్యత. 'పర్యావరణ ఉల్లంఘనలపై ఎలాంటి డేటా లేదని చెప్పి నా దరఖాస్తు కేసు మూసేశారు. అనంతరం, కేసును మళ్లీ వారే తెరిచి సేకరించిన మొత్తాన్ని పేర్కొంటూ నాకు సమాధానం పంపారు' అని రంజన్ తోమర్ చెప్పారు. నీరు, వాయు కాలుష్యానికి సంబంధించిన డేటాను సేకరించి సంకలనం చేసి సీపీసీబీ ప్రచురిస్తుంది.

## బిర్యానీ అమ్ముతున్నాడని దళితునిపై దాడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** దళిత వ్యక్తి బిర్యానీ విక్రయిస్తున్నాడని కొందరు అతడిపై దాడిచేశారు. దేశరాజధాని ఢిల్లీకి 66 కిలోమీటర్ల దూరంలో గ్రేటర్ నోయిడాలోని రాబుపురలో ఈ దాడి జరిగింది. రోడ్డువెంట చిన్న దుకాణం పెట్టుకొని కూరగాయల బిర్యానీ విక్రయిస్తున్న దళితుడు లోకేశ్(43)ను కులం పేరుతో దూషిస్తూ కొందరు భౌతికదాడికి పాల్పడ్డారు. శుక్రవారం జరిగిన దాడికి సంబంధించిన వీడియో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పలుమార్లు తాము హెచ్చరించినా అతను బిర్యానీ విక్రయిస్తున్నాడనే ఆగ్రహంతో వారు దళితుడిపై దాడికి ఒడిగట్టినట్టు స్థానికులు తెలిపారు. ముగ్గురు నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు.. త్వరలోనేవారిని అరెస్టుచేస్తామని తెలిపారు. కాగా, ఈ దాడిని సినీనటి ఊర్మిళా మటోండ్కర్ ఖండించారు. 'భారతీయులుగా మనం అంటరానితనం పాటించడం మన సంస్కృతి కాదు. ఇది నాగరికం అనిపించుకోదు. దళితుడిపై దాడి ఘటన సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ ఉద్దేశానికి పూర్తి విరుద్ధం' అని ఆమె హిందీలో ట్వీట్‌చేశారు.

## వ్యాధుల గుర్తింపునకు పరిశోధనలు

హైదరాబాద్‌లో ఎన్సీడీసీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజల్లో వ్యాప్తి చెందే వ్యాధులు, ఆయా సీజన్లలో విజృంభించే వైరస్‌లను గుర్తించేందుకు హైదరాబాద్‌లో పరిశోధనా కేంద్రం ఏర్పాటుకానున్నది. ప్రపంచీకరణతో ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణవాసులకు సోకే వైరస్‌ను పరిశోధనల ద్వారా గుర్తించి వైద్య చికిత్సా విధానాలను సూచించి ప్రజలను అప్రమత్తం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు జాతీయ అంటువ్యాధుల నియంత్రణ సంస్థ (ఎన్సీడీసీ) ఆధ్వర్యంలో ల్యాబ్, పరిశోధనా కేంద్రం ఏర్పాటుచేసేందుకు కేంద్రం అనుమతించింది. గత శుక్రవారం కేంద్ర బృందం హైదరాబాద్‌కు వచ్చి మంత్రి ఈటల రాజేందర్‌తోపాటు వైద్యశాఖ అధికారులతో చర్చించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఎన్సీడీసీ కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు ఆమోద ముద్రవేసింది. కొత్తగా వచ్చే వైరస్‌లను గుర్తించేందుకు ప్రస్తుతం పుణె, ఢిల్లీ ల్యాబ్‌లకు పంపాల్సి వస్తున్నది. ఈ కేంద్రం ఏర్పాటుతో హైదరాబాద్‌లోనే పరిశోధనలు జరిపే అవకాశం ఏర్పడనున్నది. ఎన్సీడీసీ ల్యాబ్, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలకు కేంద్రం సాయం అందించనున్నది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి భవనం అందుబాటులోకి తెచ్చేవరకు ప్రస్తుతం కోఠిలోని వైద్యారోగ్య, కుటుంబసంక్షేమశాఖ కార్యాలయం ప్రాంగణంలోని ఒక భవనంలో తాత్కాలికంగా ఎన్సీడీసీ కేంద్రం నిర్వహించనున్నారు. వారంరోజుల్లో ఈ కేంద్రం ఏర్పాటుకు అనువైన సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించనున్నారు.

**వ్యాధుల గుర్తింపునకు అవకాశం**

రాష్ట్రానికి ఎన్సీడీసీని కేంద్రం అనుమతించడంతో ఆయా వ్యాధుల మూలాలను గుర్తించే అవకాశం ఏర్పడింది. దీంతో అంటువ్యాధులపై నిరంతరం పరిశోధనలు కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. గనేరియా, యూసా, వైరల్ హెపటైటిస్, రేబిస్, లెప్టోస్పైరోసిస్, స్వైన్‌ఫ్లూ, బర్డ్‌ఫ్లూ, జికా వంటి వ్యాధుల నియంత్రణ, నిర్మూలనలో ఎన్సీడీసీ కీలకంగా వ్యవహరిస్తున్నది. వ్యాధుల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు తక్షణమే నిర్ధారణ పరీక్షలు, పరిశోధనలు, సత్వర చర్యలు, అవగాహన, శిక్షణ వంటి కార్యక్రమాల నిర్వహణలోనూ ఎన్సీడీసీ ప్రయోగశాల, పరిశోధనా కేంద్రం కీలకంగా వ్యవహరించే అవకాశం ఉన్నది.

### వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేపై అభ్యంతరకర పోస్టు

ఏపీలోని నెల్లూరులో ఇద్దరి అరెస్టు

**గుంటూరు:** ఏపీలోని చిలుకలూరిపేట వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే విడదల రజనీపై ఫేస్‌బుక్‌లో అభ్యంతకర పోస్టులు పెట్టిన నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ సానుభూతిపరులను పోలీసులు ఆదివారం అరెస్టుచేశారు. విడవలూరుకు చెందిన సత్యవోలు హరిప్రసాద్‌రెడ్డి అలియాస్ సత్యంరెడ్డి.. ఎమ్మెల్యే ఫోటోపై ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలతో పోస్టింగ్ పెట్టాడు. దానికింద పంతగాని ప్రవీణ్ అసభ్యకర కామెంట్స్ పెట్టాడని చిలకలూరిపేటకు చెందిన వైఎస్సార్సీపీ నేత మారుబోయిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

# టిక్‌టాక్ సెలబ్రిటీగా..


రాశీఖన్నా

'ఢిల్లీ సోయగం రాశీఖన్నా మంచి స్పీడుమీదుంది. తెలుగు చిత్రసీమలో వరుస సినిమాలతో దూసుకుపోతున్నది. సాయితేజ్ సరసన ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'ప్రతిరోజూ పండగే'. మారుతి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను రాజమండ్రికి చెందిన టిక్‌టాక్ సెలబ్రిటీ ఏంజెల్ అరుణ పాత్రలో కనిపిస్తా. తొలుత నాకు టిక్‌టాక్ అంటే సదభిప్రాయం ఉండేది కాదు. ఈ సినిమా కోసం టిక్‌టాక్ గురించి తెలుసుకున్నా. క్రమంగా అందులో ఉండే వినోదం ఏమిటో అర్థమైంది. ఈ యాప్ ద్వారా చాలా మంది తమలోని యాక్టింగ్ టాలెంట్‌ను చాటుతున్నారు. ఏంజెల్ అరుణ్ పాత్ర టిక్‌టాక్ మీద వ్యంగ్యంగా ఉండదు. ఆద్యంతం సరదాగా సాగుతుంది. నా పాత్ర కోసం కొంతమంది టిక్‌టాక్ సెలబ్రిటీలను కూడా కలిశాను. వ్యక్తిగత జీవితంలో నాకు సిగ్గు ఎక్కువ. సెల్ఫీలు తీసుకోవడం కూడా ఇష్టం ఉండదు. అలాంటిది ఈ సినిమా కోసం టిక్‌టాక్ వీడియోలు చేశాను. 'జిల్' సినిమా తర్వాత అల్లరిగా సరదాగా సాగే అమ్మాయి పాత్రను ఈ సినిమాలో పోషించాను. 'ప్రతిరోజూ పండగే' సంపూర్ణ కుటుంబ కథా చిత్రం. హృద్యమైన సన్నివేశాలతో వినోదం ప్రధానంగా సాగుతుంది. నేను కథానాయికగా నటించిన 'వెంకీ మామ' ఈ మధ్యే విడుదలైంది. వారం వ్యవధిలోనే 'ప్రతిరోజూ పండగే' ప్రేక్షకులముందుకొస్తున్నది. నేను ఏదీ ప్లాన్ చేసుకోలేదు. వరుస సినిమాలు చేయడం ఆనందంగా ఉంది. 'వెంకీమామ'లో నేను పోషించిన హారిక పాత్రకు మంచి స్పందన లభిస్తున్నది. విజయ్ దేవరకొండతో కలిసి నేను నటిస్తున్న 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రం ఫిబ్రవరిలో విడుదలకానుంది. మరి కొన్ని చిత్రాలకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. అవి ఫైనలైజ్ అయ్యాక వివరాలు తెలియజేస్తా' అని చెప్పింది.


'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో మహేష్‌బాబు

# హీ ఈజ్ సో క్యూట్

'దేశాన్ని కాపాడే ఓ బాధ్యతాయుతమైన సైనికుడు సమాజంలోని అవినీతిపరులపై ఎలాంటి పోరాటాన్ని సాగించాడో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే' అంటున్నారు మహేష్‌బాబు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. దిల్‌రాజు సమర్పణలో రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. అనిల్‌రావిపూడి దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. విజయశాంతి కీలక పాత్రధారి. జనవరి 11న విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ 'మహేష్‌బాబు అభిమానులు కోరుకునే అన్ని హంగులున్న సినిమా ఇది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. 'హీ ఈజ్ సో క్యూట్' అనే రొమాంటిక్ గీతాన్ని సోమవారం విడుదలచేయనున్నాం. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుకను జనవరి 5న హైదరాబాద్‌లో నిర్వహించనున్నాం' అని తెలిపారు. రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్, సంగీత, బండ్లగణేష్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం:దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం:రత్నవేలు.

# మీసం మెలేసేలా సినిమా తీశాం!

'రైతుల మీద సినిమా చేయాలని చాలా కోరిక ఉండేది. ఎందుకోగానీ కుదరలేదు. ఈ సినిమా ద్వారా ఆ కోరిక కొంతవరకు తీరింది' అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రూలర్'. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక శనివారం ఏపీలోని విశాఖపట్నంలో జరిగింది. బాలకృష్ణ మాట్లాడుతూ 'నేను, కె.ఎస్.రవికుమార్, సి.కల్యాణ్ కాంబినేషన్‌లో చేసిన 'జైసింహా' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించారు. ఆ స్ఫూర్తితోనే 'రూలర్' సినిమా చేశాం. పరుచూరి మురళి అద్భుతమైన కథనందించారు. ఐదు నెలల్లోనే షూటింగ్ పూర్తిచేశాం. సంగీత దర్శకుడు చిరంతన్‌భట్‌తో చేస్తున్న మూడో సినిమా ఇది. చక్కటి స్వరాలను సమకూర్చాడు. తప్పకుండా అన్ని వర్గాల వారిని మెప్పించే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది' అన్నారు. 'ఓ పండగలాంటి సినిమా ఇది. మీసం మెలేసి మాట్లాడేలా ఉంటుంది. భారీ తారాగణం, నిర్మాణ వ్యయంతో కూడుకున్న ఈ సినిమాను దర్శకుడు ఐదు నెలల్లోనే పూర్తి చేశాడు. సంక్రాంతి భోజనాన్ని 25రోజుల ముందుగానే అందిస్తున్నాం. బాలకృష్ణ పేరును మరింత ఇనుమడింపజేసేలా ఈ సినిమా ఉంటుంది' అని నిర్మాత సి.కల్యాణ్ తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ ''జైసింహా' తర్వాత బాలకృష్ణతో చేస్తున్న సినిమా ఇది. ఆయన అభిమానులకు కావాల్సిన అన్ని హంగులుంటాయి. ఈ సినిమాకు ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణుల బృందం కుదిరింది' అని పేర్కొన్నారు. ''రూలర్' పేరు బాలకృష్ణకు పర్ఫెక్ట్‌గా సరిపోతుంది. ఈ టైటిల్ నేను రిజిస్టర్ చేసుకొని ఓ పాట కూడా తయారుచేసుకున్నా. ఇప్పుడు అది బాలయ్య బాబుకే దక్కింది. ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని బోయపాటి శ్రీను తెలిపారు. ఈ వేడుకలో రాజశేఖర్, జీవిత, అంబికాకృష్ణ, కథానాయికలు సోనాల్‌చౌహాన్, వేదిక తదితరులు పాల్గొన్నారు.


సి.కల్యాణ్, వేదిక, బాలకృష్ణ, సోనాల్‌చౌహాన్, కె.ఎస్.రవికుమార్, చిరంతన్‌భట్

# రాఖీభాయ్ హీరోయిజం


యష్

యష్ కథానాయకుడిగా నటించిన 'కేజీఎఫ్' చిత్రం కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నది.ప్రస్తుతం ఈ చిత్రానికి 'కేజీఎఫ్ – ఛాప్టర్ 2' పేరుతో సీక్వెల్ రూపొందుతున్నది. ప్రశాంత్‌నీల్ దర్శకుడు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. వారాహి చలన చిత్రం సంస్థ తెలుగులో విడుదలచేయనున్నది. శ్రీనిధిశెట్టి కథానాయిక. ఈ నెల 21న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదలచేయనున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'తొలిభాగం ఘనవిజయంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు దీటైన కథ, కథనాలు, హీరోయిజంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. రాఖీభాయ్‌గా యష్ పాత్ర శక్తివంతంగా ఉంటుంది. చిత్రీకరణ శరవేగంగా జరుపుతున్నాం. అధీరగా సంజయ్‌దత్ పాత్ర ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదలచేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రవిబర్సూర్, సినిమాటోగ్రఫీ: భువన్ గౌడ.

# సినీతారతో ప్రేమాయణం


ధనుష్, మేఘాఆకాష్

ధనుష్, మేఘాఆకాష్ జంటగా నటించిన తమిళ చిత్రం 'ఎనైనోకి పాయుత్‌తోట'. ఈ చిత్రాన్ని 'తూటా' పేరుతో విజయభేరి పతాకంపై జి.తాతారెడ్డి, జి.సత్యనారాయణరెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. గౌతమ్ మీనన్ దర్శకుడు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'సినీ నటితో ప్రేమలో పడిన ఓ విద్యార్థి కథ ఇది. వారి ప్రేమకు ఎలాంటి అడ్డంకులు ఎదురయ్యాయన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది. హృద్యమైన ప్రేమకథతో గౌతమ్ మీనన్ ఈ సినిమాను రూపొందించారు. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. తమిళంలో పెద్ద విజయాన్ని సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. శశికుమార్ రాకేందుమౌళి, ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: దర్బుక శివ, సమర్పణ:గొలుగూరి రామకృష్ణారెడ్డి.


కార్తి

**పదమూడేళ్ల సినీ కెరీర్‌లో పంతొమ్మిది సినిమాలు మాత్రమే చేశారు కార్తి. ఈ లెక్కలు చాలు హీరోగా అతడి ప్రయాణంలోని వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి. ప్రయోగాత్మక కథాంశాలు, సవాళ్లతో కూడిన పాత్రలతో విలక్షణతకు చిరునామాగా నిలుస్తున్నారాయన. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'దొంగ'. జీతుజోసెఫ్ దర్శకుడు. ఈ నెల 20న ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో కార్తి పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**

# ఈ దొంగ మనసుల్ని దోచేస్తాడు!

**'ఖైదీ' తర్వాత వస్తున్న ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి? వాటిని అందుకోగలనని అనుకుంటున్నారా?**

అంచనాల గురించి ఆలోచించి నేనెప్పుడూ సినిమాలు చేయను. నా మనసుకు నచ్చిన కథల్లో మాత్రమే నటిస్తున్నాను. అందుకే పదమూడేళ్ల ప్రయాణంలో 19 సినిమాలు మాత్రమే చేశాను. ఈ ప్రయాణంలో కొన్ని తప్పులు చేశాను. వాటి నుంచి చాలా పాఠాలు నేర్చుకున్నాను. పరాజయాలు నేర్పిన అనుభవాలతో కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటున్నాను.

**కాంబినేషన్‌ను నమ్మి ఈ సినిమా చేశారా? కథ నచ్చి నటించారా?**

బాలీవుడ్ చిత్రం 'రంగ్‌దే బసంతి'కి కథను అందించిన రెన్సిల్ డిసిల్వా చెప్పిన పాయింట్ నచ్చి ఈ సినిమా చేశాను. కథలో కీలకంగా ఉండే అక్క పాత్రలో వదిన జ్యోతిక నటిస్తే బాగుంటుందని అనిపించింది. తనకు కథ నచ్చడంతో ఇద్దరం కలిసి ఈ సినిమా చేయాలని నిశ్చయించుకున్నాం. దర్శకుడి కోసం అన్వేషిస్తున్న సమయంలో జీతుజోసెఫ్ పేరును నిర్మాతలు సూచించారు. దర్శకత్వం చేయడానికి ఆయన అంగీకరించడంతో సినిమా విజయంపై నమ్మకం పెరిగింది.

**మీ గత సినిమాలతో పోలిస్తే ఇందులో ఉన్న కొత్తదనమేమిటి?**

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సస్పెన్స్, కామెడీ, థ్రిల్లింగ్, ఎమోషన్స్ కలబోతగా ఉంటుంది. సత్యరాజ్ పాత్ర భిన్న పార్శ్వాలతో సాగుతుంది. చాలా రోజుల తర్వాత తనకు అభినయానికి ప్రాధాన్యమున్న మంచి పాత్ర దొరికింది. వదిన జ్యోతిక స్కూల్ టీచర్‌గా కనిపిస్తుంది. షావుకారు జానకి, నిఖిలా విమల్, సీత ప్రతి పాత్రకు కథలో ప్రాధాన్యముంటుంది. కె.విశ్వనాథ్ చిత్రాల తరహాలో పాత్రల మధ్య వచ్చే సంభాషణలన్నీ చక్కటి అనుభూతిని పంచుతాయి.

**ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'దొంగ' అనే టైటిల్ పెట్టారెందుకని?**

మనసుల్ని దోచే ఓ దొంగ కథ ఇది. ఆ దొంగలో ఎలా పరివర్తన వచ్చింది?అతడి ప్రయాణం ఏమిటన్నది ఈ చిత్ర ఇతివృత్తం. టైటిల్ చూసి చాలా మంది మాస్ సినిమా అనుకుంటున్నారు. విభిన్నమైన ఎమోషన్స్‌తో కూడిన కుటుంబకథా చిత్రమిది. యాక్షన్, ఎమోషన్స్‌తో కూడిన సినిమాల్లో నటించడాన్ని నేను ఎంజాయ్‌చేస్తాను. కానీ పాటలు అనగానే జ్వరం వచ్చిన ఫీలింగ్ మొదలవుతుంది. (నవ్వుతూ).

**వరుసగా చిరంజీవి టైటిల్స్‌తో సినిమాలు చేస్తున్నారు?**

కథానుగుణంగా ఈ టైటిల్ పెట్టాం. అంతేకానీ ప్రేక్షకుల్ని ఆకట్టుకోవాలనే ఆలోచనతో చిరంజీవి టైటిల్ పెట్టలేదు.

**వదిన జ్యోతికతో తొలిసారి సినిమా చేశారు?ఆ అనుభవం ఎలా ఉంది.**

వదినతో కలిసి నటించిన సమయంలో షూటింగ్ చేస్తున్న అనుభూతి ఏ రోజు కలగలేదు. ఇంట్లో డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని మాట్లాడుకున్నట్లుగానే కెమెరా ముందు నటించాం. మా ఇద్దరి మధ్య వచ్చే పంచ్‌లతో కూడిన సంభాషణలు నవ్విస్తాయి. చాలా రోజుల ముందుగానే తన పాత్ర కోసం సన్నద్ధమై సింగిల్ టేక్‌లోనే సన్నివేశాల్ని పూర్తిచేసేది. ఆమె అనుభవం నా పాత్ర బాగా రావడానికి ఉపయోగపడింది.

**కొత్త దర్శకులతో పోలిస్తే అనుభవజ్ఞులైన దర్శకులతో పనిచేయడం సులభమని అనుకుంటున్నారా?**

ఎలాంటి ఒత్తిడి లేకుండా కేవలం నా పాత్ర గురించే ఆలోచిస్తూ రిలాక్స్‌డ్‌గా ఈసినిమాలో నటించాను. కొత్త టీమ్‌తో పనిచేస్తున్నప్పుడు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. అనుభవం లేకపోవడంతో సాంకేతిక నిపుణులు ఎలా పని చేస్తున్నారో ప్రతిక్షణం గమనిస్తూ ఉండాల్సివుంటుంది. చాలా రోజుల తర్వాత జీతుజోసెఫ్‌లాంటి అనుభవజ్ఞుడైన దర్శకుడిగా పనిచేయడం ఆనందంగా ఉంది. టీమ్ సమిష్టి కృషితో మంచి సినిమా చేశారు. సీనియర్ దర్శకుడితో కాకుండా నా కాలేజ్‌మేట్‌తో పనిచేసిన అనుభూతి కలిగింది. నా కెరీర్‌లో అనుకున్న సమయంలో పూర్తిచేసిన సినిమా ఇది.

**అవార్డుల కోసమే 'ఖైదీ'తో పాటు ఈ సినిమాలో నటించారని అనుకోవచ్చా?**

'ఈ సినిమాతో మీకు అవార్డులు రావాలని కోరుకుంటున్నారా' అని షూటింగ్ మొదలయ్యే సమయంలో దర్శకుడు జీతుజోసఫ్ అడిగారు. అవార్డులు వద్దు. కుటుంబమంతా ఆనందించే మంచి సినిమా చేస్తే చాలని ఆయనతో చెప్పాను. 'ఖైదీ' సినిమాలో అవార్డులు రావాలనే ఆలోచనతో నటించలేదు. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా వైవిధ్యమైన ప్రయత్నం చేశాం. సినిమా రూపకల్పనలో ఉండే రూల్స్‌ను ఆ సినిమాతో బ్రేక్ చేయాలనుకున్నాం. కథానాయకుడిగా ప్రతి సినిమాలో అలాంటి సవాళ్లను నేను కోరుకుంటాను.

**మణిరత్నం కొత్త సినిమాలో మీరు నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి?**

మణిరత్నం రూపొందిస్తున్న 'పొన్నియన్ సెల్వన్'లో నటిస్తున్నాను. ప్రస్తుతం థాయ్‌లాండ్ చిత్రీకరణలో పాల్గొంటున్నాను.

# స్పోర్ట్స్ డ్రామా షురూ..


తమన్నా, గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా సంపత్‌నంది దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఆదివారం మొదలైంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. తమన్నా, దిగంగనా సూర్యవన్షీ కథానాయికలు. నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నాం. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందిస్తున్న చిత్రమిది. భూమిక, రావు రమేష్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. మిగతా షెడ్యూల్స్‌ను రాజమండ్రి, ఢిల్లీలో పూర్తి చేసి వేసవి కానుకగా చిత్రాన్ని విడుదల చేస్తాం. కబడ్డీ నేపథ్యంలో సాగే చిత్రమిది. తెలంగాణ మహిళా కబడ్డీ టీమ్ కోచ్‌గా తమన్నా, ఆంధ్రా మహిళా కబడ్డీ టీమ్ కోచ్‌గా గోపీచంద్ కనిపిస్తారు. భావోద్వేగభరితంగా సాగే స్పోర్ట్స్ డ్రామాగా ఆకట్టుకుంటుంది' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: మణిశర్మ, సమర్పణ: పవన్‌కుమార్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: సంపత్‌నంది.

